


ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
25 నయాపైసల
23-10-57
ANDHRA PATRIKA



వారణాసిలో వ్యాసఘట్టం

—ఫొటో : "[illegible]"


25 వ.తే
ప్రారంభము
రాజశ్రీ
ప్రొడక్షన్స్ వారి
సతీ
అనసూయ
రాజశ్రీ విడుదల

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 10
30-10-57

Founder : K. NAGESWARA RAO


హేవిళంబి కార్తీకం, అష్టమి, బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం:
విక్రం ప్రొడక్షన్స్‌వారి "కుటుంబ గౌరవం" చిత్రంలో
సావిత్రి.

కృత్రిమ చంద్రగోళం—	3
న్యూఢిల్లీ లేఖ—శ్రీ కృష్ణ	4
ఉత్తరం రాసిపెట్టాలంటే...కృష్ణశ్రీ	5
పార్వతి—కుమారి నందుల సుశీలా దేవి	6
నక్షత్ర ఫలితాలు—బి. నరసింగరావు	9
ప్రకృతి పరిష్కారం—గాడేపల్లి సీతారామయ్య	13
యథాపూర్వం—'కనక్ ప్రవాసి'	17
విక్రమార్కుడి మార్కుసింహాసనం—ఎస్. పార్థసారధి	20
బడ్జెట్ ప్రసంగం—జి. రామకృష్ణ	25
అత్తగారూ—ఆచారాలూ—శ్రీమతి పి. భానుమతి	28
గుంద్రని భూలోకం—తెన్నేటి అహల్యా దేవి	33
వనితాలోకం—	35
ఈ చలికాలములో—కొత్తపల్లి రాజ్యలక్ష్మి	36
కార్తిక దీపాలు—బి. ఎస్. లక్ష్మి	37
శాశ్వతమైన డిజైన్‌లు—ఎస్. అనంతలక్ష్మి ప్రభాకరం	38
దానిమ్మలో...కాశీనాథుని లక్ష్మీకాంతం	39
వనితావాణి—	41
కోటివిద్యలూ కూటికొరకే—నారాయణం పుణ్యవతి	42
పండుగ బహుమతి—"మధుశ్రీ"	43
శ్రీ రాసన్న ప్రియుడు—ఏడిద వెంకటసత్యనారాయణమూర్తి	44
సినిమా—	50



స్పుత్నిక్ తిరిగే మార్గం :—96.2 నిమిషాల కొకసారి భూమిని చుట్టివస్తుంది. భూమధ్యరేఖకు 65° కోణంలో స్పుత్నిక్ మార్గం ఉండడంచేత, ఏడుసార్లు అలా తిరిగేసరికి దాదాపు ప్రపంచ దేశాలన్నిటినీ ఒకసారి చూసివచ్చినట్లవుతుంది.
—చిత్రం : "టైమ్" పత్రికనుంచి.]

ఇప్పటికీ తిరుగుతున్న కృత్రిమ చంద్రగోళం


రష్యన్ శాస్త్రజ్ఞులు ఎగరేసిన కృత్రిమ ఉపగ్రహం ఇంకా భూమిచుట్టూ వలయ విహారం చేస్తూనే ఉంది. దాన్ని అంతరిక్షానికి తీసుకువెళ్ళిన రాకెట్ కూడా ఇంకా తిరుగుతూనే ఉంది. రోజురోజుకూ రాకెట్ వేగం ఎక్కువవుతోందనీ, కృత్రిమ ఉపగ్రహంకంటె అది కొన్ని వేలమైళ్ళు ముందుపోతోందనీ వార్తలు వస్తున్నాయి. బహుశా దీని అర్థం రాకెట్ క్రమంగా భూమికి దగ్గిరి దగ్గిరిగా వచ్చేస్తోందని కావచ్చు. భూమికి దగ్గిరిగా వచ్చినకొద్దీ వలయగమనం నిలుపుకోడానికి ఎక్కువ వేగం అవసరమవుతుంది గనుక క్రమంగా రాకెట్ క్రిందికి దిగిపోతూ, కొద్ది రోజుల్లో సాధారణ ఉల్కల్లాగా వాతావరణంలోపడి భస్మమైపోవచ్చుననీ అంటున్నారు. అయితే కొన్ని సూక్ష్మశకలాలు నేలమీదపడితే పడవచ్చునట. ఆ శకలాలను దొరికితే పరీక్షించి కొన్ని కొన్ని శాస్త్ర విషయాలు తెలుసుకోవచ్చుననికూడా రష్యన్లు భావిస్తున్నారు.

మొత్తంమీద కృత్రిమ ఉపగ్రహంమీద జనసామాన్యానికి మొదట్లో ఉన్న గాఢాసక్తి క్రమంగా చప్పబడిపోతోంది. మానవుడు ఒక అపూర్వ వైజ్ఞానికవిజయం సాధించాడనేదే జనసామాన్యానికి ఆశ్చర్యం, కుతూహలం కలిగించిన విషయం. దరిమిలా దానివల్ల బయటపడే వైజ్ఞానిక విషయాలన్నీ శాస్త్రజ్ఞుల్లో శాస్త్రజ్ఞులు తెలుసుకుని, తర్జనభర్జనలుపడి ఉపయోగించుకోవలసిన రహస్యాలే. ఆ వైజ్ఞానిక రహస్యాలవలన ఇప్పట్లో జనసామాన్యానికి ఒరిగిపడేదేమీ లేదు. ముందుముందు ఆ శాస్త్ర విషయాలు మానవుని దైనందినజీవితానికి ఏ విధంగా ఉపకరిస్తాయనేది ఇప్పుడెవరూ నిర్ధారణగా చెప్పలేరు. అందుచేత మళ్లీ ఈ సారి ప్రపంచ ప్రజలను ఆశ్చర్యచకితుల్ని చేయాలంటే ఏ రష్యావారో, అమెరికా వారో ఇంకొక కృత్రిమ ఉపగ్రహాన్ని ఇప్పటి దానికంటె పెద్దదాన్ని, ఇంకా శక్తివంతమైనదాన్ని, ఇంకా ఎత్తుకు, వీలైతే అసలు చంద్రగోళానికి పంపించితే తప్ప లాభంలేదు.

రష్యావారు "త్వరలో" మరొక కృత్రిమ ఉపగ్రహాన్ని ఎగరెయ్యబోతున్నారని, భూభౌతిక సంవత్సరం ముగిసేలోగా (1958 డిసెంబరు 31) ఇంకో 94 ఎగరేస్తారని ఈ మధ్య రష్యా వెళ్ళివచ్చిన అమెరికన్ శాసనసభ్యుడొకాయన ప్రకటించాడు. వీటిలో 25 గోళాలను ఆర్కిటిక్ ప్రాంతం నుంచి, 70 గోళాలను అంటార్కిటిక్ ప్రాంతంనుంచి ఎగరేస్తారట.

ఇకముందు ఎగరేసే గోళాలను మళ్ళీ సురక్షితంగా నేలమీదికి దింపేందుకు కూడా తాము ప్రయత్నిస్తున్నామని మాస్కోలో శాస్త్రజ్ఞులు తెలిపారు. ఈ "భవిష్యద్గోళాలలో" టెలిస్కోపులు వుంటాయి. ఇప్పటిదాకా మనం సూర్యుణ్ణి, గ్రహాల్ని, నక్షత్రాల్ని దట్టమైన వాతావరణపు పొరల్లోంచి చూస్తున్నాము. ఈ పొరలమూలంగా

(48-వ పేజీ చూడండి)



★ రోగం ఒకటి! మందు మరొకటి! ★

జపాన్ పర్యటన ముగించుకొని ప్రధాని నెహ్రూ రాజధానికి తిరిగి వచ్చేశారు. ఆర్థికమంత్రి కృష్ణమాచారిగారి విదేశయాత్ర కూడా పూర్తికావచ్చింది. రేపో మాపో వీరూ స్వదేశానికి చేరుకుంటారు. ఆ యా దేశాలలో వీరిద్దరికీ బ్రహ్మాండమైన స్వాగత సన్మానాలు జరిగినవి. వాస్తవానికి వీటిని భారతదేశానికి జరిగిన అఖండ గౌరవంగా సె భావించాలి.

భారత రాజధానికి సంబంధించినంతవరకు దీన్ని సమావేశాలవారమనే చెప్పవచ్చు. ఆగ్నేయాసియా గ్రామీణ ఆరోగ్యాభివృద్ధి వ్యవహారాలమీద ఒక మహాసభ జరిగింది; ప్రాచ్యరాజ్యాలలో వ్యవసాయ నిర్వహణం, అభివృద్ధి సమస్యల పరిశీలనకు మరొక సమావేశం జరిపారు. దేశంలోని వివిధరాష్ట్రాల కార్మిక మంత్రుల మహాసభను ఏర్పాటు చేశారు. ఇవిగాక కార్మికస్థాయి సంఘ సమావేశం మరొకటి. మన జాతీయ దినపత్రికలన్నీ ఈసమావేశాలకు యథోచిత ప్రాధాన్యమిచ్చి పతాకశీర్షికలతో ప్రచురించినవి. ఈ సమావేశాలలో జరిగిన చర్చల ధోరణినిబట్టి చూస్తే, స్వతంత్ర భారతదేశం ఏ విషయాన్నైనా సూక్ష్మపరిశీలనచేసే బుద్ధికుశలతను కోల్పోయిందా అనే అనుమానం వేయక మానదు. అసలు సంగతిసందర్భాలేమిటో మనవిచేస్తాను.

భారతప్రభుత్వ ఆరోగ్యశాఖ మంత్రి కర్మార్కర్ ఆగ్నేయాసియా ప్రాంతీయ గ్రామీణ ఆరోగ్యాభివృద్ధి మహాసభకు ప్రారంభోత్సవం జరిపారు. వీరు తమ ప్రారంభోపన్యాసంలో జనాభా అభివృద్ధిని అదుపులో వుంచడానికి తీసుకునే చర్యలు సఫలీకృతం కావాలంటే, స్పష్టమైనఫలితాలు చేకూరాలంటే గ్రామీణ ఆరోగ్యాభివృద్ధి కార్యకలాపంలో ఆ చర్యలన్నీ ప్రధాన భాగంగా వుండితీరాలన్నది తమ అభిప్రాయమైనట్లు సెలవిచ్చారు. అయితే ఈ మహాదాశయాన్ని ఏవిధంగా ఆచరణలో పెట్టాలన్నదే చిక్కు సమస్య. గ్రామసీమలో జనాభా అదుపుకు ఏ చర్యలు అమలుజరప దలచినా, గ్రామాలలో ప్రస్తుతపరిస్థితులు ఎలా వున్నవనే విషయాన్ని విధిగా గ్రహించాలి.

గ్రామాలలో కులాసా కాలక్షేపానికి అనువైన సినిమాలు మొదలైన అవకాశాలు లేవన్నది మొదటి అంశం. నూరింట 90 వంతుల గ్రామాలకైనా విద్యుచ్ఛక్తి సరఫరా లేదు; విద్యుచ్ఛక్తివరకూ పోనవసరం లేదు; అసలు మామూలు దీపాల ఏర్పాటుకైనా మన గ్రామాలు నోచుకోలేదు!

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

సూర్యాస్తమయమైందంటే, కన్ను పొడుచుకున్నా కనబడని చిమ్మచీకట్లు! ఊరూ ఉవాం, ఇళ్ళూ వాకిళ్ళూ గాఢాంధకారం అలముకుంటుంది! ఇది రెండో విషయం.

గ్రామీణప్రజల నివాసాలలో అధిక భాగం చిన్న చిన్న కుటీరాలు. పట్టణ ప్రజలు నివసించే ఇళ్ళమాదిరి గదులు గదులుగా ఇవి వుండవు. మామూలుగా ఒక పెద్దసంసారం మొత్తం ఒక చిన్న కుటీరంలో నివసిస్తుంది. ఇది మూడో విషయం. ఇవి ఎవరూ కాదన లేని విషయాలు.

ఈపరిస్థితులలో నివసించే స్త్రీలు పురుషులు ప్రతి ఏడాదీ సంతానాన్నికని జనాభా పెరుగుదలకు తోడ్పడుతున్నారు. అందుచేతే మన దేశంలో అత్యంత జయప్రదమైన కుటీర పరిశ్రమ ఏదైనావున్నదా అని ప్రశ్న వేస్తే అది సంతానోత్పత్తేనని నిస్సందేహంగా సమాధానం చెప్పడం జరుగుతున్నది.

జనాభా విషయంలో మన నగరాలు కూడా ఇందుకు ఏమంత భిన్నంగా వున్నవని చెప్పడానికి వీల్లేదు. మనది 'నపుత్రస్య గతిర్నాస్తి' అనే ఆర్యోక్తిలో అఖండమైన విశ్వాసం వున్న దేశం. కనీసం ఒక్క కొడుకునైనా కంటే నే గాని తలిదండ్రులకు స్వర్గద్వారాలు తెరుచుకోవు! అందుచేతే మనది భవతీ భిక్షాందేహి అనే బిచ్చగాళ్లుకూడా పెళ్లాడే దేశం. కొత్తగా వెలుస్తున్న కుటుంబనియంత్రణ సలహా కేంద్రాలకు మామూలుగా స్త్రీలు ఎవరైనా వెళ్ళడం జరిగితే, కొడుకులనుకనే ఉపాయం ఏదైనావుంటే చెప్పమని అడగడానికి మాత్రమే - అంతేగాని కుటుంబ నియంత్రణంమీద ధర్మోపదేశాలు వినాలని కాదు.

పాశ్చాత్య రాజ్యాలలో సాధారణంగా ఆర్థికపరిస్థితులమీద వివాహ కార్యకలాపాలు, సంతానోత్పత్తి ఆధారపడివుండడం జరుగుతుంది అమెరికాలో పెళ్లిచేసుకోబోయేముందే ప్రతియువకుడూ, ప్రతి యువతీ సంపూర్ణ ఆరోగ్యంలో వున్నట్లు మెడికల్ సర్టిఫికెట్లు తీసుకోవలసివుంటుంది.

పాశ్చాత్యదేశాల పరిస్థితులు ఆ విధంగా వుంటే ఇక్కడ మనం ఇదమిత్థమని కార్యక్రమమేదీ లేకుండా ధర్మోపన్యాసాలతో కాలం వెళ్లబుచ్చడం జరుగుతున్నది. సరిఅయిన వార్తలు లేక గిలగిల్లాడే మన వార్తాపత్రికలలో చోటు నింపడానికి మాత్రమే ఈ ధర్మోపన్యాసాలు ఉపయోగపడతవి. అంతకుమించి వీటివల్ల నేటి భారతదేశానికి ప్రయోజనమేమీ వుండదు.

విద్యాధికులైన స్త్రీలు, పురుషులే జనాభా అదుపుకు సహాయపడని మనదేశంలో గ్రామసీమకు వెళ్లి కుటుంబనియంత్రణం విషయమై మహోపన్యాసాలుఇచ్చినందువల్ల లాభమేమిటి?

ఇంతేకాదు. స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వ ఆరోగ్యశాఖ ప్రమాణాలు మరీ క్షీణించి పోయినవి.—ముఖ్యంగా గ్రామసీమలో ఈ క్షీణత మరీ స్పష్టంగా కనిపిస్తుంది.

(49-వ పేజీ చూడండి)

ఉత్తరం రాసి పెట్టాలంటే....

వీధిలో అరుగుమీద కుర్చీలో ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆ వేళ ప్రొద్దుటే వేసవి సెలవలకు మావూరు వచ్చాను.

"చిన్నబాబూ! కొంచెం ఉత్తరం ముక్క రాసిపెడతారా."

ఒక్కసారిగా ఈ ప్రపంచంలో పడ్డాను. ఎదురుగా చిన్నప్పుడు నన్ను ఎత్తుకొని మోసిన వెంకమ్మ నిలబడి ఉంది.

"ఏం ఇలావచ్చావేం" అన్నాను సరిగా వినిపించుకోనట్లు.

"కొంచెం ఉత్తరం ముక్క రాసిపెడతారని."

"ఎవరికి?"

"ఇంకెవరికండీ? ...... మా మగోడికి" సిగ్గుతో చెప్పినట్లు చెప్పింది

"ఏం. ఇక్కడలేడా?" నా చిన్నప్పుడు మావూరిలోనే ఉండేవాడని జ్ఞాపకం.

"మీకు తెల్దేటి బాబూ! కంపునీపనట ఏదో. ఆడకుపోయినాడు."

"కార్డు తీసికొని వచ్చావా?"

"ఆఁ. తెచ్చాను. మూడుకానుల్దీ."

"ఏదీ. యిలాగియ్." చెయ్యిచాపాను.

కృష్ణశ్రీ

"రెండురోజుల్నించి చూస్తుంటే ఈ వేళ వచ్చేడు ఉత్తరాల బంట్రోతు" పడిన శ్రమ అంతా మాటల్లో చూపించింది.

కార్డుతీసికొని ఊరుపేరు రాసి తేదీ వేశాను.

"ఏం వ్రాయమంటావ్."

"నీ సంగతేమీ నాకు నచ్చలేదు" ఆమె కోపంగా అంది.

"నా సంగతి నీకు నచ్చకపోవటమేమిటే" నాకు భయం వేసింది దానిమాటలు ఎవరేనా విన్నారేమోనని. నేను ఆమె నేదో అన్నట్టు కూడా అనుమానపడవచ్చు.

"మీ సంగతికాదు బాబూ! మా మగోడిది" నాగుండె కుదటపడింది.

"ఏం ఎందుకు నచ్చలేదు?"

"మా మొగుడు పెళ్ళాల గొడవ మీకెందుకండీ? అలా రాయించండి."

"నేను ఉత్తరాలు రాసిపెట్టలేను. కర్ణంగారిలాంటివి బాగా రాస్తాడు. ఆయనదగ్గరికి వెళ్ళు" విసుగ్గా అన్నాను.

"అలా అంటే ఎలాగండీ? ముందే ఆయనదగ్గరకు వెళ్ళాను."

"ఏమన్నాడూ."

"ఎత్తే నాకు ఖాళీలేదు పొమ్మన్నాడు."

"నీకు నీ మొగుడిసంగతి ఎందుకు నచ్చలేదో కొంచెం చెప్పు. లేకపోతే వాడికెలా తెలుస్తుంది నీకెందుకు నచ్చలేదో;"

"నాకు డబ్బుపంపకపోతే ఎలా బతుకుతాననుకున్నావ్ గంపెడు సంసారంతో. నీవు మనిషిజన్మ ఎత్తలేదూ?" చరసని దంచేసింది.

ఏం వ్రాయాలో నాకు తెలియలేదు.

(47-వ పేజీ చూడండి)

ఉదయం ఎనిమిది గంటలవుతుంది. ఆవూరి నీలాటిరేవంతా అమ్మలక్కలతో నిండి వుంది. ఆవేళకి అక్కడకు రోజూ రకరకాలైన స్త్రీలు చేరతారు. అత్తలు, కోడళ్ళు, పెళ్ళయినవాళ్ళు, కన్యలు, బిడ్డతల్లులు ఆ ఊరి సమస్త స్త్రీజనం ఆ సమయానికక్కడే వుంటారు. అక్కడవున్న ఇసుకతో బిందెలు పరపరా తోముతూ రచ్చబండ తగాదా దగ్గర్నించి, చాకలి వీరమ్మ కూతురి శీలంవరకూ చర్చలు జరుపుతూవుంటారు ఆ గ్రామీణ భామినులు.

"ఏమే! కోడలుపిల్లా! కొంచెం నిదానించు మరి. పెద్దదాన్ని కదా అట్లా తోసుకుపోతావేం?" అంటూ జారిన ధవళమకుటాన్ని సరిచేసుకొంటూం దొక పూర్వసువాసిని.

"ఏవమ్మో! సీతా! మీ వదిన ఇక కాపరానికి రాదేమిటి?" అని ఓ పడుచుపిల్లను ప్రశ్నించిందో నడివయస్సావిడ.

"ఈ మాఘమి వెళ్ళాక వస్తుంది. అది సరే కాని మీ రెండో అమ్మాయిని కాన్పుకి మీయింటికి పంపనన్నారటగా ఆమె అత్తారు? పాపం తొలిసారి కూడాను!" అని ఎదురుదెబ్బతీసిందా పల్లెపడుచు.

"ఈ కాలపు ఆడపిల్లలకు సమాధానం చెప్పలేం తల్లీ" అంటూ మూతివిరుచుకొందా నడికారుభామ.

ఇంతలో ఆ రేవులోకి ఒకమ్మాయి తలవంచుకొని, బిందె పట్టుకొని వచ్చింది. సన్నగా, తెల్లగా, పొడవుగా, చూపరులను నిలబెట్టే సౌందర్యమామెది. కట్టుకొన్నది ముతకచీరైనా పొందికగా కట్టుకొన్నది. ఆ అమ్మాయిరాకతో అమ్మలక్కల నోళ్ళన్నీ కట్టుబడ్డాయి. అందరి దృష్టీ ఆమెమీద కేంద్రీకృతమైంది. ఆమె ఒక కాలు కొంచెము ఈడుస్తున్నది. నెమ్మదిగా మెట్లు దిగి బిందె నీటిలో ముంచింది. ఇంతవరకూ వాదనచేస్తున్న పిల్ల ఆ అమ్మాయని సమీపించింది.

"ఏమే! పార్వతీ! ఎక్కడా కనిపించడంలేదు? నాన్న వంట్లో ఖులాసాయేనా? పాపాయిని చూద్దుగాని మా ఇంటి కోమారు రావే!"

పార్వతి మెల్లగా నవ్వింది: "నాన్నకి వంట్లో బాగుండలేదు సీతా! పనితో తెమల్టంలేదు. మీ అత్తారింట్లో అంతా ఖులాసాయేనా?" అంది పార్వతి.

పార్వతిరాకతో అక్కడ గుసగుసలు ఎక్కువయాయి. ఓ ఇల్లాలు కొంచెం నిమ్మదిగా "మాణిక్యమంటిపిల్ల! ఆ కాలు వంకర లేకపోతే పార్వతికి సాక్షాత్తూ పార్వతేసాటి. ఆ పిల్ల దౌర్భాగ్యం కాబట్టే ఆ గర్భశ్రీమంతులింట బుట్టి చివరికీ గతిపట్టింది!" అని తన పక్కావిడతో గొణికింది. కొందరు పార్వతిని చూసి తమలో తాము నవ్వుకొంటున్నారు. పార్వతి ఇవేమీ పట్టించుకోకుండా తన మానాన తాను వెళ్ళిపోయింది.

పార్వతితండ్రి రంగయ్య ఒకప్పుడు గొప్పగా బతికిన మోతుబరి. ఆ గ్రామంలో రంగయ్య ప్రభ ఓదశ వెలిగిపోయింది. కాలక్రమేణా ఆస్తులు హరించిపోయాయి. రంగయ్య భార్య నరసమ్మ పార్వతి పుట్టిన

కుమారి నందుల సుశీలాదేవి

ఏణ్ణర్థానికి పసుపుకుంకుమలతో, బిడ్డను, భర్తను విడిచి పరలోకానికి వెళ్ళిపోయింది. రంగయ్య భార్యమరణంతో పసిపాప అయిపోయాడు. ఆ సమయానికే ఆస్తిమీద దావాలు మంచి పట్టులో ఉన్నై. భార్యమరణంతో విరక్తుడైన రంగయ్య దావాలమీద ఆసక్తి చూపలేదు. చివరకు రంగయ్య ఓ పాత పెంకుటిల్లుతో తిండికి మాత్రం సరిపడే కొంచెం భూమితో మిగిలాడు. కష్టాలనేవి రాకుండా ఉండాలేకాని, రావడం మొదలెడితే వాటి విశృంఖల విహారానికి హద్దుండదు.

బంగారు బొమ్మలాంటి పార్వతిని చూసుకొని రంగయ్య బ్రతుకుతున్నాడు. పార్వతి ఎనిమిదేళ్ళ పిల్లగా వుండగా ఓ రోజు పార్వతి నేస్తాలతో ఆడుకొంటోంది. ఆటల్లో కరణంగారి రామం పార్వతిని చెట్టుమీదనుంచి తోశేడు. పార్వతి కాలు వంకర తిరిగిపోయింది. రంగయ్య నెత్తీ నోరూ కొట్టుకుంటూ పట్నం తీసికెళ్ళాడు, కూతుర్ని. డాక్టరు కనీసం అయిదారు వందలు లేనిదే తానేమీ చెయ్యలేనన్నాడు. రంగయ్య అభిమానం వదిలి కరణాన్ని ప్రాధేయపడ్డాడు. రంగయ్య ప్రాపుతో ఇలుకట్టిన కరణం రంగయ్య కోర్కెను తీర్పలేదు. అంతే కాకుండా రంగయ్యకి తన పలుకుబడితో అప్పు పుట్టకుండా చేశాడు. పార్వతి కాలు బాగవలేదు. పార్వతి పెరిగి పెద్దదయింది. కాలులో లోపంవినా పార్వతి ఆ వూరి కన్నెపిల్లల్లో పుత్తడి బొమ్మ!

పార్వతి నీలాటిరేవునుంచి బిందతో ఇంట్లో ప్రవేశించింది. బిందదించి వంటింట్లోకి వెళ్ళింది.

"అమ్మా! పారూ! తల్లీ ఇల్లారా" అని సన్నగా మూలిగాడు తండ్రి.

కొంగుతో చెయ్యి తుడుచుకొంటూ పార్వతి వచ్చింది.

"చూడమ్మా! నా కర్ర ఇలాగియ్యి. ఆ వెంకయ్య ఏదో సంబంధం చెప్పాడు కనుక్కొస్తా!" అన్నాడు రంగయ్య మంచం మీదనుంచి లేస్తూ.

"అదేంటి నాన్నా! వంట్లో జ్వరంతో నువ్వెట్లా వెడతావు?"

"వెర్రితల్లీ! ఈ జ్వరం తగ్గేదికాదు. నిన్నో ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరుతుంది" అంటూ వీధిలోకి వెళ్ళాడు.

పార్వతి శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. తండ్రిశరీరం నానాటికీ శిథిలమవుతోంది. తనకు ఈడు మీరిపోతోంది. తన ఈడు పిల్లలు సీత, జానకి వాళ్ళంతా కాపరాలు చేసుకొంటున్నారు. తండ్రికి పెళ్ళిచేసే స్తోమతులేదు. ఏ సంబంధమయినా మూడు వేలు నాలువేలు అడుగుతారు. తనకాలు సంగతి తెలిస్తే మరీ తాడెక్కిపోతారు. తండ్రికి డబ్బు ఎక్కడనుంచి వస్తుంది? ఈ కాలంలో కాలి అవకరంలో తనని డబ్బులేకుండా కట్టుకొనే వాడెవడు? ఈ రోజుల్లో గడ్డిబొమ్మకి బట్టలు వేసి పిల్లనిస్తానంటే కట్నం అని గుడ్లెజేసుంది. ఇక తనబోటిదానిగతి? పోనీ పెళ్ళిచేసుకోపోనే! కాని ఇది పల్లెటూరి సమాజము. తనకి పదిహేడేళ్లు వచ్చినవనే నానామాటలు అంటున్నారు. ఇంక బ్రహ్మచారిణిగా ఉంటే బ్రతకనిస్తుందా? ఇంతకీ తనకాలే కారణం! కాలు ఎవరివల్ల వంకరయిందో ఆ వ్యక్తి పార్వతి మనోవీథిలో మెరిశాడు. తన కాలుని వంకర చేసినా అతనికేం? నిక్షేపంలా పట్నంవెళ్ళి డాక్టరు పరీక్ష పాసయివచ్చాడు. శ్రీదేవిలో రేపో ధనపు బిందెలతో ఉన్న అమ్మాయిని



కట్టుకొంటాడు. కాని అతని తండ్రి తన కౌలు బాకుకి ఓ అయిదు వందలు ఇవ్వలేక పోయాడు. పార్వతి కళ్లవెంట జలజలా నీళ్లు కారాయి. అంతలో తండ్రి పిలుపు వినబడింది. పార్వతి కళ్ళు తుడుచుకొని తలుపు తీసింది. తండ్రి నీరసంగా వచ్చి మంచంలో కూలబడ్డాడు. అతని మొహంచూసి పార్వతి వెళ్ళిన పని సఫలమవలేదని గ్రహించుకొంది. వంటింట్లోకివెళ్ళి జావతీసుకొని వచ్చి తండ్రికిచ్చింది. తండ్రి మెదలకుండా తాగి పడుకొన్నాడు. పార్వతి నిట్టూర్చింది. పని చూసుకొనేటందుకు పెరట్లోకి వెళ్ళిపోయింది.

సాయంకాల మయింది. రంగయ్య పార్వతిని పిల్చాడు.

"చూడమ్మా! మన రైతు పెద్దయ్య క్రింద సేదు తీసు బకాయిపడ్డాడు. ఈ ఏడు ఇవ్వలేదు. ఆ కాస్త చెక్క అమ్మితే ఓ రెండు వేలొస్తాయి. ఈ ఇల్లు కలిపితే రెండువేల యిదువంద లవుతాయి. ఆ వెంకయ్య అడిగిన మొత్తం సరిపోతుంది. ఓసారి మాట్లాడాలని పెద్దయ్యను పిలుతల్లీ!" అన్నాడు.

పార్వతి నిర్విణ్ణురాలయింది. "అదేంటి నాన్నా! ఇల్లూ, భూమి అమ్మి నన్నొదిలించుకొంటే తర్వాత నువ్వే మవుతావు నాన్నా? పెళ్ళి వద్దు ఏం వద్దు! నన్ను నీవద్దనే వుండనీ నాన్నా!" అంటూ కన్నీళ్ళు తుడుచుకొంది పార్వతి.

"నేనన్నీ ఆలోచించానమ్మా! ఇంక గత్యంతరం లేదు. నువ్వెళ్ళి త్వరగా పెద్దయ్యను రమ్మను. పొద్దుపోతోంది. దబ్బున వెళ్లు తల్లీ" అని అటువైపు తిరిగి పండుకొన్నాడు రంగయ్య.

పార్వతి లేచి తలుపు దగ్గరగా వేసి పమిటతో ఒళ్ళంతా కప్పుకొని, తల వంచుకొని గబగబా నడుస్తూ పొలానికెళ్ళింది. తనెళ్ళేసరికి పెద్దయ్య పొలంలోనే వున్నాడు. పార్వతిని దూరాన్నుంచే చూసి "చిన్న దొరసానమ్మ వచ్చిందే" అన్నాడు.

పార్వతి: "పెద్దయ్యా! నాన్న ఒంటో బాగుండలేదు. నిన్నోసారి సాయంకాలం రమ్మన్నాడు" అంది ఆవుదూడను నిమురుతూ.

"అట్టాగేనమ్మా. సాయంగా నువ్వే రావాలా పార్వతమ్మా? కాకితో కబురంపితే నేరానా? నువెళ్ళు తల్లీ. చీకటడితే పురుగుపుట్ర ఉంటవి" అన్నాడు పార్వతిని వాత్సల్యంగా చూస్తూ.

పార్వతి వెనక్కు మళ్ళింది. సూర్యాస్తమయం అయేలాగుందని త్వరగానడుస్తూ చెరువు గట్టువద్దకు వచ్చింది. గట్టున ఎవరో పట్నవాసి కూర్చొని చదువుకొంటున్నాడు. ఆ ఆగంతుకుడు అడుగుల చప్పుడు విని వెనుదిరిగి నిలిచి "పార్వతీ!" అన్నాడు.

పార్వతి వెనుదిరిగి, నిలచి ఆ నూతన వ్యక్తిని చూసింది.

ఆ వ్యక్తి పార్వతిని సమీపించి "పారూ! గుర్తులేదా? పలకరించినా పలకడం లేదేం?" అన్నాడు.

పార్వతి మాటలకోసం తడుముకుంటూ: రా...మం..." అంది.

"అవును రామాన్నే పార్వతీ! నేనువచ్చినప్పటినుండి నిన్నూ మీ నాన్నని చూద్దామంటే తీరిక చిక్క లేదు." అన్నాడు రామం.

పార్వతి తలవంచుకొని కాలి బొటన వేలితో నేలని రాస్తూ "చాలా పెద్దవాడివయ్యాక మేం గుర్తుంటామా?" అని నాలుక కరచుకొని "వెళ్ళొస్తా రామం. ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేదు" అంది.

"నిన్ను ఇంటివరకూ దిగబెట్టనా! పార్వతీ!"

"ఆమాత్రం దయవుంటే చాలు. నేనొక

★ పార్వతి ★

రైనా పోగలను." అంటూ వెళ్ళిపోయింది పార్వతి.

మర్నాడు కరణం మనిషి రంగయ్యకోసం వచ్చి బాకీ పైసలా చేయమన్నారు అని కబురు చెప్పాడు. రంగయ్య నిర్విణ్ణుడయ్యాడు. నెమ్మదిగా వచ్చిన మనిషితో "నే నొస్తున్నానని మీ దొరతో చెప్పు!" అన్నాడు.

రంగయ్య వెళ్ళేసరికి కరణం కచేరీ సావడిలో కూర్చుని రైతులతో యిష్టాగోష్ఠి జరుపుతున్నాడు.

రంగయ్యను చూసి "ఓ! రంగయ్య బావ సాయానా వచ్చాడే, కాకితో కబురంపితే నే రానా బావా!" అన్నాడు విషంగా నవ్వుతూ.

రంగయ్య అరుగుమీద కూలబడుతూ "ఆ కూర్చున్నది ఎవరూ..." అన్నాడు చత్వారం కళ్ళు చికిలిస్తూ.

"నేను మావయ్యా రామాన్ని—" అని కాళ్ళకు నమస్కరించాడు రామం.

"వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా!" అని దీవించి కరణంకేసి తిరిగి! "ఎందుకు కబురెట్టావు కామయ్యబావా!" అన్నాడు.

"ఆ! నీకు తెలియందేముంది? మావాణ్ణి ఈ వేసంగుల్లో ఓ యింటివాడిని చేద్దామనుకొంటున్నా. దేనికేనా డబ్బు కావాలికదు. ఏదో! నీ బాకీ కాస్త నా మొహాన కొడితే నీ ధర్మమా అని మా వాడి అక్కర తీరిపోతుంది" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"అదేంటి? కామయ్య అట్టాగంటావు? నా సంగతి నీకు తెలీదా? ఓ నాలుగురాళ్లు పోగడితే పార్వతిని విరగడ చేసుకొందామనుకొంటున్నా. దానీడు వాళ్ళంతా చల్లంగా కాపరాలు చేసికొంటున్నారు. దానిగతే అట్టా కాలింది. నా ఒళ్ళోమ్మ మీద కుంపటెదించుకొంటే నాకీ భూమ్మీద పనేముంది కామయ్యబావా" అంటూ కళ్లు తుడుచుకొన్నాడు రంగయ్య.

అక్కడే కూర్చొనివున్న రామం కంట్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అతనికి బాల్యమంతా మనసులో గిర్రున తిరిగింది. తన చిన్నతనంలో రంగయ్యభార్య సూరమ్మ వెండిగిన్నెలో పెరుగన్నంకలిపి పార్వతికి, తనకూ తినిపించటం, అప్పటి రంగయ్య వైభవం, దరిమిలా రంగయ్య దివాళా, సూరమ్మ మరణం, తాను పార్వతిని చెట్టుమీదనుండి తొయ్యడం పార్వతి కుంటిదవడం అన్నీ గిరగిరా తిరిగాయి.

కరణం కాపేపూరుకొని "అల్లాగంటే ఎల్లామరి రంగయ్యా! వెధవ సంసారంలో అన్నీ ఝంఝాటాలే. నీకు పార్వతి పెళ్ళెంత ముఖ్యమో నాకు రామం పెళ్లెంత ముఖ్యం కదా. ఏదో మరి ఆ కాస్త లెక్క నా మొహాన కొట్టేవా! నిన్ను మళ్ళా ఏమన్నా అంటే చెప్పుచ్చుకు కొట్టు" అన్నాడు.

రంగయ్య నిట్టూర్చి చేతికర్ర తీసికొని వెనుదిరిగేడు.

రామం దీనంగా వెళ్ళిపోయే రంగయ్యని చూశాడు. అతని మనస్సు ఎవరో కెలకినటయింది.

అంతకుముందు రోజు సాయం సంధ్యలో చూసిన పార్వతిరూపం గుర్తుకొచ్చింది. ఆ కాలు కొంచెం అవిటి తప్పితే పార్వతికేమిటిలోటు? పోతపోసిన బంగారు విగ్రహంలాంటి పార్వతిముందు ఏ స్త్రీ నిలబడగలదు? తనమూలాన్నే కదా పార్వతి కుంటిదయింది. తన వైద్య విద్యనంతా ఉపయోగించి పార్వతిలోని అంగవైకల్యాన్ని పోగొట్టి, పార్వతిని సంపూర్ణ సౌందర్యమూర్తిగా చేయలేడా. పార్వతిని తన దానిగా చేసికొని పార్వతికి జరిగిన అన్యాయానికి ప్రతిఫలం ఇవ్వలేడా! తను. పార్వతికేమిలోటు? రూపమా? గుణమా? కులమా?

డబ్బు లేకపోతేమాత్రం? ఓనాడు పార్వతి తండ్రి ఆదుకోకపోతే తన తండ్రి స్థితి ఈనాడిల్లా ఉండేదా? పార్వతిని కోడలిగా చేసుకోనేటందుకు తన తల్లి పూర్తిగా సుముఖురాలు. ఇంక తండ్రి విషయం. తను పట్టుపడితే తండ్రికి కాదనేశక్తిలేదు.

రామం పరిపరివిధాల ఆలోచించాడు. సాయంకాలం నీరెండ లాతని మొహంపై పడ్డాయి.

రామం ఓ నిశ్చయాని కొచ్చినట్లు చిరునవ్వు నవ్వుకొన్నాడు. లేచి బట్టలు మార్చుకొని రంగయ్య యింటివైపుగా వెళ్ళేడు.

రంగయ్య మంచంపై నిస్పృహగా పరున్నాడు. పార్వతి బియ్యంలో బెడ్డలేరుతూ సావిట్లో కూర్చొని ఉంది. చెప్పుల చప్పుడు విని చప్పున తలెత్తి, రామాన్ని చూసి, చేటప్రక్కన పడేసి లేచి "రా! రామం బావా!" అంది.

రంగయ్య మంచంమీదనుంచి "ఎవరమ్మా వారూ!" అన్నాడు.

"రామం నాన్నా! నిన్ను చూడ్డానికి వచ్చాడు" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రామం రంగయ్య కాళ్ళవైపు కూర్చొన్నాడు.

"ఏం బాబూ? పరీక్ష బాగా ఇచ్చావా!" అన్నాడు రంగయ్య వాత్సల్యంగా చూస్తూ.

"ఆ బాగానే అయింది" కొంచెం ఆగి, "సరే కాని మామయ్యా మరి పార్వతి పెళ్ళెప్పుడు!" అన్నాడు రామం.

రంగయ్య బాధగా "దాని పెళ్ళి ఈజన్మకయేలా లేదు. వీధిన బోయేవాడికి ఇద్దామన్నా వాడూ సంచులు తెమ్మనే వాడే నాకా, రెక్కలుడిగి పోయేయి. ఏమిటో అంతా అయోమయంగా ఉంది. ఇంతకీ దేవుడిదయ ఎల్లా ఉందో!" అన్నాడు.

రామం ఇంక సంభాషణ పెంచడం ఇష్టంలేక "మామయ్యా! నిన్ను సూటిగా అడుగుతా! పార్వతిని వీధిలో వాడికిచ్చే బదులు నాకే ఇవ్వరాదా!" అన్నాడు.

రంగయ్య అతి కోపంతో..."ఏమిటి రామం! నీకు కూడ ఎగతాళేనా మేమంటే! నువ్వు పార్వతిని ఈ పరిస్థితుల్లో చేసుకొంటావా? ఎందుకు మమ్మల్ని అవమానపరచడం?" అని గట్టిగా అరిచాడు. పార్వతి రామంకోసం గిన్నెలో జున్ను తెచ్చేదల్లా తండ్రి కేకలకు తలుపు వద్దే నిలుచుండిపోయింది.

రామం రంగయ్యచేతులు పట్టుకొని "మామయ్యా! క్షమించు. నిన్ను అవమానపరుద్దామని నా ఉద్దేశం కాదు. మా మామ్మ, సూరమ్మత్తయ్య వియ్యమందాలనుకొనేవారు. అత్తయ్య వెళ్ళిపోయింది. మామ్మ వెళ్ళిపోయింది. వారిద్దరి కోర్కెలూ నే తీరుస్తాను. నన్నాశీర్వదించు మావయ్యా. ఎవరొద్దన్నా నేను పార్వతినితప్ప మరెవరినీ పెళ్ళాడను. పార్వతి కాలు నేనే పోగొట్టా. నేనే బాగు చేసుకొంటా. మావయ్యా నువ్వు కోపాలు, పట్టుదలలూ మాని మమ్మల్ని ఆశీర్వదించు మామయ్యా!" అంటూ రంగయ్య పాదాలపై తలపెట్టాడు రామం.

రంగయ్య కన్నీళ్ళు జలజలా రాల్తూండగా రామం తల హృదయాని కదుముకొని "రామం బాబూ! నాకు నిన్నాశీర్వదించడానికి మాటలు రావటంలేదు బాబూ! నా చిట్టితల్లిని నీచేతిలో పెట్టా యింక నీదేభారం" అని "అమ్మా! పార్వతీ" అని పిలిచాడు. పార్వతి వెంటనే దేముడి గదిలోకి వెళ్ళి దేవుని ముందు దీపం వెలిగించసాగింది. రామం "నేను పార్వతిని తీసుకొస్తానుండు మామయ్యా" అని దేముని గదిలోకి వెళ్ళేడు.

రామం నవ్వుతూ "పార్వతీ! నిన్న ఈ సమయానికే నిన్ను యింటివద్ద దింపుతానంటే" 'ఆమాత్రం దయఉంటే చాలు' అన్నావు. ఈమాత్రం దయ చాలా!" అన్నాడు.

పార్వతి కళ్ళనిండా నీళ్ళు నిండగా దేమునిపటం ముందు మోకరిల్లింది. రామం కూడా పార్వతి ప్రక్కనే మోకరిల్లాడు.

★

నక్షత్ర ఫలితాలు

(30-10-57 మొదలు 5-11-57 వరకు)

గ్రహ స్థితి.

	కే		
	30 తే. రాత్రిశుక్రుడు ధనస్సునకు మారును. మకర, కుంభ మీనములలో చంద్రుడు.		
	శు శ	రబుకురా	గు

అశ్విని [చూ, చే, చో, లా]

మీశక్తినంతయూ ఉపయోగించి సాహసముతో కార్యసాధనకు ప్రయత్నించినను మొదట్లో ప్రతికూల వాతావరణము ఎక్కువగా వున్నందున నిరుత్సాహము పొందుతారు; కాని, చివరకు అజ్ఞాతమిత్రులసహాయమువలన కొంతవరకు కార్యానుకూలత ఏర్పడుతుంది. కార్యభారము పైన వేసుకొనుటచే శ్రమ అధికముగా, ఫలము తక్కువగా వుంటుంది. ఆర్థిక చిక్కులు కలుగును. కుటుంబమునందుండువారికి అనారోగ్యము కలిగే సూచన లున్నవి. వ్యాపారస్తులు అస్థిమితమును పొందుతారు. ఉద్యోగస్తులకు తొందర ఎక్కువవుతుంది. విద్యార్థులకు నిరుత్సాహము ఏర్పడుతుంది. 30 న ప్రయాణము; 1, 2, 3 తేదిలలో అశాంతి; అనారోగ్య సూచన. వారాంతమున కొంత అనుకూలత.

భరణి [లీ, లూ, లే, లో]

ఈవారమున ఆర్థిక లోపము కలిగినను, యత్నకార్యములు ఫలించకపోయినను పుణ్యకార్యచింత ఎక్కువగుటచేత సంసారముపట్ల నిర్మమతగా వున్నట్లు కనబడుటచేత గృహములో కలతలు వస్తాయి. వేదాంతవిషయచింతనము ఎక్కువవుతుంది. ఉద్యోగులకు ఒత్తిడి ఎక్కువయినప్పటికీ ఓపికతో నిగ్రహించుకుంటారు. కోర్టువ్యవహారములు తటస్థముగా వుంటాయి. కుటుంబములో కొందరికి అనారోగ్యంకలిగే సూచనలున్నవి. విద్యార్థులుచదువుపైని అశ్రద్ధ చూపినను క్రొత్తసంగతులను నేర్చుకుంటారు 1, 2 తేదీలలో అనారోగ్యము, 3 అశాంతి, వారాంతమున స్వల్పముగా శాంతి.

కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ]

ఈ వారమున కార్యభారము ఎక్కువై ఆర్థికమాంద్యము ఏర్పడి ఖర్చులు ఎక్కువగుటచేత మనస్సుకు అశాంతి కలుగుతుంది. అయినను కోర్టువ్యవహారములలో కొంత అనుకూలత ఏర్పడుతుంది. ఉద్యోగులకు అధికారుల వత్తిడి ఎక్కువ. ఆరోగ్యము చెడేసూచన లున్నవి. విద్యార్థులకు చదువుమీదశ్రద్ధతగ్గుతుంది. ఇచ్చిపుచ్చుకొనే చోట స్త్రీలతో వివాదాలు వస్తాయి. వ్యాపారస్తులకు కొంత ప్రతికూలత కలుగుతుంది. 30 న లాభములేని ప్రయాణము.

బి. నరసింగరావు

1, 2, తేదీలలో ఖర్చులుఅధికము, అశాంతి. 3 న వివాదాలు, అనారోగ్యము.

* రోహిణి [ఓ, వా, వీ, వూ]*

సోదరునివల్ల ఆశించిన సహాయము అనుకున్నట్లుగా చేతికి రాకపోవుటచేత, మిత్రులు తటస్థముగావుండి కార్యములు నెరవేరకపోవుటచేత అసంతృప్తి కలుగుతుంది. అయినప్పటికీ సాహసముతో మీ పలుకుబడిని ఉపయోగించుకొని మీకు కలిగిన తొందరలను సర్దుబాటు చేసుకుంటారు. అగ్నివల్లగాని, ఆయుధములవల్లగాని ప్రమాదము కలిగే సూచన లున్నవి, మెలకువవల్ల తప్పించుకోవచ్చును. ఉద్యోగస్తులకు పనులలో చికాకు కలుగుతుంది. విద్యార్థులకు చదువుమీద అనాసక్తిగా వుంటుంది. 30, 31 తేదీలలో ప్రయాణము; సంతృప్తి లేకపోవుట. 1, 2, 3 తేదీలలో ప్రమాదము కలిగే సూచన; అశాంతి, వారాంతమున కొంత మేలు.

మృగశిర [వే, వో, కా, కీ]

ఈ వారములో మీ హోదా, పలుకుబడి ఎక్కువవుతాయి. స్వశక్తిచే కార్యములను నెరవేర్చుకొని తృప్తిపొందుతారు. సంతోష వార్త వినుట, మిత్రులను కలుసుకొనుట మొదలగు శుభయోగములు కలుగుతాయి. వివాహము మొదలగు శుభ కార్యములను గురించి ఆలోచిస్తారు. విద్యార్థులు జ్ఞానాభివృద్ధి కలిగే విషయాలను నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ లభ్యమవుతుంది. కవులకు, చిత్రలేఖకులకు, నటీనటులకు మంచికాలము. వర్తకులకు లాభము. 30, 31 తేదిలలో ప్రయాణము. నూతన వ్యక్తులతో పరిచయము. 1, 2, 3 తేదీలలో కార్యదీక్ష, 4, 5 తేదీలతో శుభ కార్యాలోచన.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

కొంతకాలమునుండి నెరవేరకుండా వుండిపోయిన కొన్ని పనులను మీరు యీ వారములో నెరవేర్చుకోగలుగుతారు. మీ ఆదాయము పెరుగుతుంది. జీవితావశ్యమైన నూతన విషయాలను గ్రంథపఠనమువల్ల తెలుసుకొని మేలు పొందుతారు. పిల్లల శుభకార్యముల విషయమై ప్రయత్నాలు చేస్తారు. మీ హోదా, గౌరవము ఎక్కువ అవుతాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ వుంటుంది. విద్యార్థులు క్రొత్త విషయాలను తెలుసుకుంటారు. వర్తకులకు లాభము కలుగుతుంది. 30, 31 తేదిలలో ప్రయాణము శుభకార్యాలోచన. 1, 2, 3 తేదీలలో కార్యాచరణలో అశాంతి, త్రిప్పట.

* పునర్వసు [కే, కో, హా, హీ,] *

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. యత్నకార్యములు ఫలించుతాయి. వినోదములలోను, విందులలోను, మిత్రులతో కలిసి ఆనందముగా పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. ధనాదాయం బాగుంటుంది. బట్టల వ్యాపారస్తులకు లాభదాయకముగా వుంటుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. విలువగల వస్తువులను కొంటారు. గాయకులకు, కళాకారులకు నటీనటులకు మంచికాలము. 30, 31 తేదీలలో ప్రయాణము. 1, 2 తేదీలలో కార్యములపట్ల తొందరపాటు. శుభ వార్తలు వింటారు.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారములో బంధు మిత్రులతోను, కవులు, గాయకులు మొదలగు కళాకారులతోను ఉల్లాసముగా గడుపుతారు. ఆత్మీయులవల్ల ఆశించిన ధనసహాయమును సకాలములో పొందుటచేత ప్రోత్సాహకరముగా వుంటుంది. దూరదేశములనుండి వచ్చిన బంధువుల సరసన పిండివంటలతో భోజనము చేస్తారు. ఉద్యోగస్తులకు ఒడిదుడుకులు

★ నక్షత్రఫలితాలు ★

ధరలు:

నూలు, వస్త్రములు: స్వల్పమార్పు.
నూనెదినుసులు: నిలకడగా వుంటవి.
బెల్లము, పంచదార, చింతపండు :- మాంద్యము.
ఆహారధాన్యములు:- మందగించును.
పప్పుదినుసులు: మార్పులేదు.
వెండి, బంగారము : నిలకడగా వుంటవి.
అచ్చటచ్చట గాలితో కూడినవానలు. మద్రాసునకు దక్షిణ ప్రాంతమున బాగుగ వర్షించును.

* * *

జన్మనక్షత్రమునుబట్టి గాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు, మొదటి అక్షరము)ను బట్టి గాని ఫలితములు చూచుకొనవలెను. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, కృష్ణుడను పేరునకు స్వాతీ నక్షత్రమును, శ్రీధరుడను పేరునకు చిత్తా నక్షత్రమును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తానక్షత్రమును, భీముడు భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢనక్షత్రమును చూచుకోవలెను.

లేకుండా సుఖముగా గడుస్తుంది. వర్తకులు లాభము పొందుతారు. విద్యార్థులు కొత్త అంశములు నేర్చుకొని విలాసముగా గడుపుతారు. 30, 31 తేదిలలో ప్రయాణమువల్ల లాభము. 1, 2, 3 తేదిలలో బంధు దర్శనము; ఖర్చులు. వారాంతమున సంతోషవార్త.

ఆశ్లేష [డి, డూ, డే, డో]

మీ ఆదాయము ఎక్కువ చేసుకోడానికి, మీ ఆశయములు నెరవేర్చుకోడానికి ఈ వారమున మీరుచేసే యత్నాలు ఫలించక పోవుటవల్ల చింత పొందుతారు. కార్యభారము ఎక్కువవుతుంది. అకాలభోజనముచే ఆరోగ్యము సరిగా వుండదు. శరీరములో వేడి ఎక్కువ అవుతుంది. పితృవర్గమువల్ల కోరిన సహాయము సకాలములో అందక శ్రమలకు లోనౌతారు. గృహంలో కలతలు, ఏర్పడుతాయి. ఉద్యోగస్తులకు పనితొందర యెక్కువవుతుంది. 30, 31 తేదీలలో లాభములేని ప్రయాణములు చేస్తారు. 1, 2 తేదిలలో ఖర్చులు రాబడికి మించివుండుటచె వ్యథ; వారాంతమున కొంత శాంతి.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము అనుకూలముగా వుండదు. తలపెట్టిన కార్యములు ప్రతికూలముగా పరిణమిస్తాయి. తలకు మించిన ఖర్చులతో మీకు వచ్చిన ఆదాయము చాలక నిందల పాలై అశాంతి పొందుతారు. అయిననూ అజ్ఞాతవ్యక్తుల సహాయమువల్ల కొంతవరకు కార్యానుకూలత ఏర్పడుతుంది. విద్యార్థులకు చదువు సాగదు. ఉద్యోగస్తులకు మొదట్లో అధికారులవల్ల తొందర కలిగిననూ క్రమేణా సర్దుకుంటుంది. ఆరోగ్యవిషయమై అశ్రద్ధ చెయ్యకూడదు. 30, 31 తేదిలలో ప్రయాణమువల్ల నష్టము; ప్రయాసము. 1, 2, 3 తేదిలలో తొందరపాటు; మనోవ్యథ. వారాంతమందు మిత్రులవల్ల లాభము, కొంత శాంతి.

* పూర్వ ఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము మీకు పుణ్యకార్యచింత ఎక్కువగుటచేతను, పెద్దల సాంగత్యము పొందుటచేతను మేలు కలుగును. సంసార సంబంధమైన పనుల్లలో శ్రద్ధ లేనందున గృహమందుండువారితో అనవసరమైన కలతలు రేగిననూ, మీ వివేకమువల్ల వాటిని పరిగణించక కార్యాచరణను ఓర్పుతో నెరవేర్చుకుంటారు. ఇంట్లో వారికి ఆరోగ్యభంగము కలిగేసూచనలున్నాయి. ముందే శ్రద్ధవహించకపోతే తర్వాత శ్రమపడతారు. ఉద్యోగులకూ వచ్చేఆదాయము చాలక నిరుత్సాహపడతారు. కోర్టువ్యవహారములు వాయిదా పడుతవి. 30, 31 తేదీలలో పుణ్యకార్యచింత. 1, 2, 3 తేదిలలో ఆర్థిక ఇబ్బందులు; కలతలు. వారాంతము కొంత మేలు.

* ఉత్తర ఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పి]

ఈవారమున భరించలేని కార్యభారము మీద వేసుకొని పనులను నెరవేర్చుకున్నను తగినఫలమును పొందరు. నిందలపాలయి అశాంతి పొందుతారు. కోర్టుపనులలో కొంత అనుకూలత వుంటుంది. మీరు ఓర్పుతో కార్యాచరణ చెయ్యడము మంచిది. మీవిలువ ఎంతో తెలిసివుండికూడా అధికారులు మిమ్మలను అనవసరముగా అవమానిస్తారు; స్త్రీలతో వివాదపడతారు. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధవుండదు. 30, 31 తేదిలలో వర్తకులు లాభములేని ప్రయాణము చెయ్యవలసి వస్తుంది. 1, 2, 3 తేదీలలో ఆదాయము చాలనందున తొందర; అశాంతి.

హస్త [పూ, ష, ణ, ఠ]

ఓపికవహించి సాహసముతో కార్యాచరణ చేసిననూ శ్రమ అధికమగుటే కాక ఫలము వుండదు. అందువల్ల క్రుంగిపోతారు; అది మంచిది కాదు. యత్నకార్యములను విడువకుండా చేయడమే వివేకవంతుల లక్షణమని తెలుసుకోండి; జయము సాధించి తీరుతారు. సోదరుల సహాయమువల్ల కొంత ఒత్తిడి తగ్గుతుంది. అయిననూ ఆర్థికముగా ఇబ్బంది తప్పదు. ఇచ్చిపుచ్చుకొనే వేళలలో చురుకుమాటలవల్ల మనోవ్యథ కలుగుతుంది. విద్యార్థులు పోటీలలో పాల్గొనుటలో కొన్ని గాయములు ఏర్పడుతాయి. వ్యాపారస్తులకు లాభము ఉండదు. 30, 31 తేదీలలో ప్రయాణమువల్ల ప్రయాసము. 1, 2, 3 తేదీలలో ఆర్థికమైన ఇబ్బందులు; తొందర్లు, వారాంతమున బంధు సహాయము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము సంతోషవార్తలు వినుట, మిత్రులను కలుసుకొనుట మొదలగు మంచి యోగములు కలుగును. సంఘములో మీ పలుకుబడి ఎక్కువవుతుంది. స్వప్రయోజనముతో కార్యనిర్వహణచేసి తృప్తి చెందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ వుంటుంది. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. కోర్టు వ్యవహారములలో మీపట్ల తీర్పులు జరుగుతాయి. కవులకూ, కళాకారులకూ, నటీనటులకూ మేలుకాలము. 30, 31 తేదిలలో వర్తకులకు ప్రయాణమువల్ల లాభము కలుగును. 1, 2, 3 తేదిలలో కార్యభారమువల్ల త్రిప్పట ఎక్కువ. అశాంతి.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీ ఆర్థికస్థితి బాగుపడుతుంది. పెద్దల సాంగత్యమువలన ఈశ్వరానుగ్రహము కలిగి కొత్త విషయాలను నేర్చుకుంటారు. శుభకార్యములగురించి ఆలోచన కొంతవరకు ఫలిస్తుంది. కోర్టువ్యవహారములు అనుకూలముగా పరిష్కారమవుతాయి. విద్యార్థులు కొత్తవిషయాలు నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు గౌరవప్రదముగా గడుస్తుంది. వర్తకులకు లాభం; పండితులకూ, కళాకారులకూ, నటీనటులకూ యోగకాలము.

30, 31 తేదీలలో ప్రయాణమువల్ల లాభము. 1, 2, 3 తేదీలలో ప్రయాసము. ఆర్థిక స్థితిలో వృద్ధి, వారాంతమున శుభకార్య సమాలోచనము.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము అన్నివిధాలా యోగకాలము. మానసికస్థిమితము కలుగుటవల్ల నిర్ణయప్రకారము కార్యసాధనచేసుకుని తృప్తి పొందుతారు. కొన్నాళ్ళనుండి నెరవేరకుండా వుండిపోయిన పనులు అనుకూలముగాఫలించుతాయి. ఉద్యోగస్తులకు గౌరవముగా గడుస్తుంది. వ్యాపారస్తులు కొన్ని విలువగల సరకులను సంపాదిస్తారు. కోర్టువ్యవహారములు వాయిదా పడతాయి. వివాదములు కొంతవరకు తగ్గుతాయి. విద్యార్థులకు మనోవికాసము కలిగే విషయాలు తెలుస్తాయి. కవులకూ, గాయకులకూ, కళాకారులకూ యోగకాలము. 30, 31 తేదీలలో శ్రమతో కూడిన ప్రయాణము. 1, 2, 3 తేదీలు లాభము, ఖర్చులు ఎక్కువ.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకూ యోగకాలమగుటచేత మీరుచేసే ప్రయత్నాలు ఫలించి తృప్తి పొందుతారు. ధనాదాయము బాగుంటుంది. సంఘములో హోదాఎక్కువవుతుంది. గాయకులతోనూ, కవులతోనూ, స్త్రీలతో కలసి వినోదముగా గడుపుతారు. కోర్టువ్యవహారములు మీ పక్షముగా తీర్పు అవుతాయి. వ్యాపారస్తులు రత్నములు మొదలగు ఖరీదైన వస్తువులను సంపాదించుతారు. విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ కలుగుతుంది. శుభకార్యములలో పాల్గొంటారు. 30, 31 తేదీలలో ప్రయాణము. 1, 2, 3 తేదీలు ఆర్థికసర్దుబాటులలో క్రిందుమీదవుతారు. 4, 5 తేదీలలో శుభం కలుగుతుంది. నటీనటులకు మంచికాలము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు యోగకాలముకాదు. పితృవర్గమునుండి మీరు కోరిన ఆర్థిక సహాయము సకాలములో పొందక అసంతృప్తి చెందుతారు. శరీరకష్టము ఎక్కువయ్యే పనులు చేసిననూ అందుకుతగ్గ ఫలితము లేకపోవుటచేత మనోవ్యధ పొందుతారు. అకాలభోజనమువల్లను ఉష్ణాధిక్యమువల్లనూ ఆరోగ్యము చెడుతుంది. సూర్యోపాసన మంచిని కలుగజేస్తుంది. కోర్టువ్యవహారములలో ప్రతికూలతీర్పు వుంటుంది. ఉద్యోగస్తులకు వత్తిడి ఎక్కువవుతుంది. ఆదాయము చాలక బాధపడతారు. విద్యార్థులకు చదువుసాగదు. 30, 31 లాభములేని ప్రయాణము. 1, 2, 3 తేదీలలో అశాంతి.

మూల [యే, యో, బా, బీ]

ఈ వారములో మీ ఆదాయము సరిపోకపోవుటచేతను యత్నకార్యములు సకాలములో నెరవేరకుండుటచేతను మొదట్లో నిరుత్సాహము కలిగిననూ క్రమేణా మిత్రుల సహాయసహకారములవల్ల కొంతవరకూ కార్యానుకూలత పొందుతారు. ఉద్యోగులకు మొదట్లో కలిగే తొందరలు క్రమేణా సర్దుకుంటాయి. వర్తకులకు మంచికాలముకాదు. ఆరోగ్యమును గురించి జాగ్రత్తపడడము మంచిది. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు సక్రమముగా సాగదు. 30,31 తేదీలలో అస్వస్థత, ప్రయాణము కలిగేసూచన 1,2,3 తేదిలలో అసంతృప్తికరమైన ఆర్థికస్థితి. వారాంతమున మిత్ర సహాయము; అనుకూలత.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈ వారములో ఉత్సాహములేకుండా వుంటుంది. అవసరానికి కావలసిన సొమ్ము అందకపోవుటచేత కార్యములలో జాప్యము వుంటుంది. ఉత్తముల సాంగత్యమువల్లనూ, పురాణశ్రవణమువల్లనూ వైరాగ్యము కలిగి ఆధ్యాత్మికచింత ఎక్కువవుతుంది. సంసార విషయములను అంతగా పట్టించుకోనందువల్ల గృహములో అసంతృప్తి కలుగుతుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి ఎక్కువవుతుంది. వర్తకులకు మంచికాలముకాదు. త్రిప్పట ఎక్కువవుతుంది. కుటుంబమందుండువారికి కొందరకు ఆరోగ్యభంగము అవుతుంది; జాగ్రత్తపడండి. విద్యార్థులు కొత్తవిషయాలు నేర్చుకున్నను శ్రద్ధ తక్కువవుతుంది. 30,31 తేదీలలో లాభములేని ప్రయాణము. 1, 2, 3 తేదీలలో ఆర్థికలోపమువల్ల అలజడి, వారాంతమున కొంత శాంతి.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారమున మీరుఎంతైన శ్రద్ధవహించడం మంచిది. ధనలోపమువల్ల ప్రతికూల వాతావరణ మేర్పడుతుంది. ఇచ్చిపుచ్చుకోనే చోట్ల నీచస్త్రీలతో వివాదము ఏర్పడుతుంది. కోర్టువ్యవహారములలో కొంతవరకూ అనుకూలమైన తీర్పులు మీకు కలిగిననూ ఖర్చులు ఎక్కువవుటచేత మీకు సంతృప్తి వుండదు. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువవుతుంది. ఉద్యోగస్తులు ఇబ్బందులు పడతారు. వర్తకులకు లాభము తక్కువ. 30, 31 తేదీలలో ఒక చోటినుండి మరొక చోటుకు కదలిక. 1, 2, 3 తేదీలలో సరిపడని ధనాదాయము. భార్యకు అనారోగ్యము కలిగే సూచన.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

అన్నదమ్ములవల్ల కొంత ధనసహాయమును పొందినను మీకున్న ఇబ్బందులకు సరిపడకపోవుటచేత చిక్కులు తీరక బాధపడతారు. ఉద్యోగస్తులకు అధికారులచేత మాటపడడమువల్ల మనస్సుకు నొప్పి కలుగుతుంది. డబ్బు లు తగులుటగాని, కోసుకొనుటగాని జరగవచ్చు. విద్యార్థులకు చదువుపైకన్న ఆటలపోటీలలో శ్రద్ధ ఎక్కువవుతుంది. వ్యాపారస్తులకు ప్రయాణమువల్ల కొంత మేలు 30, 31 తేదీలలో కలుగుతుంది. 1, 2, 3 తేదీలలో డబ్బు వచ్చినను ఇబ్బందులు. వారాంతమున సోదర సహాయము.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

మీ స్వశక్తిచే కార్యసాధనను పొంది తృప్తి పొందుతారు. మిత్రుల సహకారము కూడా వుంటుంది. నూతన వ్యక్తులతో పరిచయము కలుగుతుంది. తద్వారా విజ్ఞానార్జన చేసుకుంటారు. గ్రంథరచనగాని, చిత్రకళ

అక్టోబరు 16వ తేదీ 'ఆంధ్రవార పత్రిక' 13వ పుటలో ఫోటో క్రింది వివరణలో పేరు శ్రీ చెరుకుపల్లి ఎల్లాప్రగడ నెహ్రూ అని గమనించ ప్రార్థన.

★ నక్షత్రఫలితాలు ★

లలో కృషిగాని చేస్తారు. శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణ వుంటుంది. వ్యాపారస్తులకు 30 31 తేదీలలో ప్రయాణమువల్ల లాభము కలుగుతుంది. విద్యార్థులు కొత్త సంగతులు నేర్చుకుంటారు. 1, 2, 3 తేదీలలో కార్యాచరణవల్ల శ్రమ. కవులకూ, నటీనటులకూ, కళాకారులకూ మేలుకాలము.

శతభిషం [గో, సా, సీ, సూ]

ఈ వారము మీకు యోగకాలము. అనుభవజ్ఞులవద్ద విషయసంగ్రహణముచేసి జ్ఞానాభివృద్ధిని పొందుతారు నిరాటంకముగా మీ పనులన్నియు మీ ఆత్మీయుల సహకారమువల్ల నెరవేరుతాయి. మీ బిడ్డల అభివృద్ధివల్ల సంతోషము పొందుతారు. విద్యార్థులు నూతనాంశములను నేర్చుకొని శ్రద్ధగాచదువు సాగిస్తారు. ఉద్యోగస్తులకు కొంత మేలుగా వుంటుంది. పండితులు, న్యాయవాదులు, వ్యాపారస్తులు 30, 31 తేదీలలో ప్రయాణమువల్ల లాభము పొందుతారు. 1, 2, 3 తేదీలలో ఖర్చులవల్ల కొంత అలజడి. కళాకారులకూ, నటీనటులకూ మంచికాలము.

*పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] *


ఈ వారములో, మీకు మంచి యోగము కలుగుతుంది. మాతృవర్గము నుండి సహాయమును పొందుటచేతను మీ ఆర్థికస్థితి అనుకూలముగా వుండుటచేతనూ మీ కార్యములన్నియు అనుకూలముగా నేరవేరి తద్వారా తృప్తిని పొందుతారు గాయకులతోను కళాకారులతోను వినోదమును అనుభవించుతారు. మిత్రులతోను ఆప్తులతోను మృష్టాన్నభోజనము ఆరగిస్తారు. పండితులతో గోష్ఠి జరుగుతుంది. విద్యార్థులకూ జ్ఞానాభివృద్ధి అవుతుంది. ఉద్యోగస్తులకు, సుఖముగా గడుస్తుంది వెండి వ్యాపారస్తులకు 30, 31 తేదీలలో ప్రయాణమువల్ల లాభము 1, 2, 3 తేదీలలో ఖర్చులు ఎక్కువ కవులకూ, గాయకులకూ, నటీనటులకూ కళాకారులకు యోగకాలము.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, ధా] *

గత వారములో మొదలైన శుభయోగములు ఈ వారములో కూడా మీకు వుంటాయి. ధనాదాయము హెచ్చుతుంది. యత్నకార్యములను మిత్రుల సహాయమువల్ల సకాలములో నెరవేర్చి తృప్తి పొందుతారు. ఉద్యోగులకు యజమానుల ఆదరణ లభిస్తుంది కుటుంబములో కొన్ని శుభకార్యములు చేయుటకు ప్రయత్నములు చేస్తారు. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. నూలు బట్టల వ్యాపారస్తులకు 30, 31 తేదీలలో ప్రయాణమువల్ల లాభము కలుగుతుంది. 1,2,3 తేదీలలో ఖర్చులు ఎక్కువ కవులకూ నటీనటులకూ కళాకారులకూ గాయకులకు మేలుకాలము.

రేవతి [దే, దో, చా, చీ]

మీ రాబడి వృద్ధిచేసుకోడానికి, మీ ఆశయాలను నెరవేర్చుకోనడానికి మీరు చేసే ప్రయత్నాలు నెరవేరక చింత పొందుతారు కార్యభారములో ఎక్కువగా నిమగ్నులవుటవల్ల మీ సౌఖ్యములను కూడా మరిచిపోయి అనారోగ్యము పొందుతారు. శరీరమునకు ఉష్ణాధిక్యము కలుగుతుంది. ఆరోగ్యదాయకుడైన గ్రహరాజు రవికి శాంతి చేసుకోండి; అన్ని లోటులు చక్కబడుతాయి. ఉద్యోగస్తులు ఆదాయము చాలక ఇబ్బంది పడుతారు. వర్తకులకు మంచి కాలముకాదు. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువవుతుంది. 30, 31 తేదిలలో లాభములేని ప్రయాణము 1, 2, 3 తేదీలలో గృహమందు కలతలచే అశాంతి, అనారోగ్యము గలిగే సూచన. వారాంతమున స్వల్పముగా ఊరట. ★



రాజమండ్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్ వారు జరిపిన నాటికల పోటీలలో "నలుగురు మిత్రులు" అను నాటికయందు శివానందం పాత్రను నిర్వహించి రజితపాత్రను పొందిన భీమవరం కళాశాల విద్యార్థి బి.హెచ్. శ్రీరామమూర్తిరాజు.




సుకృత లక్ష్మీవిలాస సభవారు ప్రదర్శించిన 'చింతామణి' నాటకంలో సుబ్బిశెట్టి పాత్రధారి డా॥ ఎం. వి. రావు.

దంతాల శుభ్రత

అఖిల భారత దంత సంరక్షణ మండలి వారు ఈ ఏడాది కూడా పోస్టర్ల రచనలో పోటీ నడుపుతున్నారు. ఇందులో బడి పిల్లలూ, విద్యార్థులూ, చిత్రకళను అభ్యసిస్తున్నవారూ పాల్గొనవచ్చును పోస్టర్లు దంత సంరక్షణ గురించి వెయ్యాలి. పళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ఏం చెయ్యాలో, ఎటువంటి జాగ్రత తీసుకోవాలో ప్రజలందరికీ తేలికగా తెలిసేలా బొమ్మవేసి ఈ పోస్టర్లు తయారుచెయ్యాలి మీ ఇష్టంవచ్చినన్ని రంగులు వాడవచ్చును. పోస్టరు సైజు 18 × 24 అం. లకు మించకూడదు. ఇంతకుపైన వివరాలు కావలసినవారు అఖిల భారత దంత సంరక్షణమండలి గౌరవ కార్యదర్శి పేరిట, 64 మహామదలీ రోడ్, బొంబాయి-3కు వ్రాయవచ్చును.

ఈ పోటీలో గెలిచేవారికి బహుమతులుగా ఇచ్చే రజిత ఫలకాలను, విగ్రహాలనూ 'అనాసిన్' మాత్రలు, ఫర్హాన్స్ టూత్ పేస్, కాలినాస్ డెంటల్ క్రీం తయారుచేసే 'జియాఫ్రీ మానర్స్ కంపెనీ' వారు విరాళం ఇస్తున్నారు. దంత సంరక్షణ మండలిలో సభ్యులైన ఇతర సంస్థలవారు కూడా చాలా బహుమతులు విరాళంగా ఇస్తున్నారు.



ప్రసాద పరిష్కారం

రోజులకు ముందు "ఆ", "ఈ" తగులుస్తూ వుంటాం; ఏరోజులు అయినా ఒక్కటే. స్థిరాస్తి ఒక సెంటు వున్నా, చరాస్తి ఒక ఇత్తడి పాత్ర వున్నా, లేక ఒక వంద ఎకరాల భూమి, పట్నంలో నాలుగు మేడలూ, బోలెడు రొఖ్ఖం నిల్వ వున్నా తగవుల దృష్ట్యా ఒక్కటే! పందిరపట్టిమంచం కోసం తగవుపడి, ప్రాణావశిష్టులై ఆసుపత్రులలో చేరిన భాగ్యవంతులు వున్నారు. కాలిగట్టుకోసం నరుక్కున్న భూఖామందులున్నారు. అంచేత బుద్ధిమంతులు ఏ రూపంలో, ఎంత వున్నా 'డబ్బు' పాపిష్ఠిది అంటారు. తండ్రీ కొడుకుల్నీ, భార్యాభర్తల్నీ, తల్లీ పిల్లల్నీ, అన్నదమ్ముల్నీ, స్నేహితుల్నీ వేరుచేసేది తరుచు అదే!

ఇది ఎందుకు చెప్పవలసివచ్చిందంటే జానకిరామయ్య ఇంటివాటామీద వాలిన

గాడేపల్లి సీతారామయ్య

కాకి, స్నేహితుడూ, వ్యాపారంలో వాటాదారూ అయిన గోవిందసెట్టి వాటాభాగం మీద ఎక్కడా వాలటానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడాయి. అదంతా గొడవల సంపుటి!—

నేను చేరబడి రెండు రోజులయ్యాక, గోవిందసెట్టి తండ్రి, వీరభద్రయ్యసెట్టి, "మీకు పోయిన నెల జీతం ఎంత రావాలో ఏటో లెక్క కట్టండి" అన్నాడు గుమాస్తా జానకిరామయ్యతో.

"లెక్క మొన్న నే కట్టేనండి; అయిదు రూపాయల పావలా సామాను వాడుకున్నానండి గత నెలలో......నాల్గవ తేదీన ఒక వీసెడు బెల్లం..." అని తన ఖాతా తిరగవేసి వివరాలు చెప్పబోయాడు.

"ఇవరాలు అబ్బాయి గోవింద చూస్తాడులెండి. మీదగ్గర అట్టాంటి పొరపాట్లు వుండవనేగా పరువు ఖరీదుకు కూడా మిమ్మల్నే ఎల్లమంటా ఉంట. అయితే మీకు తొమ్మిదీ ముప్పావలా వస్తాదన్నమాట; ఖర్చు రాయం డిత్తాను" అన్నాడు సౌకాళంగా బొజ్జ నిమురుకుంటూ, వ్యాపార ధోరణిలో.

"నేను రెండునెలల క్రితం జీతం సరిపోవడంలేదు, మూడు రూపాయలు ఎక్కువ చేయమనికోరితే మీరు 'చూద్దాంలెండి వచ్చేనెల' అన్నారు. పోయిన నెల మీకు జ్ఞాపకం చేద్దామనుకున్నాను. మీరే ఎక్కువ చేస్తానని అన్నారుకదాఅని వూరుకున్నాను.



మధురానగరి దారిలో

—చిత్రకారుడు: సి. రాధామోహన్.

★ ప్రకృతి పరిష్కారం ★

మీరు మరచిపోయినట్లులేవుంది; ఈ సెలవ్వా..." అని నీళ్ళు నమిలాడు జానకిరామయ్య.

"ఏటోనండి; ఇత్తానన్నానుకోండి. వ్యాపారం ఈసురోమంటా వుందాది. సెలయి కొన్న చింతపండు సరుకు చూడండి ఇదుద లయిందేటో. జీతం ఎక్కువ చేయమంటే ఏటిచేసేదికి ఏటో మీకూ, మాకు కలిసింది కాబట్టె కాని, లేకపోతే గుమస్తా కావాలేటండీ ఇంతోటి వ్యాపారానికి" అన్నాడు సెట్టి అసలు ఉద్యోగానికే ఎసరు పెట్టేస్తూ.

జానకిరామయ్య హృదయం ఉద్వేగంగా కొట్టుకుంది. మనస్సులో "గుమస్తా కావాలేటండీ" అన్న సెట్టిమాటలు పదేపదే ప్రతిధ్వనించాయి. దిగులుతో క్రుంగిపోయాడు. "ఇదీ లేకపోతే ఇంక ఏమైనా వుందా?... ఇదీ లేకపోతే ..." అప్రియమైన ప్రతీ విషయాన్ని మానసికంగాబహిష్కరించాలని ప్రయత్నించడం లోకసహజం. అదే జానకిరామయ్యచేసినదీను.అయినా బాధతప్పలేదు. తన మనస్సును సంబాళించుకునేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చినట్లు అయింది ప్రాధేయపూర్వకంగా – "అవుననుకోండి. మీధర్మమాఅంటూ నన్ను ఒకఇంటివాడినిగా కూడా చేశారు; మరచిపోలేదు. నాకూ, నా భార్యకు సరిపోవడంలేదు మీరు ఇచ్చే జీతం అని మనవిచేసుకుంటున్నాను. ఎలాగైనా..." అంటుండగా,

సెట్టి అర్థోక్తిలోనే అందుకుని "ఏటో, వచ్చేనెల చూద్దాం లెండి". అన్నాడు వ్యాపారస్తులు వాయిదా వేసే సహజ స్వభావంతో.

జానకిరామయ్యకు సెట్టి జీతం రాళ్ళు కడిగి వేసి మరీ ఇస్తూవున్నట్లు తోచింది. అయినా మారు మాటాడలేకపోయాడు. దానికి ప్రధానకారణం సెట్టిచేసిన ఉపకారాలు అతని స్మృతిపథంలో పాతాడటం. ఆ ఉపకారాలకు అతను ఎప్పటికీ కృతజ్ఞుడే!

జానకిరామయ్య స్వగ్రామం కోనసీమలో ఒక లంక. తల్లి పోయిన మరుసటి సంవత్సరం తండ్రి మరణించాడు. ఆ తండ్రి పిత్రార్జితం బాపతు ఎనిమిదిఎకరాల మాగాణి, తెగనమ్మి పేకాటలు ఆడి పూర్తిగా కరారావుడి పెట్టేశాడు. ఇంత తిండీ, బట్టా పెట్టి ఆదరించే 'నా' అనే వాళ్ళుకాని, దాతలుకాని లేకపోయారు. దాంతో స్వగ్రామంవిడిచి రాజమండ్రీ పొట్టపట్టుకు వచ్చాడు. అప్పటికి ఇంకా అతనిబాల్యం పరిసమాప్తి కాలేదు. చదువు ఎనిమిది పూర్తికాకముందే స్వస్తి చెప్పవలసి వచ్చింది. ఆ దుస్థితిలో ఆదరించి అభిమానించినవాడు యీ భద్రయ్య సెట్టి. ఎనిమిది రూపాయలలో ప్రారంభమైన గుమస్తా జీవితం, పదిహేను చూస్తోంది. రెండు సంవత్సరాలక్రితం సెట్టి పూనుకుని పెళ్ళికూడా అయిందనిపించాడు. పండుగలకు అప్పుడప్పుడు పంచల చాపులు ఇస్తున్నాడు.

ఇటువంటి ఉపకారాలుఎన్నో సెట్టిచేస్తూ వున్నా, మళ్ళీ జీతం మూడు రూపాయలు పెంచమనటం బేసబబుగా వుందేమో అనిపించింది, జానకిరామయ్యకు. ఆరు మాసముల క్రితం భార్యకాపరానికిరావడానికిఒకచిన్న ఇల్లు, సామాను వగైరాలు కావలసివచ్చాయి. ఒకపొట్ట, రెండు పొట్టలు అయింది. ఎంత సెట్టీ, సెట్టికొడుకూ కనిపెట్టుతూఉన్నా, పైగా సొమ్మురూపంలో రాగికాణీ కిట్టే ఆధారం లేకపోయింది. ఇప్పుడైనా తరచు పస్తులు వుండటం మూలంగా కాని ఈ సాహసం చేయనే లేకపోయేవాడు.

కొట్టు మూసి ఇంటికి వెళ్ళేముందు వీరభద్రయ్యసెట్టి కుమారుడు గోవిందసెట్టి, గుమస్తా జానకిరామయ్యను ప్రక్కగా పిలచి, "మా బాబుతో ఏటండి! జీతమే పెంచాలి ఏటి పోనిద్దురూ, ఆమాత్రం మీకు కిట్టిస్తేచాలేటండి?" అని హామీఇచ్చాడు. దానితో రామయ్య మనస్సు కుదుటపడింది.

గోవిందసెట్టికి జానకిరామయ్య అంటే అవ్యాజమైన స్నేహభావం. ఇద్దరూ సుమారు ఒక వయస్సువారే. జానకిరామయ్య ముక్కుకు సూటిగా పోయేవాడనీ, ఎప్పుడూ వ్యాపారతరహాగా అన్నా అబద్ధం ఆడడనీ గోవిందసెటికి దృఢవిశ్వాసం. సినీమాలకు, హోటళ్ళకూతరచు కలిసి వెళ్లుతూవుండేవారు. ఖర్చు అంతా సెట్టిదే. జానకిరామయ్య "తన కొట్లో గుమస్తా" అని ఏనాడో మరచిపోయాడు. మిత్రునకు ఇచ్చేగౌరవాలు అన్నీ ఇచ్చేవాడు. వీరభద్రయ్యసెట్టితో సహా అంతా, అతన్ని "గోవిందసెట్టి మంత్రి" అనేవారు.

ఆ మాసంలోనే కీర్తిశేషుడైన తన పినతండ్రి భార్య మరణించినట్లు జానకిరామయ్యకు స్వగ్రామంనుండి తంతివార్త వచ్చింది. వెంటనే భద్రయ్యసెట్టివద్ద సెలవు తీసుకుని స్వగ్రామం వెళ్లాడు. ఆ పినతల్లికి సంతానం లేకపోవటం మూలాన్న అంత్యక్రియలు అతనే జరుపవలసి వచ్చింది. అన్ని రోజులూ అక్కడేఉండి కర్మకాండ పూర్తిఅయిందనిపించాడు. ఆమె గతించటంవల్ల, ఆమె మనోవర్తిగా అనుభవిస్తూవుండిన నాలుగుఎకరముల భూమీ, స్వల్పంగా చరాస్తి సంప్రాప్తించాయి. ఉన్నరొఖ్ఖం నూటపదిరూపాయలూ, ఆపన్నెండు రోజులలోను అయిన ఖర్చుకూ, గోదానమునకూ సరిపోయింది.

మరో రెండురోజులువుండి భూమిని అమ్మకం చూపించాడు. ఎకరం, అయిదు వందలదాకా ఇస్తామన్నారు. ఆరువందలు కావాలి అన్నాడు. ఎకరం ఒక్కంటికి, పాతికతక్కువ ఆరువందలకు ఎగ్రిమెంటు వ్రాసి, రిజిస్ట్రీకు ఒక నెలవరకుఇచ్చి, రాజమండ్రీ తిరిగివచ్చాడు. అందు చేతనే అదృష్టం, ఆపదా చెప్పి రావంటారు!

జానకిరామయ్య ఒకందుకు మాత్రం ఖేదపడ్డాడు. తండ్రి, పేకాటలుఆడి, ఆస్తిపాడు చేసినందుకు నిందించాడు. ఇప్పుడు తను చేస్తూవున్నది ఏమిటి? కలలోకూడా అనుకొనని భూమికలియటంతో, తండ్రిలాగే అమ్మివేయువూనటం! తండ్రివలె తను వృథాగా పాడుచేయటంలేదనీ, ఆసొమ్ముతో వెలుగడించ వచ్చుననీ అతనితృప్తి.

స్వయంకృషి

నేను ఒక లాయరుదగ్గిర పని చేస్తున్నాను. ఒకవృద్ధుడు ఇక తను ఆట్టే రోజులు బ్రతకనని తెలుసుకుని వీలునామా రాయించడానికి మా లాయరును పిలిపించాడు. నేను సాక్షిగా లాయరుతో వెళ్ళాను.

"నా కుమారుడు జిమ్‌కు మూడు వేల పౌనులు ఇస్తున్నాను. నా మరొక కుమారుడు జాన్‌కు ఒక మూడు వేల పౌనులు, నా కుమార్తె మేరీకి మరొక మూడు వేల పౌనులు ఇస్తున్నాను. నా మనుమలకు, మనుమరాళ్ళకు తలా ఒక మూడువందల పౌనులు ఇస్తున్నాను..." అని వృద్ధుడు ఇంకా చెప్పబోతున్నాడు. లాయరు ఆయన మాటకు అడ్డం వచ్చి "మిస్టర్ రాబర్ట్స్! మీ ఆస్తి అంతా కలిపినా వెయ్యిపౌనులకంటే ఎక్కువ లేదు! మరి ఒక్కొక్కళ్ళకి ఇంతింత డబ్బు ఇస్తున్నానని రాయిస్తున్నారు–ఇదంతా ఎక్కణ్ణించి వస్తుందని మీ ఊహ?" అని అడిగాడు.

వృద్ధుడు ముఖం కందగడ్డలా చేసుకుని లేచి కూర్చుని కోపంగా "ఎక్కణ్ణించా? ఏమో నాకేం తెలుసు? కష్టపడి సంపాయించుకోమనండి. నేను సంపాయించుకోలా? అలాగే!" అన్నాడు.

.ఎడ్వర్డ్ వాపిల్స్.

జానకిరామయ్య ఏమీ దాచకుండగా, నాలుగుఎకరములభూమి కలసినట్లూ, తను ఆభూమి అమ్మకమునకు ఎగ్రిమెంటు వ్రాసినట్లూ, వివరములతోసహా అన్నీ వీరభద్రయ్య సెట్టికి తెలిపాడు. ఆసొమ్ముతో, కొంత అనుభవంవుందికనుక చిల్లరకొట్టు వ్యాపారం పెట్టే అభిప్రాయంకూడా ఉన్నట్లు వ్యక్త పరిచాడు.

* * *

అంతా ఒకవారంలో వీరభద్రయ్యసెట్టి గృహంలో, స్వప్నంలోకూడా ఎవ్వరూఅనుకోనిమార్పు జరిగింది. జనావాలో పుట్టిన ఆ సుడిగాలి పెచ్చుపెరిగి మగవారిని కూడా తుడిచిపెట్టేసింది. ఇంట్లో సవతితల్లి మూలాన్న, తనకీ, భార్యకీ, పిల్లలకీ సరియైన జరుగుబాటు లేకుండా పోతోందనీ, సవతితల్లికీ, ఆమె పిల్లలకీ, ఆమె కోడలికీ ఎక్కువ సదుపాయాలు వీరభద్రయ్యసెట్టి చేస్తున్నాడనీ గోవిందసెట్టి ఆరోపణ.

తగవు పెద్దమనుష్యులవరకూ వెళ్లింది. దాని ఫలితంగా భద్రయ్యసెట్టి, తన ప్రథమ కళత్రం కుమారుడు గోవిందసెట్టికి మూడు వేల రూపాయల రొఖ్ఖం ఇచ్చేటట్టున్నూ, గోవిందసెట్టికి తండ్రి స్థిర, చరాస్తులలో కల సర్వహక్కులూ వదలుకునేటట్టున్నూ, పరిష్కారం జరిగింది.

ఈమధ్య జానకిరామయ్య స్వయంగా వ్యాపారం పెట్టతలచినట్లు అన్నమాటలకూ, కొడుకు గోవిందసెట్టి తనతో తగవు పడ్డానికీ ముడిపెట్టేడు భద్రయ్యసెట్టి. తనకొడుకునకు వేరుకావాలనే పాడుబుద్ధి స్వతహాగా పుట్టలేదనీ, దానికి గుమాస్తా ప్రేరేపణే కారణమనీ, నిందవేసేడు. మరునాడే జానకిరామయ్య గుమాస్తా ఉద్యోగానికి, ఉద్వాసన ఇచ్చేడుసెట్టి. "అన్నీ మనమేలుకొరకే!" అన్నాడు జానకిరామయ్య.

గోవిందసెట్టి ఇంటివద్ద పెట్టిన తగవుకి జానకిరామయ్య ఏ విధంగానూ బాధ్యుడు కాడు. తగవు పెద్ద మనుష్యుల చేతులలోనికి వెళ్ళిందాకా ఆ విషయం అతనికి తెలియనే తెలియదు.

ఒకమాసం తరువాత గోవిందసెట్టీ, జానకిరామయ్య కలసి ఉమ్మడిగా వ్యాపారము పెట్టారు. కిరాణా కొట్టూ, కందులు, సెనగలు మొదలైన అపరాలూ, చింతపండూ టోకువర్తకం వాళ్ళది. వ్యాపారం చిరపరిచితమే కాబట్టి క్రొత్తలేకపోయింది వాటాదార్లకు. వ్యాపారం ఉమ్మడిగా పెటడంతో ప్రజలలో జానకిరామయ్యే, తండ్రీ కొడుకుల తగవుకు కారణభూతుడని నిర్ధారణ అయింది. అది ప్రమాదం లేని అపవాదుగా భావించాడు జానకిరామయ్య.

వ్యాపారం అమోఘంగా సాగింది. యిది వాళ్ళకు కల్పవృక్షమయింది. తెలుపూ, నలుపుల సమ్మేళనతో వ్యాపారం ప్రారంభించిన పది సంవత్సరాల కల్లా బజారుకు సమీపంలో ఒక రెండు అంతస్తుల మేడ, పదివేల రూపాయల కిమ్మత్తుతో వుమ్మడిగా కొన్నారు. పెద్దలంతా కలసి ఏకగ్రీవంగా నిశ్చయించిన సుముహూర్తాన్న గృహప్రవేశం వైభవంగా జరిగింది. జానకిరామయ్యా, అతని సంసారం, తూర్పుభాగములో గోవిందసెట్టీ, అతని సంసారం పడమటి భాగంలోనూ దిగారు. మేడకు వెనుక భాగంలో వున్న షెడ్డులు, సరకుల నిల్వకు కేటాయించబడ్డాయి.



దీపావళి సరదా
—ఫొటో: [శ్రీపాద వెంకన్న.]

రాజమండ్రీలో జానకిరామయ్యకు, గోవిందసెట్టికీ, భద్రయ్యసెట్టికికూడా లేని పలుకుబడి వచ్చింది. నిజంగా వాళ్ళ పెట్టుబడుల సొమ్ము ఎంతో తెలియదు కాని, వ్యాపారం ఇరవై వేలతో సాగుతూఉన్నట్లు ప్రజా వాక్కు.

పుష్కరన్నర పైచిలుకుగా సాఫీగా పోతూవున్న వ్యాపారంలో ఇప్పుడు కొన్ని చెప్పుకోతగ్గ మార్పులువచ్చాయి. గోవిందసెట్టికి వుబ్బసంవ్యాధి మూలాన్న, చిల్లర కొట్టుమీద తరచు అతని కుమారుడు రాంబాబు కూర్చుంటున్నాడు. జానకిరామయ్య యథాప్రకారం టోకు వర్తకం ఖరీదులూ, అమ్మకాలూ చూస్తూవున్నాడు.

రాంబాబు చూస్తూవున్న చిల్లరకొట్టు వ్యాపారంలో ఈమధ్య పెట్టుబడి అధికం అయినా, లాభములు మామూలుకన్నా తక్కువగా కనబడుతూన్నది.

రాంబాబు జమీందారీ ఖర్చునూ, పరివారాన్నీ చూసి, జానకిరామయ్యకు అనుమానం వేసిందంటే ఆశ్చర్యంలేదు. జానకిరామయ్య చూస్తూవుండగా నాలుగయిదు పర్యాయములు, రాంబాబు తనపేరని ఖర్చు వ్రాయకుండా సొమ్ము తీసుకొనటం జరిగింది. ఒకటి రెండురోజులు చూచి, రాంబాబు ఖర్చువ్రాయకపోవటంవల్ల, జానకిరామయ్యే ఆ సొమ్ముని రాంబాబుపేర గుమస్తాతో చెప్పి ఖర్చు వ్రాయించటమూ, తరువాత "మరచిపోయాను పని తొందరలో" అని రాంబాబు సర్దుకొనడమూ జరిగాయి.

"నిజంగా రాంబాబు మరచిపోయే ఖర్చు వ్రాయలేదా, లేక జ్ఞాపకం వుండే వ్రాయలేదా?" అనేది వేరే ప్రశ్న. జానకిరామయ్యకు మాత్రం వాడుకున్న సొమ్ము ఖర్చు వ్రాయటం మరచిపోవటం ఏమిటో అనిపించింది. ఎగవేసే కోరిక వుంటే ఖర్చు వ్రాయలేదనే అతని అభిప్రాయం.

జానకిరామయ్య కుండబద్దలు కొట్టినట్లు మాటలాడే మనిషి. తోచింది, మంచి అయినా, చెడు అయినా ముఖంమీద అని వేయటమే!

జానకిరామయ్యకు పుటిందే బుద్ధిగా, ఒక రోజు గోవిందసెట్టిని ఏకాంతంగా కలిసిందే తడవుగా రాంబాబు విషయం ఎత్తాడు:

"చిల్లరకొట్టులో కొంతకాలంగా పెట్టుబడులు ఎక్కువ అయినా లాభంలు మామూలుగానన్నా రావటంలేదు."

"ఏంచేత ఏటండీ? కొట్టుమీద నేను కూచోడం లేదుకదా; అబ్బాయి మీరూ వుంటున్నాను."

తనకి నష్టం కలుగుతూ వున్న మాట ఎలాగువున్నా, మిత్రుడికి తెలిసిన విషయం చెప్పడం ముఖ్యంగా ఈ సందర్భంలో తన కనీస బాధ్యతగా గుర్తించి— "రాంబాబు విషయం నాకు ఏమీ నచ్చలేదు. అతను, అతని ఖర్చు అతని మిత్ర బృందం, అంతా." అన్నాడు జానకిరామయ్య.

"ఏటండి! ఆడేంచేశాడు?"

"రాంబాబు ఖర్చుకి అంతూదరీ కనపడటంలేదు. అప్పుడప్పుడు కొట్లో ఖర్చు వ్రాయకుండా కూడా సొమ్ము నాలుగూ, అయిదూ వాడుకోటం చూచాను. రాంబాబుతో చెప్పేను కూడా. "మరచిపోయాను" అంటాడు. నా పరోక్షంలో ఎన్నిసారులు వాడుకుంటున్నాడో ఎవరు చూడవచ్చారు? అంతా అంతే అయితే ఉమ్మడి వ్యాపారంచేసి, వాటాదారులు మట్టి తినవలసినదే! ఎందుకొచ్చిన వ్యాపారం, కొట్టుమూసి, ఇంటి వద్ద పరుండటే నయం, ఉన్నది అన్నా మిగులుతుంది." అని ఒక చదువు యథాశక్తి చదివాడు.

మాటలాడటం కూడా ఒకకళే. తూచి

★ ప్రకృతి పరిష్కారం ★

మాటలాడటానికి నేర్పు కావాలి. మానసికంగా కలిగిన వైపరీత్యములు మాటలుగా బహిర్గతము కాకుండా పట్టి, మాటలాడ గలగటం ఎక్కడో! అందులో జానకిరామయ్య వంటి నూటికినూరు పాళ్ళూ ఆత్మవిశ్వాసం కల వ్యక్తితూచి మాటలాడలేదంటే, కించకానీ, కినుక కాని మనం వహించవలసిన అవసరం లేదు.

కొందరు వ్యాపారస్తులలాగనే గోవింద సెట్టి, స్నేహపాత్రుడు అయినా అనుమానస్తుడు. పట్టుదల విషయంలో "తాపట్టిన కుందేటికి మూడే కాళ్ళు" అనే రకం.

టోకు వర్తకం ఖరీదులలో జానకి రామయ్య అసలు ధరలు కప్పిపుచ్చి దొంగ ధరలు చూపించి, డబ్బు మిగుల్చుకుంటున్నాడని గోవిందసెట్టికి కొంతకాలంగా అనుమానంగా వుంది. ఒకటి, రెండు పర్యాయములు ఖరీదుల విషయంలో అతను అడిగిన ప్రశ్నలకు జానకిరామయ్య అన్యమనస్కుడై వుండి, తడుముకుని, డొంక తిరుగుడుగా ఇచ్చిన జవాబులు అతని అనుమానాలని బలపరిచాయి. "చేపనయ్య కబుర్లకు పడిపోయి నమ్మేత్తాననుకుంటున్నాడు. చెప్పనీ, టైము రాక పోద్దేటి?" అనుకునే వాడు అలాంటి సమయాలలో తను కొట్టు మీద వుండకపోవటం, వుండే రాంబాబుకి వ్యాపారం సరిగా తెలియకపోవటం, జానకి రామయ్య చేసే మాయకి వీలు ఇస్తున్నాయని సెట్టి నమ్మకం.

రాంబాబు, గోవిందసెట్టికి ఏకైక పుత్రుడు. అందులోనూ ప్రప్రథముడు. తండ్రికి ప్రథముడు అంటే అభిమానం అంటారు. సెట్టికి రాంబాబు ఖర్చు పెట్టుతున్నాడు అంటే సంతోషం. "ఎప్పుడను భవించినా ఆడు అనుభవించవలసిందె కదేటండీ?" అంటూ వుంటాడు. ఉమ్మడి వ్యాపారంలో సొమ్ము వాటాదారుకు తెలియకుండా అపహరిస్తున్నాడు అనటంకంటె వేరేనింద ఏమికావాలి? అందులోనూ తను పెద్ద నిజాయితీ కలవాడిలా ఎదుటివాళ్ళని తీసేస్తున్నాడు. మంచి అదను దొరకింది, అనుకున్నాడు గోవిందసెట్టి.

"పాపం! ఆడికి సరకు ఖరీదుల్లో కమీషనూ, ఇంకా, ఇంకా..., కిట్టటం లేదు కాబోసు. ఏం చేత్తాడు?, దొంగసొమ్ము తినకపోతే! అమ్మ, బాబా ఆడికీ ఇయ్యటానికి," అన్నాడు సెట్టి జ్వలిస్తూవున్న కోపాన్ని ఎదురుఎత్తి పొడుపులతో అణచుకోవటానికి ప్రయత్నంచేస్తూ.

జానకిరామయ్యకు సెట్టి మాటలలో విపరీతార్థం వున్నట్లు తోచలేదు. "ఖరీదులు నేను చూస్తున్నా కాబట్టి కాని లేకపోతేనా?"

అంతతో వదల తలచుకోలేదు సెట్టి— "ఎటో, అంచేతే ఆడికి పైగా సొమ్ము ముట్టక దొంగసొమ్ము తింటేగాని గడవదు; ఏం చేత్తాడు?" అని దీర్ఘాలతో తన అభిప్రాయం (జానకిరామయ్య కమీషనులు తింటూవున్నట్లు) వ్యక్తమయ్యేలాగున అన్నాడు.

గోవిందసెట్టి మాటలలో ఉన్న వ్యంగ్యార్థం ఇప్పుడు అర్థం అయింది జానకిరామయ్యకు.—"ఏమిటి! అయితే నేను సరకు ఖరీదులలో సొమ్ము మిగుల్చుకుంటున్నాను. అనేగా నీ వుద్దేశం? రాంబాబు విషయం, వ్యాపారంలో వాటాదారుని కాబట్టే, నీ స్నేహితుణ్ణి కాబట్టే, అభిమానం కొద్దీ అన్నాను. మన స్నేహాన్ని అన్నా పాటించకుండా, నీ ఇష్టం వచ్చినట్లు పరియాచకాలు ఆడితే పడటానికి ఎవ్వరూ లేరు?" అన్నాడు ఎప్పుడో కాని కోపంరాని సాత్త్వికులకు కోపం వచ్చిన తీవ్రతతో.

జానకిరామయ్య కొంతసేపటిక్రింద దాకా సెటికి ప్రాణ స్నేహితుడు. ఇంతలోనే ఎంతమార్పు! శరీరమే క్షణ భంగురము; మరి స్నేహం ఎందుకు అవకుండా పోతుంది.? చంచల లక్ష్మి అన్నింటికీ కారణ భూతం!

సెట్టికనులు ఎర్రపడ్డాయి. పళ్లు పటపట లాడాయి. కోపంతో కంపించి పోయాడు. ఏదో మాటలాడటానికి ప్రయత్నించాడు. కాని మాటలు మనసులోనే కరిగి, ఇగిరి పోయాయి. అంతట్లోనే తలవని తలంపుగా, అప్రయత్నంగా జిహ్వాగహ్వరంలోనుండి, అక్షర కవాటాలను తోసుకుని, దూసుకుని— అగ్నిపర్వతం ప్రేలినట్లు—.

"అవును. దొంగతనం కటటం అభిమానం కదేటి మరి? ఎవళ్లిదాకా వత్తేకాని ఆళ్లకి తెలియదు. ఆడిపోషన అంతా మీరే చూత్తూన్నట్టు, ఎందుకొచ్చిన మాటలు? అభిమానం అంట అభిమానం. మీకు నష్టం కలుగుతావుందని చెప్పకూడదూ? ఆడు నా తరఫు మనిషి అయ్యాక ఆడినడం ఒకటే, నన్ననటం ఒకటేటి? ఈయాల ఆడినన్నావు రేపు నేను ఆడిని నీకు తెలియకుండా సొమ్ము తీయమంటున్నానంటావు. ఏటి నరంలేని నాలిక్కా?" అనివేసి చట్టనలేచి వెళ్ళి పోయాడు ఒగర్చుకుంటూ.

జానకిరామయ్యకు ఒళ్ళు ఎండిన తాటి ఆకుల మంటలా రపరపలాడింది. ఇన్నాళ్లు తను ప్రాణ మిత్రుడు అనుకుంటూ వున్నా సెట్టి తనగుణం పోనిచ్చుకోలేదు. తన మనస్సు తెలుసుకోలేకపోయాడు. రాంబాబు మున్ముందు భ్రష్టుడయితే అతనికే తెలుస్తుంది. మంచికి పోతే నిష్ఠూరం ఎదురైందిట! కోపంవస్తే ఎవరికి భయం? అతని అంతటి వాడు అతనూ, నా అంతటి వాడను నేనూ" అనుకున్నాడు.

ఆ సాయంకాలం రాంబాబు వచ్చి, జానకిరామయ్యను కొట్టే అంత దూకుడుగా నానా అవాచ్యములూ ఆడి వెళ్లిపోయాడు. జానకిరామయ్యకు మాటలాడటం చేతకాదట

(56 వ పేజీ చూడండి)

మధాప్రాద్యం

మహానగరం.

మధ్యాహ్నం.

కలవాడిపై లేనివాడి ఆగ్రహంలా ఎండ మండిపోతోంది.

నగరం మధ్య కాళీప్రదేశంలో మహా ధనికుడొకడు భవనం నిర్మిస్తున్నాడు. భవనం నిర్మించే పనివాళ్ళు దగ్గరగా ఉన్న టీ దుకాణంలో టీ తాగుతున్నారు.

నిర్మాణంలో ఉన్న భవంతినీ, దుకాణం దగ్గర టీ తాగుతున్న కూలివాళ్ళను, ముష్టి కుర్రవాడొకడు గోడనీడలో నిలబడి ఆకలితో తదేకంగా చూస్తున్నాడు. అతని కడుపులో ఆకలి అవురావురుమంటున్నది. ఆత్మారాముడి గోలకి వాడికి చాలా చిరాకేసింది. ఎంత ఊరుకోపెట్టినా ఆకలి ఊరుకోవటంలేదు. ఇక ఆకలిని కూక లేయడం అతనిశ్రమకు మించినపనయింది.

అతని అనుమతి లేకుండానే కుడిచెయ్యి లాగు జేబులోకిపోయి "అరుడబ్బులే ఉన్నాయిస్తా" అనే సత్యాన్ని గ్రహించి నిరాశగా బైటికివచ్చింది. ఇవాళ తనకీ అరుకాన్లేనా గతి?—

ఎవరిని డబ్బులడిగినా "ఏదైనా కూలిపని చేసికోరాదూ! పో! ఫో—ప్రతివాడికీ ఇదో తెగులు" అని సలహా ఇచ్చేవారే కానీ, కానీ ఇచ్చేవారే కరువయారు.

తనూ కూలికి కుదిరితే—

తనూ వాళ్ళలా రూపాయి, రూపాయి న్నరా సంపాదించ వచ్చు - హాయిగా తనకి కావలసినది తిని, రెండుమూడు సార్లు టీ తాగవచ్చు.

అయినా తనని కూలికెవరు పెట్టు కొంటారు? 'కుర్రాడవు పనికిరావు పొమ్మంటారు.

అయినా కుర్రవాళ్ళకి కూలి తక్కువ. కూలి తక్కువయినా పనిమాత్రం పూర్తిగా చేయిస్తారు. ఏ అర్థరూపాయో కన్నా ఇవ్వనే ఇవ్వరు. శ్రమపడితే తిండీ ఎక్కువ తినాలి. ఆడబ్బుల్తో తను తిని టీతాగిస్తే ఇంటికి తీసికెళ్ళడానికేమి మిగుల్తుంది. శ్రమపడి లాభం ఏమిటి? ఈ ముష్టేనయం. ఏరోజు అరణాలు తిండికి లేకపోయినా సవతితల్లి ఒళ్ళు కుళ్ళపొడుస్తుంది—డబ్బులు ఇన్నేవచ్చాయన్నా ఊరుకోదు. "రోజల్లా తిరిగినా ఇంతేనా? ఖర్చు పెట్టేస్తున్నావు" అంటుంది. ఇందులో ఖర్చు పెడ్తే ఎలా ఇప్పుడు? ఆకలి ముందుకు లాగుతోంది. ఆలోచన, అనవసరంగా తొందర పడకు-అని హెచ్చరిస్తోంది.

పక్కనే ఏదో శబ్దమైతే కుర్రాడు, దృష్టి 'టీదుకాణం'నుంచి మరల్చుకొని చూశాడు. అతనికి హఠాత్తుగా నవ్వొచ్చింది. ఆ నవ్వు శబ్దంచేసికొంటూ పైకివచ్చింది. తన దగ్గరలో ఓగుడ్డి ముష్టివాడు నడుస్తూ నడుస్తూ చేతికర్ర రెండు ముక్కలయి పడిపోయాడు. అతనికి ఊతంగాఉన్న చేతిలోకర్ర రెండు ముక్కలయింది మధ్యకి. దెబ్బ అంతగా ఏమీ తగల్లేదు కాని ముసలాడు పడిపోయాడు. ముసలి గుడ్డి ముష్టివాడికి దగ్గరలో ఎవరో తనను చూచి ఇకిలించి నవ్వుతున్నట్లు వినిపించింది. తనకున్న ఆధారం పోవడమే కాకుండా తననుచూసి నవ్వడమా?

'కనక్ ప్రవాసి'

నవ్వుతూ ఆకలి సంగతి ఓ క్షణం మరచి పోయాడు కుర్రాడు. గుడ్డివాడి స్థితి చూస్తూంటే అతనికి నవ్వాగడంలేదు.

"ఉన్న ఆధారంకూడా పోయి ఏడుస్తూంటే ఎందుకలా నవ్వుతావు?"

కోపపడ్డాడు ముసలాడు.

కొంతసేపటికి కాని కుర్రాడికి నవ్వాగ లేదు. ఆ గుడ్డి ముసలాడంటే కుర్రాడికి జాలి లేక కాదు. అతను పడిపోయి కర్రకూడ విరిగి పోయిన ఆ స్థితిచూస్తే అతనికి నవ్వొచ్చింది. ఏమిటో ఆ నవ్వు మరింత వెర్రిఅయింది. కుర్రాడికి ఆ గుడ్డివాడి పరిస్థితి అర్థమయేసరికి కన్నీళ్ళు వచ్చాయి. కన్నీళ్ళు వచ్చాక ఇక నవ్వ లేకపోయాడు కుర్రాడు.

ఆ గుడ్డి ముష్టివాడికంటె తనేంగొప్ప? అనే ఆలోచన కలిగింది కుర్రాడికి.

అన్ని అవయవాలూ సరిగా పనిచేస్తున్న తనబోటిగాళ్ళు ముష్టడిగితే-"దున్నపోతులా ఉన్నావు. కూలిచేసికోరాదా?" అని నానా తిట్లూ తిడ్తారు. కాని ఎప్పుడోకాని అందరూ చప్పున దయతో ధర్మం చెయ్యరు. కుంటి గుడ్డివాళ్ళమీద ఈ ప్రపంచం చూపించే జాలి మామూలు ముష్టివాళ్ళమీద చూపించదు. వాళ్ళకీ ఒకొక్కసారి ధర్మం చెయ్యకపోయినా, జాలయినా ప్రకటిస్తుంది. ఈ గుడ్డాడి సంపాదనతో పోల్చుకుంటే తనదేపాటిది? ఈ ముసలాడికి కళ్ళు కనిపించకపోవడం నిజంగా ఎంత అదృష్టం? అనుకున్నాడు. ఆ ఊహతో నీరసంలో కూడ అతని కళ్ళు మెరిశాయి.

ఈ గుడ్డివాడికి సాయంగా వాడితోకూడ తను ఉంటే ఇప్పటికంటె ఎక్కువ సంపాదించవచ్చు. ఈ ఆలోచన చప్పున స్ఫురించింది కుర్రాడికి. ఇంతకాలమూ తనకీ ఊహ రాక, ఈ సమయంలోనే అది స్ఫురించడమేమిటో కుర్రాడికి ఏదో వింత ఆనందాన్నిచ్చింది.

ఆలోచన స్ఫురించడమే తడవుగా కుర్రాడు గుడ్డివాడి దగ్గరగా వెళ్ళాడు.

"నవ్వేనని కోపంవచ్చిందా?" అన్నాడు జాలిగా.

"మరి కోపంరాదూ? నవ్వెందుకు?"

"పొరపాటున నవ్వాను. ఏమీఅనుకోకు"

"ఏమీ అనుకోను. కాని నువ్వెవరవు?"

"నేనూ ముష్టెతుకొనే వాడినేలే! ఐతే నీ చేతికర్ర పోయిందికదా, మరి ఎలా నడుస్తావు?"

"కర్ర వుంటే, కళ్ళు లేకపోయినా యిబ్బంది లేకపోయేది. ఎలాగా అని



★ యథాపూర్వం ★

ఆలోచిస్తున్నా. అంతా ఆ రామయ్య తండ్రిదయ" అని నిట్టూర్చాడు గుడ్డివాడు.

"ఫరవాలేదు తాతా; నేనూ ముష్టెత్తడమే గనక నీకు సాయంగాకూడా వుంటాను. రోజూ వచ్చింది మనం ఇద్దరం సమంగా పంచుకుందాం. నీ కిష్టమేనా?"

"నానాయనే! నాబాబే! ఎంతకాలానికి దొరికావు నాయనా! ఎంతకాలంనుంచో చూస్తున్నాను. నీలాంటి కుర్రాడెక్కడైనా దొరుకుతాడా అని. ఇన్నాళ్ళకి ఆ రామయ్యతండ్రే కనికరించి నిన్ను పంపించాడు", అన్నాడు ఆనందంతో గుడ్డివాడు.

* * *

గుడ్డివాడూ కుర్రవాడూ నడుస్తున్నారు.

గుడ్డివాణ్ణి కుర్రవాడు నడిపిస్తున్నాడు.

కర్రపోయిన క్షణంలోనే తనకీ కుర్రాడి ఆధారం చూపించిన దైవానికి మనస్సులో నమస్కరించాడు గుడ్డివాడు. తనకీ గుడ్డివాడివల్ల సంపాదన పెరుగుతుందనే ఆనందంతో అడుగు చురుగ్గా వేస్తున్నాడు కుర్రాడు.

కుర్రవాడు——

గుడ్డివాడు——

కుర్రాడు ముందూ——గుడ్డాడు వెనకా.

గుడ్డివాడు కుర్రాడి అడుగులో అడుగు కలపలేక పోతున్నాడు.

ఏమైనా వాడు కుర్రాడు, కళ్ళున్నవాడూ.

తనేమో ముసలాడు, గుడ్డాడూ.

ఇద్దరి నడకా ఒకటెలా అవుతుంది?

కుర్రాడు గబగబా అడుగులు వేస్తున్నాడు.

గుడ్డివాడికి, బరబర లాక్కుపోతున్నట్టుంది, కాని తనకిసాయంగా ఉండి నడిపిస్తున్నట్టు లేదు. ఇంతకాలం తానొక్కడూ నడవడం కుర్రాడికి అలవాటు. తన యిష్టం వచ్చినట్టు నడిచేవాడు.

గుడ్డివాడికి కర్ర ఆధారమేకాని మనిషి సాయం ఎప్పుడూ లేదు. కుర్రాడు దారి చూపుతూంటే అతనికీవేళ నడక కొత్తగా ఉంది. అడుగు త్వరగా పడటంలేదు.

చేతికర్ర ముసలాడి స్వాధీనంలోవుం డేది



జాఫ్రి మేన్నర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్. రిజిస్టర్డు ఉపయోగకులు. ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే

మరీ బడాయి!

గొప్ప డాక్టర్‌గా పేరుపడిన ఒకాయన చాలకాలం తరవాత తను పుట్టి పెరిగిన గ్రామం వచ్చాడు. గ్రామస్థులు ఆయన్ని ఇంద్రుడనీ, చంద్రుడనీ బ్రహ్మరథం పట్టేశారు. పాపం ఆ డాక్టరు స్వతహాగా మంచివాడు, వినయం గలవాడు. ఇందులో తన గొప్పదనం ఏమీ లేదని చెప్పాలని ఆయన ఉద్దేశం. అందుకని సన్మానానికి సమాధానంగా,

"ఈ పొగడ్తలకు నేను అర్హుణ్ణికాను. ఇందులో నేను చేసిందేమీ లేదు. రోగులు తమంతటతామే నా దగ్గిరికి వస్తారు. మామూలుగా తమ రోగమేమిటో తామే చెప్పేస్తారు. మామూలుగా తమ రోగానికి మందేమిటో తామే చెప్పేసి కొనుక్కుంటారు ..." ఈ తరహాలో చెప్పుకుపోయాడు ఆయన.

—మిసెస్ జి. క్రాస్.

చేతికర్ర ఉన్నప్పటి ధీమా, ఆ తృప్తి వేరు. కర్ర పోయినందుకు, ఒకవిధంగా కుర్రాడి సాయం దొరికినందుకు వాడికి ఆనందంగానే ఉంది. వాడు లేకపోతే తనస్థితి నిస్సహాయం-అదే అతనికి బాధాకరంగా వుంది.

స్వేచ్ఛగా నడిచే కుర్రాడికిమాత్రం యీ ముసలాడు భారం కాదూ? ఓ గుడ్డివాడికి సాయపడుతున్నాననే ఆనందం కుర్రాడికి లేకపోయింది. ఈ గుడ్డిముసిలాడు తన స్వేచ్ఛకి ఎంత అవరోధంగా ఉన్నాడో మాటిమాటికి కుర్రాడికి అనుభవానికొచ్చింది. ఈ మూడురోజులూ ఇద్దరూ ఎవరిబాధను వారు అనుభవిస్తూ ఏదోవిధంగా సరిపెట్టుకుంటూ వస్తున్నారు.

నాలుగోరోజు ఇద్దరికీ చెడింది.

ఈ కుర్రకుంక పనికిమాలిన వెధవ అని గుడ్డివాడు గ్రహించాడు. తనతో తిరగనప్పుడు వీడికి రోజుకి అణా అయినా ఉండేదికాదు సంపాదన-అనుకున్నాడు.

ఈ గుడ్డివాడు శుద్ధ సోమరిపోతు వెధవ. ఎక్కడో ఓ చోట కూర్చోడమేగాని ఊరంతా తిరగలేడు వీడు. కూర్చుని తింటున్నాడు. తనే లేకపోతే వీడికీమాత్రం సంపాదన కూడా ఉండేదికాదు కదా-అనుకున్నాడు కుర్రాడు.

ఎవరైనా డబ్బులు వేస్తుంటే డబ్బా పట్టేవాడు కుర్రాడు. అప్పుడప్పుడు అందులో పడే డబ్బులు తీసి జేబులో దాస్తున్నాడు కుర్రాడు. గుడ్డివాడికి తెలియకుండా రహస్యంగా డబ్బాలో ఎన్ని డబ్బులు పడిందీ లెక్కచూశాడు కుర్రాడు. రూపాయి మూడణాలు ఉంది - అందులో మూడణాలు వాడివి.

"రూపాయి పైగా ఉంటుందేమో" అన్నాడు గుడ్డివాడు, కుర్రాడు డబ్బులు లెక్కపెడుతూంటే. కుర్రాడికి చాలా కోపం వచ్చింది.

ముప్పావలాకన్న ఎక్కువలేదని చెప్పదల్చుకున్నాడు కుర్రాడు. 'గుడ్డివాడు ఎంత పడిందీ ఊహించాడా? లేక పడేడబ్బులు చప్పుడునుబట్టికాని గ్రహించాడేమో!' అనుకొన్నాడు కుర్రాడు.

తనకీవేళ గుడ్డివాడికంటె ఎక్కువ వాటా రావలసిందే! పద్నాలుగణాలని లెక్క చెప్పాడు, బాగా ఆలోచించి.

"అంతేనా? ఇంకా ఎక్కువే ఉంటాయే-సరిగ్గా లెక్కపెట్టు మళ్లీ" అన్నాడు గుడ్డాడు.

"ఇదుగో చూడు" అని రూపాయిలోంచి వేసతీసి నెమ్మదిగా జేబులో వేసుకొని "ఇదుగో పద్నాలుగణాలు-నేనేమైనా తినేశానా? అందులో ఏడణాలు నీవి. ఏడణాలు నావి. ఈ వేళ అట్టే రాలేదు కనక, పాపం, పోనీ నాదాంటోది ఓ అర్థణా తీసికో" అని జాలి చూపించాడు కుర్రాడు.

తనమీద జాలికొద్దీ ఇంకో అర్థణా వాడు తన దాన్లోంచి తీసి దానం చేస్తుంటే గుడ్డివాడు ఏం మాట్లాడగలడు! ఏం చేస్తాడు?

దగ్గర చెత్తకుండీ క్రింద పులివిస్తరాకులు పడినాయి. పడీపడడంతోనే ఓ కుక్క వచ్చింది. అది ఓ ఆకులాగిందో లేదో మరో కుక్క "రంయి" మని వచ్చింది. రెండో కుక్క మొదటిదాన్ని గెంటేసింది. ఆ వచ్చిన రెండోది బలమైనది, నోరున్నది. మొదటికుక్క ఓ ఆకు చిక్కించుకొని దూరంగా లాక్కుపోతుంటే రెండోది దాంతో కొట్లాడి ఆ ఆకులో కూడ సగం చింపేసి మిగిలిన ఆకులకేసి రాకుండా చూసుకుంటూ తింటూంది.

గుడ్డివాడికి కుక్కల కొట్లాటతో ఆకలి కేక లేసింది. "ఆకలేస్తోంది కొని పట్టుకురా ఏదైనా" అన్నాడు గుడ్డివాడు. ఏదైనా కొనిపట్టుకు రావడంలో గుడ్డాడికి ఇందాక తను ధర్మంచేసిన అర్థణా కొట్టేయాలనుకున్నాడు కుర్రాడు.

గుడ్డి వెధవ—ఏం తెలుస్తుంది?

ఏదైనా కొని తేడానికి బయలు దేరాడు కుర్రాడు. ఒక్కొక్క అడుగే వేస్తుంటే ఒక్కొక్క కొత్త ఆలోచన స్ఫురించ సాగింది కుర్రాడికి. ఏమీ కొనకుండా, ఈడబ్బు లేవీ ఇవ్వకుండా తను ఇలా పారిపోతే-తనకీ కడుపు నిండుతుంది.-ఈశని పీనుగ వెంపదావదులుతుంది.

గబగబా నడుస్తున్నాడు కుర్రాడు. గుడ్డివాడిని వెనక వదిలిపెట్టిన చోటికి వచ్చాడు. మేడకట్టే చోట కూలీలందరూ వెళ్ళిపోయారు. అప్పుడే చీకటికూడ పడింది:


గుడ్డివాడు మళ్ళీ జ్ఞాపకానికి వచ్చాడు. తను లేకపోతే గుడ్డివాడి అవస్థేంఅవుతుందో? గుడ్డివాడికి తను అన్యాయం చేస్తున్నానేమో అనిపించింది కుర్రాడికి—ఆ భవనం దగ్గర ఎవరూ లేరు. అక్కడున్న కర్రలో కాస్త పొడుగుపాటిది చేతికి సరిపోయే వెదురు కర్ర ఒకటి ఏరి తీసికొని వెనక్కి తిరిగి వచ్చాడు.

వచ్చే సరికి గుడ్డివాడు కూర్చునే నిద్రపోతున్నాడు. వాడికి దగ్గరగా ఆకర్ర ముక్క పెట్టి వచ్చేశాడు.

చెత్తకుండీ దగ్గర రెండో కుక్క ఇంకా ఏదో తింటోంది. మొదటి కుక్క ఎక్కడికి పోయిందో పోయింది. కుర్రాడు పోతూ పోతూ ఊరుకోక ఆ కుక్కను ఒక్క తాపు తన్నాడు. అది 'కుయ్యో' మంటూ కొంచెందూరం పరుగెత్తింది. కుర్రాడు వీధి మలుపు తిరగగానే మళ్ళీ కుక్క కుండీ దగ్గరకొచ్చి తింటోంది.

(ఆంగ్లకథ ఆధారం)

★



విక్రమార్కుడి మార్కు సింహాసనం

చలచిత్ర కథలు

ఎస్. పార్థసారథి

వాడే! వీడు!

డ్యూయెట్ సీనులో 'హీరోయిన్ పాట వినుట' ను నటిస్తున్న హీరో లాంటి మొహం పెట్టాడు రాజు. "సొంత అయిడియాలూ, కళేజీ ఉంచుకుంటానంటే ఇందులో పనికిరావన్నమాట" అన్నాడు అమాయకంగా.

"కళేజీ లేదు కావేజీ లేదు. అవన్నీ జావా హై. అవ్వా కావాలి బువ్వా కావాలంటే ఎలా?" అంటూ సుబ్బారావు వెళిపోయాడు.

"డబ్బు-లతులు, వెళ్ళు చంపు-వద్దు కిర్తి" అంటూ గావుకేకలు పెట్టే సినీమా ఆత్మలాగా, రాజు కడుపులో కామేశ్వరరావు ఇవతలకొచ్చేసి ఎదటపడి పవర్‌ఫుల్‌గా చివాట్లెయ్యడం మొదలెట్టాడు. "బుద్ధిలేదా బ్రదర్... కాఫీకి డబ్బులు అడిగినా కూడా వద్దంటావా... ఏడూ నీ కర్మం" అంటూ. ఆపాటి పనికి కూడా ఏపాటి ఓపిక లేకపోయింది రాజుకు.

సినిమా కథ, మొనుపు సీనుమీదనుంచి కొనుపు సీనుమీదకి 'కరిగి' పోయినంత తప్పున రాజు మనసు కలల అలలమీంచి జారి కల్లల కొల్లలమధ్య పడింది. ఆ కల్లలే నిజమని నమ్మ మనసైంది. కాని కల్లలని తెలిసి తెలిసి నిజమని ఎలా నమ్మడం? కాని కల్లలు కావడానికి ముందు కలలని తెలుసుగా? అయితేమటుకు? కలలూ కల్లలేగా? అన్నీ కావు. తెల్లారుగట్ల కలలు నిజం అవుతాయట. మరి ఈ సినిమా కలలలో రాత్రి వచ్చినవేమిటో తెల్లరుగట్లొచ్చినవేమిటో ఎలా తెలీడం? తెల్లవార్లూ వచ్చినవాటి సంగతేలా? కలలు తెల్లవార్లూ రావు. కాసేపే వస్తాయి. వచ్చినా తెల్లవార్లూ వచ్చినట్టని పిస్తాయి. అంచేత ఇప్పుడేంచెయ్యడం? ఝూంమని రైలెక్కెయ్యడం.

టిక్కెట్టుకి డబ్బులేవి? లేవు. కాబట్టి? రాబర్టు బ్రూసులా ఏడుసార్లు ట్రైచెయ్యాలి. భోజరాజులా 32 సార్లు ప్రయత్నించాలి. ఇప్పటికి ఆరు కథలయ్యాయి. ఆరుసుమా "భోజరాజా యుజ్ లెస్" అన్నారు.

* * *

తనూ మనసూ ఇలా డైలాగులిచ్చి పుచ్చుకొని మంచీ చెడ్డా మాట్లాడుకున్నాక మెల్లిగా బయల్దేరబోయాడు రాజు.

అంతలోకే అంతటా చిన్నరకం చీకట్లు కమ్మాయి. నీడపడింది. మబ్బేస్తోంది కాబోలని పైకిచూశాడు రాజు. అలాంటి ఏర్పాటు కనబడలేదు. కోపంవచ్చిన బాక్సాఫీస్ డైరెక్టరులా సూర్యుడుమండిపడుతున్నాడు. ఎలక్షన్ పోలిటీషియన్‌లా ఎండ కుడి ఎడమా లేకుండా పేల్తోంది.

మరి ఈచీకటేమిటి? ఈ నీడేమిటి? అని తలదించాడు రాజు. మిస్టరీ విచ్చిపోయింది. ఈ ప్రకృతి విచిత్రానికి కారణం ఎదురుగా వస్తోంది. అది చాలా పెద్దకారణం. లావుపాటి, పొడుగుపాటి కారణం.

స్క్రిప్టు మొహం చూడకుండా సెట్‌మీదికొచ్చిన డైరెక్టరు భావాలలా గజిబిజిగానూ, ఆర్సన్ వెల్స్ 'ఫ్రేం'కాంపోజిషన్‌లా భయంకరంగానూ, ఆహిరిరాగంలో రిషభగాంధారాలలా వల్లగానూ, జాదరి శాకీలలా దట్టంగాఉన్న ఒక పెద్దగెరాజుత్తు కనబడింది. దానికింద రెండురూపాయలంత ఎర్రటి కుంకంబొట్టు పెట్టుకున్న చిన్న నుదురు. దానికింద శివతాండవానికి పెట్టిన ఎర్రఫ్లడ్ లైట్లలాంటి కళ్లు, చాలా ఏపుగా ఎత్తుగాఉన్న శాల్తీమీద ఎక్కివస్తున్నాయి. అంబారీవేసిన ఏనుగలాంటి ఆ భారీ విగ్రహమే వరహాలరాజుకి ఈ భ్రమకలిగించింది. 'బాలనాగమ్మ సినిమాలో డా॥ గో॥ సుబ్బారావుగారి వేషం వెయ్యొచ్చు ఈ ఆసామి' అనుకున్నాడు రాజు. అనుకుని, కాస్త వారకి జరిగి పక్కకి ఒరిగి సగౌరవంగా దారి ఇచ్చాడు.

అంతలోనే కొంచెం ఆసింటా ఉన్న స్టుడియో గేటులోంచి ఓ పెద్ద వానువచ్చింది దాన్నిండా రంగురంగుల అమ్మాయిలున్నారు. కవాలీపాటలో కోరస్‌లా, నానా గోలగాను ఉంది కారులో. ఆ కారు హఠాత్తుగా ఆగింది. అందులోంచి ఒక అమ్మడు దిగింది.

హాలీవుడ్‌వాళ్ళు ఆమెను చూస్తే మేరిలిన్ మన్రో ఎందుకు పొమ్మంటారు. ఇటాలియన్‌లు సోఫియా లారెన్‌కు సాటితెస్తారు. బ్రిటిష్‌వాళ్ళు "సౌతిండియన్ లక్ష్మీనరసు"కు 'బ్రిటిష్ జవాబు' అని పెద్ద హెడ్డింగులు పెట్టి వాటికింద జేన్‌మాన్స్ ఫీల్డ్, డయానా డార్స్‌ల బొమ్మలు లంగోటీలు కట్టుకున్నవీ, —కుంటున్నవీఅచ్చు వేసిహడావుడిచేస్తారు. అయితేనేం, సౌతిండియన్ లక్ష్మీ నరసును హాలీవుడ్ కాదుగదా, దేశవాళీ హాలీవుడ్‌లో కూడా సినిమాదృష్ట్యా ఎవరూ ఇంకా చూడలేదు. చూసినవాళ్ళకి ఆమె నచ్చలేదు. ఇంకోలాఆమె నచ్చిందని అన్నవాళ్ళు ఆమెకు నచ్చలేదు.

అందువల్ల నరసు ఎక్స్‌ట్రా వేషాలే వేస్తోంది. ఆమెను నటీమణి చేస్తానని ఒకేని పిల్చుకొచ్చిన ఒక ప్రొడ్యూసరు బ్రదరిల్లా, 'అదనీమణి'నిచేసి ఎక్స్‌ట్రా సప్లయర్ కాతాదార్ల జాబితాలో వేయించాడు. తరవాత, నరసు వాళ్ళమ్మని పిలిపించుకుని, తేనాంపేటలో చిన్నకొంప అద్దెకుతీసుకుని కాపరం పెట్టింది. నా అన్నవాడు, మొగదిక్కు లేకుండా ఉండడం మంచిదికాదని రంగన్న అనేవాడిని చేరదీసింది.

ఒకప్పుడు లేలికగా తూలికలా ఫ్రెడ్ ఆస్టెయిర్‌లా శివరావులా ఉంటూ వచ్చిన



శివపార్వతీ శిల్పం

—ఫొటో: పి. సుబ్బారావు-చల్లపల్లి.]

నరసు క్రమంగా స్థిమితపడి మెరిలిన్‌లా తయారైంది.

ఆమె చేరదీసిన రంగన్న చాలా పెద్దవాడు. తెలుగు సినిమా అంత పొడుగువాడు. దాదాపు ఇండియన్ ఫిలిం హీరోయిజ్ అంతలావూ ఉంటాడు. అతని భావాలుకూడా చాలా పెద్దవి. అయినా, ఇంకో చోటు దొరక్క నరసుతోనే కాలక్షేపం చేస్తున్నాడు— సినిమా తీయడానికి మెల్లిగా ప్రయత్నిస్తూ. అర్థన అనేది ఏమీ లేకపోయినా నరసు తెచ్చే దాంటోనే జాగర్త పడుతున్నాడు ఎంత జాగర్త చేసినా, 'దాహం' పుచ్చుకోవడంలో కొంత కరిగిపోతోంది. పొడక్షనంటే మాటలా? చాలా డబ్బు కావాలి. అందుకని రంగన్న నరసు డబ్బులో కొంచెం ఎక్కువ జాగర్త చేయడం మొదలుపెట్టాడు. ఫైనాన్షల్ సెక్రటరీ తనే కాబట్టి, నరసు వేషాలకి సినిమా కంపెనీలూ, ఎక్స్ట్రా సప్లయిర్లూ ఇచ్చే డబ్బు అతనే జమాలు చేస్తాడు. తనను నమ్ముకున్న మనిషి కాబట్టి నరసు జమా ఖర్చులు తేలిగ్గా వెయ్యడు. తిండి గింజలూ గట్రా పడేసూ ఉంటేవాడు. ఎప్పుడన్నా 'మావా ఓ పావలా ఇద్దూ. గాజులు వేయించుకోవాల' అంటుంది.

"ఝె!రిపిల్ల... ఇంద పూలు తీసుకో కొనుక్కో" అని అర్ధరూపాయిచ్చేస్తాడు రంగన్న. నరసు మురిసిపోతుంది మామ ప్రేమకు. కాని ఈ మన్మథ మామ నేసింది మురిసిపోడం. ఎందుకంటే రంగన్నకి రాత్రిళ్లు కూడా రాచకార్యాలు ఎక్కువైపోయాయి. 'ప్రొడక్షన్ తీస్తున్నాను పిల్లోవ్, ఇపుడు కరుచులూ అయ్యన్నీ అడగమాక!" అన్నాడు ఓసారి హుషారుగా. ఒక జూనియర్ నటుడి చేత కథా గట్రా రాయించి పట్టుకొచ్చాడు ఓ రోజున. మర్నాడు రాత్రి ఆ రచయితనే పట్టుకొచ్చాడు. అతను డబ్బు అడుగుతున్నాడు. ఇతడు "ఆగవయా గురో. మనిద్దరం ముంగల ఈ పిక్చరుమీన ఈ మాపిటికి కూడుందారి. పిక్చరు మెంటూ గట్రా అయిలేనే గందా నీకు ఎడమాస్సు ఇచ్చేది' అని విసుక్కున్నాడు.

ఆ "నటయితీ", "ఆక లేస్తా వుంటే, ఇవన్నీ ఎవరు చేస్తాడయ్యా?" అని విసుక్కున్నాడు. కాసేపు ఇద్దరూ గింజుకున్నాక, రంగన్న నరసుని పిలిచాడు.

"నరసూ నేనిప్పుడే టీ ఒట్టుకొస్తానుగాని, ఈలోగా నువ్వు ఈరితో డిస్కషింగు సేత్తా ఉండు. ఈరోయిను పాయింటు మీన కూడని మాటాడుతూ ఉండండి. నీకేలే ఆరోసం" అనిచెప్పి హడావుడిగా వెళ్ళాడు.

చిరాగ్గానే నరసూకూర్చుంది ఆగదిలో. రైటరు కథగురించి కబుర్లు చెప్పడం మానేసి, గుటకలూ మింగుతూ గుడ్లుమిటకరించి చూస్తూ దగ్గిరా జరుగుతున్నాడు.

★ విక్రమార్కుడి మార్కు సింహాసనం ★

కూడ ఎంతకీ రావేం అని విసుక్కుంది నరసు.

"వాడు ఈపూటకి రాడు...నీతో చెప్పలేదా నరసూ?..." అన్నాడు. ఆ ఆసామి వెకిలిగా ఇకిలించి నరసుభుజం మీద తేలిగ్గా వేళ్ళువేస్తూ. ఇదివరకైతే ఊరుకునేదే గాని, ఇప్పుడు ఆకలిబాధ లేదు. ఒక మొగాణ్ణి నమ్ముకుని బాడీచాటునపడుండ దలచుకుంది. అందుకని ఒళ్ళుమండింది. 'నీ జిమ్మడ......యెదవ వచ్చినోడా! ఎన్ని గుండెల్రా నీకు' అంటూ లాగి లెంపకాయ కొట్టింది నరసు.

"నాకేం తెలుసు, ఎవ్వాన్ను అడిగితే, ఇలా ఏర్పాటు చేసుకుందాం...నీ కిష్టమేనా అని చెప్పాడు మీవాడు...నాకు దిక్కు లేకపోలేదు" అన్నాడు అతను లేచి నిలబడి.

ఆ రాత్రి రంగన్న రాలేదు. మర్నాడు కూడా రాలేదు. "మొగ వచ్చినోళ్ళని నమ్ముకుని కొంపకు సొస్తారు" అంది నరసుతల్లి ఆ మర్నాడు.

వారం తిరిగినా రంగన్న జాడ తెలియ రాలేదు. నరసుకి దిగులు పట్టుకుంది. తరవాత చిరాకు కలిగింది.

"యెదవ నాయాల" అనుకుంది.

మర్నాడు డబ్బుకి ఇరకాటం అయింది. ఎక్స్ట్రా సప్లయర్ దగ్గరకెళ్ళి తనకు రావలసిన దాంట్లో కొంతేనా సర్దమంది.

"మీవాడు పట్టిగెళ్ళాడుగదా ... నీకు చెప్పలేదా...చేసిందా కథ?" అన్నాడు అతను ఓరకంట చూసి నవ్వుతూ.

నరసు గుండె గతుక్కుమంది. గిరుక్కున తిరిగి ఇతరుల కొచ్చేసింది. తనకు డబ్బు రావలసున్న నాలుగైదు కంపెనీలకెళ్ళి కనుక్కునేసరికి, రంగన్న అన్నిచోట్లా ఇలాగే చేశాడని తేలింది.

"నువ్వే ఇమ్మంటివిగా అతగాడికి? ఊదరగొడితే ఇచ్చేశాం ... నీకు చెప్పలేదేం?... చేసిందా కథ?" అన్నారు వాళ్ళు జాలి పడుతూ.

"కొంప ముంచేశాడు యెదవనాయాల" అనుకుంది నరసు.

దారిలో సుబ్బులు ఎదురైంది.

"రంగన్న సొంత కంపెనీ ఎడుతున్నాడంటగా?... ఏంగిరాకీ ... పిట్టనిగిరా పట్టాలేం?" అంది ఒకరకంగా.

"నాబొంద ... అడు నాకొంప ముంచి పొయ్యాడు ... సినిమా తీత్తాడంట సినిమా. ఈడిబతుక్కిదొకటే తక్కువ... యెదవాని యెదవ" అని తిట్టుకుంది నరుసు.

"బాగ్నే ఫీడా విరగడైంది. మనమూ నాన మనం బతుకుదారి..." అందివాళ్ళమ్మ ఆరాత్రి పన్నెండింటికి వండి, తిండి పెడుతూ.

పదిరోజుల తరవాత ఇప్పుడు నరసు కంట పడ్డాడు రంగన్న. స్టుడియో వానులోంచి చూస్తూనే ఆపించి కిందకి దూకింది నరసు.

రంగన్న అడుగు చురుగ్గా వెయ్యబోయాడు. నరసుకూడా పరుగెత్తిబోయి, ఎదట రాజుని చూసి "అన్నా! ఆ యెదవ నాయాల్ని ఆపు..." అని ఒక్క కేక వేసింది.

రాజు చేతుల్తో ఆలోచించి, రంగన్నను అటకాయించాడు.

"ఎరా...ఏటికి డబ్బేదీ?...సిగ్గు లేదూ?" అంటూ దమాయించింది నరసు.

రంగన్న కోపంఅంతా అప్పుడెగిలిన రాజు మీదికి తిరిగింది ... ఎందుకు ఆపావంటూ తన్నబోయాడు.

"నా డబ్బు కక్కు..." అంది నరసు ఏడుపూ కోపం దిగమింగుతూ.

"ప్రొడక్సను తీశాక ఇత్తాలే...ఇప్పుడు కానీ లేదు." అన్నాడు రంగన్న.

అతను తొడుక్కున్న గ్లాస్కో చొక్కా జేబులో ఐదు రూపాయల నోట్లదొంతర కనబడుతూనే ఉంది.

"అదేం? అదికాదు డబ్బు?" అన్నాడు రాజు.

"చక్ నోర్ముయ్."

"చూస్తావా చూసిచూపిస్తానా? అన్నా నువ్వు ముంగలా డబ్బు తీసుకో చెప్తా..." అంటూ నరసు గబుక్కున రంగన్న రెక్కలు వెనక్కి విరిచి పట్టుకుంది. రాజు మళ్ళీ చేతుల్తోనే ఆలోచించాడు. తక్షణం ఆ డబ్బు లాక్కున్నాడు.

"పట్టపగలు ఇట్లా దోచుకు బతుకుదామనే?"

అంటూ రంకెవేసి, నరసు పట్టువిడిపించుకుని రాజుమీదకి విరుచుకుపడ్డాడు లావుపాటి రంగన్న.

రాజు ఈసారికూడా చేతుల్తోనే ఆలోచించాడు.

రిపబ్లిక్ స్టంటు సినిమాలు చూస్తున్నప్పట్నుంచి, వాటిలో ముష్టిప్రయోగాలు చేసి చూడాలని అతను ఎంతో ముచ్చటపడుతున్నాడు. ఇవాళ అనుకోకుండా ఛాన్సు వచ్చింది.

లావుపాటిరంగన్న డొక్కలో ఒక్క పోటు పొడిచాడు. ఎముకదెబ్బేమో అది బాగానే ఆనింది. 'అమ్మో' అన్నాడు రంగన్న. ఉత్సాహంతో, పిడిపిడికిటితో రంగన్న ఎడమదవడకింద పొడిచినట్టు కొట్టాడు రాజు. ఆ దెబ్బకి పెదిమ కరచుకున్నాడు రంగన్న. రాజు హుషారుకొద్దీ అలవాటులేని వాటంలో ఎడమచేతి దెబ్బ కొట్టబోయి గురితప్పి తూలాడు. రక్తం కళ్ళ చూసిన రంగన్న రెచ్చిపోయి, రాజు మళ్లీ కోలుకోకుండా అదేపనిగా బాదేశాడు.

నరసు కేకలు మొదలెట్టింది. జనం పోగవుతున్నారు.

'నూడాసి వేరుకడలె' అని పాడుతూ వేరుశెనక్కాయలబండివాడు ఉత్సాహంగా వచ్చి ఆగాడు. వాణ్ణి చూసి డబ్బాలాటరీవాడొకడు దుకాణం పెడదామని సరదా పడ్డాడు. పెడితే, వ్యాపారం బాగానే జరిగేదికాని, జనాన్ని చూసి, రంగన్న బెదిరి, గబగబా పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

దెబ్బలకి స్పృహతప్పి పడిపోయినరాజుని చూస్తే నరసుకి ఏడుపు పెల్లుబికివచ్చేసింది.

"ముక్కు మొగంకూడా తెల్దు...నామూలాన ఇంత దెబ్బతిన్నాడు" అని నొచ్చుకుంటూ, గబుక్కున కూలబడి, రాజు తలను ఒళ్లోపెట్టుకుని చెంగుతో విసురుతూ "ఒరు సోడాకొండా అన్నా" అంది చుట్టూఉన్న ప్రేక్షకులనుచూసి.

* * *

నీవేనేను!

"నేనెక్కడున్నాను?" అన్నాడు రాజు ఓ గంట పోయాక, నరసు ఇంట్లో కళ్లుతెరచి.

అరగంట క్రితమే అతనికి తెలివి వచ్చింది కాని అప్పుడు టాక్సీలో నరసు భుజాని కానుకొని కూర్చున్నాడు. టాక్సీ వేగంగా పోతోంది. అలాంటపుడు 'ఎక్కడున్నాను' డైలాగు అనటం బాగుండదు. ఇంతవరకు సినిమాల చరిత్రలో ఎవరు అలా అనలేదు. జవాబు మాత్రం ఎలా చెబుతారు గనక. అందుకని మళ్ళీ కళ్ళు మూసుకుని ఊరుకున్నాడు.

కారుదిగి, చాపమీద ఏదో ఒక చూరు కింద పడుకున్నాననుకున్నాక ఆ ప్రశ్న వేశాడు.

"యింటో...మా యింటోనండి......" అంది నరసు మెల్లిగా.

ఇల్లు అనగానేమి? అన్నట్టు చుట్టూ పరడాయించి చూశాడు రాజు తల కదపకుండానే. తల అసలు కదలేలా లేదు. దిమ్మెక్కి పోయి, అసలు లేనట్టు ఉంది.

నరసు, అతనివేపు దీనంగా చూస్తోంది. వారేపోయే ఈకుర్రాడు తన మూలానే ఇన్ని దెబ్బలు తిన్నాడు గదా అని బాధపట్టుకుంది ఆమెకు. క్షమించమన్నట్టు చూసింది. ఒక్క క్షణం ఆగి, 'నా పేరు లక్ష్మీనరసు అంది' అనే క్షమాపణ అనిపించేలా, రాజుకి ఆ రెండు మాటలలోనే, 'నన్ను క్షమించండి రాజా' అన్న భావం కనబడి పోయింది.

"ఫరవాలేదు..."అన్నాడు.

అతనికి పేరు నచ్చింది కామోసు అనుకుంది నరసు. ఆమె చెంపలలో కెంపులువెలిగి తళుక్కుమని జారిపోయాయి సిగ్గుపడి. చెంపకి చారెడున్న ఆమె నల్లటి కళ్ళు వాలిపోయి వాటిని వెతకబోయాయి. జారి, పారిపోయిన ఆ కెంపులు తమచాయనే ఉన్న పెదిమెల చాయలకువెళ్ళి కొనలలో నించి తొంగి చూడబోయాయి.

'తప్పు' అంది సూటిగా ఉన్న ముక్కు. తెల్లటి మునిపంట ఆమె ఆ పెదిమనదిమి పట్టి, పెంకె కెంపుల జతను అదులో పెట్టింది. రాజు సదరుకార్యక్రమాన్ని కలర్ బై టెక్నికలర్ లో చూసి ముగ్ధుడైపోయాడు.

అమ్మాయిల చిరునవ్వులకు అర్థాలుతీసుకు సంతోషించడం అతనికి బాగా అలవాటు లేదు. చేతకాదు.

కాని, 'బాగుంది' అనుకున్నాడు టూకీగా.

'నాపేరు రాజు' అన్నాడు ముక్తసరిగా.

'నాపేరు నరసు. మీదేవూరు?' అంది నరసు సిగ్గుపడుతూ. రాజు చెప్పాడు.

"ఇక్కడే ఉంటున్నారా?"

'మరే'

'ఏంచేస్తున్నారు?'

'హీరో'

'హీరో?'

'మరే. హీరోరోలు'

'ఎందులో?'

రాజు తికమకపడ్డాడు. ఎందులో అంటే ఎవరుమటుకు చెప్పగలరు? తనువచ్చి ఇరవై నాలుగ్గంటలన్నా కాందే.

'ఇంకా తెలీదు. ఇవాళే వచ్చాను' అన్నాడు.

నరసుకి తెలిసిపోయింది. నవ్వింది. 'చిట్టి తండ్రీ అదా కథా?' అనుకుని.

శుభమాఅని ఊళ్ళోదిగిన రోజునే తన మూలాన తన్నులుతిన్న ఈకుర్రాడినిచూస్తే నరసుకి ఎక్కడలేని అభిమానం పుట్టుకొచ్చింది.

'ఎక్కడబస?...డబ్బు తెచ్చుకున్నారా?...' అంది.

'ఝ్యేంటి' అన్నాడు రాజు గంభీరంగా కిటికటాలలోంచి చూస్తూ.

'అయ్యబాబోయ్! ఇరవై వేలే!! జాగ్రత్త బాబా' అంది నరసు ఎగిరిగంతేసి.

'నో...నో...నో' అన్నాడు రాజు కొంచెం తీవిగానే.

"ఓ...వందలా?" అంది నరసు కొంత స్తిమితపడి. "అయినా జాగ్రత్తగా ఉండాలి. రెండు వేలన్నమాట"

రాజుకి కోపం వచ్చింది. 'కొంచెం కూడా గంభీరంగా ఉండలేదిపిల్ల. అన్నీ తెలుగులో చెప్పెయ్యాలంటుందేలా' అనుకున్నాడు. అబద్ధం చెప్పడం ఇష్టంలేదు.

'వందలుకాదు...పదులుకూడా కాదు... ఒకట్లు. అంతే' అన్నాడు కొంచెం చిరాగ్గా.

'ఓ...' అంది నరసు నవ్వాపుకుంటూ.

'అవిలేవు, ఫీజు కట్టేశాను' అన్నాడు రాజు ఇంకా కోపం తెచ్చుకుని.

'ఫే...జు!...ఏం ఫీజు?...ఎవరికట్టేశావ్...' అంది త్రుళ్ళిపడి.

'ఉందిలే...హీరో ఛాన్సుకి...ఆయన రమ్మన్నాడు...నేను వెళ్లాలి' అన్నాడు రాజు.

'ఎక్కడికెళ్లేది... కాసేపు నిదరోయి.... ఇంత తినెళ్లచ్చు. కలుతిరిగి పడితే ఏటి దిక్కు?...' అంది కాస్త భయపెడుతూ; అతను వెళ్తాడని భయపడుతూ.

"మరి వెళ్లిపోతే ఎలా...హీరోరోలు ఊరికినే వస్తుందా?" అన్నాడు రాజు.

'నీ కట్టా వస్తదయ్యా...ఎవడిస్తాడంట. నీ కెవరు తెల్సు?'

'ఇంకా ఎవరూ తెలీదనుకో...ఎంత సేపేం తెలీడం. నే నందరికీ ఉత్తరాలు రాశానుగా వస్తున్నానని?" అన్నాడు రాజు ధీమాగా.

'ఏ బొందలే...' అని నాలిక్కరచుకుంది నరసు. జాలేసింది. తొలిరోజుల్లో తను అనుకున్నట్టే ఆశపడ్డట్టే, ఉంది కథ. తనతో తీసికెళ్ళి వేషం లిప్పిస్తే మంచి

(55-వ పేజీ చూడండి)

బడ్జెట్ ప్రసంగం

వర్తమాన మాసానికి మనసంసారపు బడ్జెటు నీకు సమర్పిస్తున్నాను. దీన్ని నువ్వు సాంగోపాంగంగా చర్చించుకుని నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే మన స్థితిగతులను చక్కబరుచుకోవడానికి శాయశక్తులా కృషిచేస్తాను, మార్గాలు అన్వేషిస్తాను.


లోటు బడ్జెటు సమర్పిస్తున్నందుకు నన్ను మెచ్చుకోలేవని నాకు తెలుసు. నువ్వే కాదు. దూరంగా స్వగ్రామంలోవున్న మా నాన్న కూడా మెచ్చుకోలేడు. అంతేకాదు. ఇది విని నన్ను మందలించడం కూడా తథ్యం. లోటు బడ్జెటు తయారుచేయడం నాకు పరిపాటే అని నువ్వు అనవచ్చు. పైగా నలుగురు సహోద్యోగులతోపాటే నేనూ లోటు చూపించానని అనవచ్చు. కానిమార్గాంతరం లేక ఇలా చేయవలసివచ్చింది. మన సంసారం ఇంకా

జి. రామకృష్ణ

రాటుతేలలేదు. ఖర్చులు నానాటికి శిఖరారోహణం చేస్తున్నాయి. అవి ధరలను పెంబడిస్తున్నాయి. అది సహజమే.

ఈ సందర్భంలో ఒక విషయం ప్రస్తావించడం అవసరం. క్రిందటి మాసంలో నాన్న దగ్గరనుంచి మామూలుగావచ్చే డబ్బు నాకు ముట్టలేదు. నన్ను స్వగ్రామంవచ్చి ఒకమాటు వాళ్లనుచూసి డబ్బు పట్టుకు వెళ్లమని వ్రాశాడు నాన్న. నే వెళ్లాలంటే కొంత మదుపు కావలసివుంది. అది సాధ్యపడలేదు. ఎం. ఓ. ద్వారా పంపమనడం అపరిస్థితులలో భావ్యం అని నాకు అనిపించలేదు. ఈ సంగతి నీకు తెలిసిందే. అదృష్టవశాత్తు ఈ మాసం నాన్నే పంపాడు ఎం. ఓ. ద్వారా.

గతించిన మాసాలలో మన ఆర్థికస్థితిని ఒకసారి సింహావలోకనం చేసుకుంటే ఈ మాసం మనకెంతో ఆశాజనకంగా గోచరించక మానదు. క్రిందటి రెండుమాసాల్లోను ఖర్చులు విపరీతంగా వుండటంవల్ల మన ఆర్థికస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. క్రిందటి మాసంలో లోటు 80 రూపాయలు, ఆ క్రిందటి మాసంలో 51 రూపాయలు. నిన్ను మీ పుట్టింటి దగ్గరనుంచి తీసుకురావడానికి రానూ పోనూ ఛార్జీల క్రింద ఎక్కువ డబ్బు ఖర్చవడంవల్ల లోటు 51 రూపాయలయింది. క్రిందటినెల తొట్టివుయ్యాలకొన్న సంగతి నీకు తెలిసిందే. ఉయ్యాల కొనకపోతే చీనిగాడికి ఇబ్బంది అవుతుంది. అంతేకే ప్రతి విషయంలోను పొదుపుచూపడానికి ప్రయత్నిస్తూనే వున్నాను. కాని లోటు అనివార్యం అవుతూవస్తోంది.



వెలుగుల జడి
—ఫోటో: వి. కేశవశర్మ]



బడ్జెట్ ప్రసంగం

ఆదాయంలో కొంత పెరుగుదల కనిపించడంవల్ల ఆశారేఖలు గోచరిస్తున్నాయి. రెండుమాసాలక్రిందట మన ఆదాయం 115 రూపాయలు. క్రిందటిమాసం 105 రూపాయలు.

ఇక వర్తమానమాసం తాలూకు ఆదాయ వ్యయాలను గురించి వివరిస్తాను. ఈ మాసం మన ఆదాయం—

జీతం	రు 103
నాన్న పంపింది	రు 15
పాతపత్రికలు, సీసాలు అమ్మగా వచ్చింది.	రు 2
మొత్తం	రు 120

క్రితం మాసంకంటె యీ ఆదాయం 14 3% ఎక్కువ, ఆ క్రిందటి మాసంకంటె 4.3% ఎక్కువ.

మన ఆదాయాన్ని క్రమంగా వృద్ధిపరచాలని నేను శక్తివంచనలేకుండా ప్రయత్నం చేస్తున్నాను. మనకు అందుబాటుగావున్న ఆర్థికవనరులలో సద్యః ఫలితం యిచ్చేది నాన్నదగ్గరనుంచి వచ్చే ఎం. ఓ. లు. ఇతరమార్గాలు అన్వేషించడానికి తీవ్రకృషి సాగిస్తున్నాను. మనిద్దరం రాట్నం వడకటం వుపక్రమిస్తే కొంతరాబడి వుంటుంది. నెల తిరిగేటప్పటికి ఏడెనిమిది రూపాయలకు చచ్చులేకుండా చేతులోపడతాయి. కేవలం యీ ప్రతిపాదన ఛాయామాత్రంగా సూచిస్తున్నాను. ఈ పథకంగురించి మరో సమయంలో కూలంకషంగా చర్చించుకోవచ్చును. నాకు మరోచక్కటి ఆలోచన తట్టింది. నేను బియ్యే ప్యాసయ్యాను కాబట్టి స్కూల్సుఫైనలులోపు కుర్రాళ్ళకు ప్రయివేటు చెప్పగలననే ధైర్యం వుంది. దీన్నిగురించి కూడా దరిమిలా చర్చించుకుందాం. ఒకరిద్దరికి చెప్పినా పదిహేనో ఇరవయ్యో అందుతాయి. రేడియో కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యత్నాలు సాగిస్తున్నాను. ఆడిషను జయప్రదంగా జరిగితే నాకు అడపాతడపా అవకాశాలు రాక మానవు. అదికూడా ఆర్థికంగా లాభకారి. తడవకు పదిహేను రూపాయలు లభిస్తాయి. గొంతెమ్మకోర్కెలు అనకపోతే మరో మార్గంకూడా తట్టింది. పాత్రికేయుని లక్షణాలు నాలో అంతో యింతో వున్నట్టు నా విశ్వాసం. కథలో, వ్యాసాలో వ్రాస్తే తృణమో పణమో ప్రతిఫలరూపంలో పత్రికాధిపతులు ముట్టచెపుతారు. ఆమార్గంకూడా ప్రయత్నిస్తాను. ఇవన్నీ అనుకూలిస్తే భగవదనుగ్రహంవల్ల మనరాబడి బాగా పెరగవచ్చును.

మన వ్యయంగురించి తెలుసుకున్నప్పుడు

ఆదాయానికి విషాదచ్ఛాయలు పొడచూప డం తప్పదు. మనవ్యయం—

ఆహారం :	రూపాయలలో :
బియ్యం	
పప్పులు	
పచారీ సామాను	58
కాఫీసామాగ్రి	
పాలూ, పెరుగూ	
గృహవసతి కూరలు	
ఇంటి అద్దె	
విద్యుద్దీపాలు	28
మంచినీళ్ళ కుళాయి	
ఆరోగ్యం :	
డాక్టరు ఫీజు	
మందుఖర్చులు	9
ఫినాయిలు వగైరా	
విద్య :	
కుర్రాళ్ల స్కూలుజీతం	
పుస్తకాల ఖర్చు	14
పత్రికలు	
వినోదం :	
సినిమా	4
టవును చూడటం వగైరా	
శిశుపోషణ :	
చంటివాడి హార్లిక్సు,	7
గ్లూకోజ్, ఆముదం వగైరా	
అప్పులు :	
మిత్రులదగ్గర చేబదుళ్లు	0
నౌకర్లు :	
పనిమనిషి	
పాకీది	4
వీధికాపలా ఘూర్ఖా	
జేబుఖర్చు :	
సిగరెట్లు	8
కాఫీహోటలు ఖర్చు వగైరా	
చిల్లరమల్లర ఖర్చులు :	
తలనూనె,టాయిలెట్లు,చాకలీ	14
మంగలీఖర్చులు, పుల్లలూ,	
బొగ్గులూ, పిడకలు వగైరా	
ఆకస్మిక ఖర్చులు	10
మొత్తం	159

దీన్నిబట్టి చూస్తే వర్తమాన మాసానికి మనకు 39 రూపాయల లోటు ఏర్పడ్డట్టు తెలుస్తుంది. ఈ లోటును నేను ఏ ఏ మార్గాలద్వారా భర్తీ చేయదలచిందీ యీసందర్భంలో వివరించడం సముచితం. క్రిందటి వుత్తరంలోనే నాన్నకు పరోక్షంగా తెలియపరచాను మన ఆర్థికస్థితి. అందువల్ల యీ మాసానికి మరో 15 రూపాయలు పంపమని గట్టిగా కోరదలచాను. తప్పక ఆడబ్బు త్వరలో వస్తుంది. తర్వాత నువ్వు నీసొంత డబ్బుగా బ్యాంకులో వేసుకున్న 40 రూపాయలలో నుంచి 15 రూపాయలు విత్‌డ్రా చేస్తే బాగుంటుంది. ఆడబ్బు మీనాన్న నీకు యిచ్చిన మాట వాస్తవమే. నువ్వు చీరో నగో కొనుక్కోవటం సబబే. కాని మన యిబ్బందుల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవడం న్యాయం. మిగిలిన 9 రూపాయలు స్నేహితులవద్ద చేబదులు రూపేణా సేకరిస్తాను. ఈవిధంగా మన బడ్జెటు లోటు పూడ్చడానికి వుద్దేశిస్తున్నాను.

నావుపన్యాసాన్ని ముగించే ముందు ఒక సంగతి చెప్పడం అవసరమని భావిస్తున్నాను ఈ వ్యయాలలో తగ్గింపు చేయడానికి వీలు కాదా అని నువ్వు అనవచ్చు. నేను ప్రారంభంలోనే చెప్పినట్టు ప్రతి విషయంలోనూ వ్యయకర్తనం దృష్టిలోవుంచుకునే సంసారం నడుపుకొస్తున్నాను. మన ఖర్చు పద్దులన్నీ అత్యంత శ్రద్ధతో తయారుచేశాను కనీస అవసరాలే లెక్కలోకి తీసుకుని అంచనా వేశాను. దీనికి అనుకూలంగా నువ్వు ఈమాసం గడిపితే అదే చాలా గొప్ప. ఈ పద్దులకు మించి ఖర్చు అయితే మనం చాలా యిబ్బంది పడవలసివుంటుంది.

ఇంతకు మించి నేను చెప్పవలసిన విషయాలు ప్రస్తుతానికి ఏమీ కన్పించడంలేదు. నాప్రసంగాన్ని ఓర్పుతో శ్రద్ధగా ఆలకించినందుకు నిన్ను అభినందిస్తున్నాను.

ఆయవ్యయాలను ఆమోదించగలవని ఆశిస్తూ ఇంతటితో ముగిస్తున్నాను. ★

★ ప్రేమ భాష ★

శ్రవణార్థినిగా వచ్చిన ఒక అందమైన అమ్మాయి మా ఫాక్టరీలో పనికి కుదిరింది. ఆ అమ్మాయిని చూసీ చూడగానే టామీ గాఢంగా ప్రేమించాడు. "ఫలానారోజున నీకు తీరుబడిగా ఉంటుందా, నాతో వస్తావా?" అని అడిగాడు. ఆ అమ్మాయికి ఇంగ్లీషు రాకపోవడం వల్ల సమాధానమివ్వలేదు. కాని మూడురోజుల తర్వాత టామీ ఒక చిన్న తమాషా చేశాడు.

ఏవో పత్రికల్లోంచి కత్తిరించిన కొన్ని కాగితం ముక్కలు తీసుకుని ఆమె దగ్గరికి వెళ్ళాడు. గడియారం పెట్టుకున్న చేతిని ఆమె ముందుంచి, 'ఏడుగంటలు'అని తెలిసేట్టుగా సౌంజ్ఞలు చేశాడు. తరవాత ఓ అమ్మాయి, అబ్బాయి రెస్టారాంటులో కూర్చుని విందారగిస్తున్నట్లున్న ఒక బొమ్మని చూపించాడు. తరవాత ఒక సినిమా బొమ్మ చూపించి 'ఎనిమిది గంటలు' అని గడియారంలో ముళ్ళకేసి చూపించాడు. మూడో కాగితాన్ని పైకితీసి చూపిద్దామా వద్దా అని కాసేపు సందేహించి, దాన్ని తిరిగి జేబులో దాచేసి, 'పదకొండు గంటలు' అని తెలిసేట్లు గడియారంకేసి చూపించి, పక్కమీద పడుకుని నిద్రపోతున్న ఓ అమ్మాయి బొమ్మ చూపించాడు. 'ఏమంటావ్?' అన్నట్లు ఆమెకేసి పరిశీలనగా చూశాడు. ఆమె గంభీరంగా మొహం పెట్టి, అతని జేబులో బహు చనువుగా చెయ్యిపెట్టి, ఇందాక చూపకుండా దాచేసిన కాగితం ముక్క పైకి తీసింది. అందులో అమ్మాయీ, అబ్బాయీ కావలించుకుంటున్న బొమ్మ ఉంది. అంత గంభీరంగా ఉన్న అమ్మదూ ఫకాలుమని పగలబడి నవ్వేసింది. టామీ చేతిలో చెయ్యివేసి 'రైటో' అన్నట్టు తలెగరేసింది.

—ఆర్. బి. ఫాస్టర్.

ఆచారం అంటే అందరికీ యిష్టమే. కాని ఆచారం అనే పేరుతో అనాచారాన్ని కొనితెచ్చుకునే వారిని చూస్తేనే చాలా బాధగా వుంటుంది. కొందరు ఆచారం అనే బురఖా తగిలించుకుని వెనకాల అనాచారపు భాగవతం ఆడేవారూ వున్నారు. మరి కొందరు కేవలం పేరూ ప్రతిష్ఠల కోసం ఏమైనా సరే అని కఠినంగా మొండికి పడి ఆచారం కోసం పస్తులుండి ఒళ్లు పాడు చేసుకునే వారూ వున్నారు. మంచి నీళ్ళ బావిదగ్గర చేరే ఆడంగు లంతా ఆచారాన్ని గురించిన చర్చ లేందే నీళ్ళ బిందె బుజాని కెత్తరు గదా! అందులో ముఖ్యంగా బీదోళ్లు. ఒక నడివయసావిడ మరొక వయసు మళ్లినావిడ చెప్పుకోవడం "అక్కా వాకిట్లో వూరగాయజాడీ వేపు చీపురుపుల్ల తగిలినా చీకాకేస్తుంది. వెంటనే ఆ జాడీ తీసి దిబ్బలో పారేయాల్సిందే! మా అత్తగారి ఆచారం నీకు తెలియంది కాదుగా. నేను కాస్త తాకేసుకున్నా ఆవిడగారు మండి పడతారు అక్కా!....."

"ఆ పడతారన్నా పడతారు. మా కున్న నియోగుల యింట్లో యిచ్చేప్పుడు ఆచారం ఏమైందో—నీకేం నీ క్షేమంలాంటి కుటుంబంలో మంచి వచ్చావు. మా అత్త చెందమ్మకంటే మీ వాళ్లే ఎక్కువ ఆచారవంతులని మా అక్క అంటూ వుంటుంది......"

"అయ్యో! ఆ మాట నేనని బ్రతగ్గలనా అక్కా! నోరు మూసుకుని పడుండాల్సిందే మా అత్తగారు తన కూతురు ఆచారాన్ని గురించి మాట్లాడుతూ వుంటే..."

"హోయబ్బ! ఎవరికి తెలియదు కూతురు ఆచారం! కిరస్తానీ వాళ్లలాంటి ఆడబిడ్డలు రెండు జడలు, కాళ్లకు చెప్పులు వేసుకుని వంటింట్లోకొచ్చి వడ్డించు అంటే పక్కన నేనలే వడ్డిస్తుందట. అలాటి ఆచారం మరి నీకూ నాకూ ఎల్లాగ వస్తుందిలే—అయినా మీరు మీరూ అత్తలూ కోడళ్ళు. మధ్య మాకెందుకు లేయాగొడవలు. నేవెళ్లొస్తామ్మా—" అని నెమ్మదిగా ఎక్కడి వాళ్ళు అక్కడ జారుకుంటారు......

అసలు ఆచారాన్నిగురించి ఎక్కువగా మాట్లాడేవాళ్ళు ఆడవాళ్లు, అందులోనూ వయసు మళ్లిన వాళ్ళు ఎక్కువగా యీవిషయాలే మాట్లాడుతుంటారు. ఆచారాన్ని గురించి మాట్లాడే దానికంటే మరొకర్ని అనాచారులని ఆడిపోసుకోడంలో తృప్తి చెందుతుంటారు చాలా మంది ఆడవాళ్ళు. అలాటి వారి మధ్య ఖర్మంజాలక పడుచు సుమంగళీలు వుండటం తటస్థిస్తే యిబ్బందిలో పడతారు. పెద్దవాళ్ళ మాటలకు అవును అనాల్సిందే, యిష్టం లేకపోయినా. ఆచారాన్ని గురించిన ముసలివాళ్ళ లెక్చర్లు వినాల్సిందే విధిలేక.



అలాటివని పడుచులు ఎదురైనావుంటే ముసలి గుంపంతా ఆ పడుచు పిల్లల్ని వెంటనే రాల్చి పోస్తారు. మరీ మడిమేళం, నడమంత్రం నీలుగు, గీర్వాణం, ఫ్యాషను—యిత్యాది మిరపసున్నివుండల్లాంటి అతగని మాటల్తో ఆడి పోసుకుంటారు. అర్థయుంతో సైనా ఒక చివ్వు ముసలివాళ్ళ కొప్ప చెపాల్సిందే. నా ఖర్మంజాలక ఒకసారి వయసుమళ్ళిన ముసలి బిడ్డా మహాసభలో ఒంటరిగా చిక్కుకున్నాను. అదీ, ఒక బంధువులయింటి పెళ్ళి భోజనాల సందర్భంలో—లోపలవంటలు అవుతున్నాయి. ప్రత్యేక వంటవాళ్ళంతా మడికట్టి వంటచేస్తున్నారు. ఇల్లంతా సందడిగావుంది. కొత్తకోడళ్ళు అంతా పిల్లల్ని ఒళ్ళో వేసుకుని జోకొడుతూ పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు. కొందరు పెళ్ళి కూతుర్ని, ఆమె వగల్ని విలువకడుతున్నారు. మగవాళ్ళంతా పెళ్ళికొడుకుతోసహా మేడమీద కూర్చొని రేడియో వింటున్నారు—నాకు ఆయిల్లు, మనుషులు కొత్తకావడం వల్ల మా అత్తగార్ని అంటిపెట్టుకుని ఆవిడగారు ఎక్కడకూర్చుంటే అక్కడ కూర్చోవలసి వచ్చింది—ఆవిడగారి పాతస్నేహి



త్తగారూ—ఆచారాలూ—

పి. భానుమతి





తు రాం(డు, తోడి కోడళ్లు, చెల్లెళ్ళు, వెలువిడిచిన మేనమామ మేనత్తల పిల్లలు ఓయబ్బ ఆలిస్టు ఆమె చెప్పాలి. అందరూ ముందు హాల్లో సభ తీర్చారు.

కొందరు వత్తులు చేస్తూ, కొందరు విస్తరాకులు కుడుతూ, మాటల్లోకి దిగారు. నేను ఒంటరిగా చిక్కుకున్నాను వాళ్ళందరిలోనూ. ఓమూలబడిగి కూర్చుని వాళ్ళమాటలన్నీ వింటం మొదలెట్టాను ... అక్కడున్న ముసలి వాళ్ళందరికీ మా అత్తగారు అధ్యక్షురాలు. మాఅత్తగారి కంఠస్వరం తంజావూరు తంబురామందరస్థాయి అనవచ్చు మెల్లగా మాట్లాడితే — కొస్త గట్టిగా మాట్లాడినప్పుడు కలకత్తా మెయిలు యింజనుఅరుపే. ఆమె కంఠం ఎత్తి మాట్లాడుతుంటే కందిరీగలు ఘోషపెడుతున్నట్లుంటుంది. ఆమె చాలా ఆచారంగా వుంటుంటారు—ఆమె తనుచేసినవంట తప్పితే మరెవరు వండినా భోంచేయరు. కన్నకూతురు వంటచేసినా పనికిరాదు ఆమెకు. తనే వండుకోవాలి తనే తినాలి. మిగతాకూడా ఎవరికీ వుంచరు — అలా తను చేసుకోలేనినాడు పస్తు—నాలుగుపండ్లు తిని చెంబుడుపాలు తాగి పడుకుంటారు—కృష్ణాఅంటూ — ఆమెకు అప్పుడప్పుడు ఫిట్సు వస్తూవుంటాయి. తెలివి లేకుండా చాలాసేపు పడిపోతుంటుంది ఆమె—అలాంటి సమయంలో గొంతులో నీళ్ళుపోస్తేగాని తెలివిరాదు మరి—అటువంటి సందర్భంలో తను నీళ్ళు ఎల్లా గొంతులో పోసుకోగలదు?

వంటమనిషి వైష్ణవుడే అయివుండాలి. అతనువచ్చి కొసినినీళ్ళుగొంతులోపోయాలి. ఖర్మంజాలక ఒకరోజు అతడు సినిమా కెళ్లాడు. మా అత్తగారికి ఫిట్ వచ్చి పడిపోయారుట. నేనూ ఇంట్లోలేను ఆ సమయంలో. ఇంట్లోపనిమనిషి, పనికు(రవాడు తప్పితే ఎవరూలేరు. ఎంతసేపటికీ తెలివిరాక గొంతు ఎండిపోయి గుటకలువేస్తుంటే వాళ్లు మరీ ఖంగారుపడిపోయారట. చివరకు ధైర్యం చేసి ఆమె (ప్రాణం నిలపడంకోసం కొసిని నీళ్ళుతెచ్చి కొద్దికొద్దిగా గొంతులో పోసిందిట పనిమనిషి. కళ్లుమూసుకునే ఒక్కొక్క గుక్క నీళ్లు తాగారట నెమ్మదిగా మా అత్తగారు. అప్పటికి కొస్తతెలివివచ్చి కళ్ళుతెరిచి చూస్తే అదృష్టవశాత్తు అప్పుడే సినిమాచూచి తిరిగివచ్చిన ఆ వైష్ణవ వంటాయన ఎదురుగుండా పట్టె నామాలతో మా అత్తగారి కళ్లపడ్డాడు — సాక్షాత్ ఆ వెంకటేశ్వరుడే నామాలతో తనెదట (ప్రత్యక్షమైనట్లు, అతడు తెచ్చిన తీర్థమే తాను సేవించినట్లు మా అత్తగారు తృప్తిపడివుంటారు. (బతుకుజీవుడా అనుకున్నాం. ఆ సంగతి మళ్ళీ ఎవరూ బయట అనకుండా గప్-చిప్‌గా వుండిపోయాం — ఆవిడ ఆనాటి ఆచార(వత భంగాన్ని గుట్టుగానే వుంచాం. ఎక్కడంటే అక్కడ ఫిట్ వచ్చి తెలివి లేకుండా పడిపోయేమనిషి యింత చాదస్తంగా వైష్ణవుడే రావాలి గొంతులో నీళ్లు పోయడానికి అంటే కుదుర్తుందా, లేక వైష్ణవులుండే చోటుచూచి ఆమెకు ఫిట్ వస్తుందా.

ఆనాడు మా అత్తగారు అధ్యక్షత వహించిన మహాసభలో మా అత్తగారి తోడికోడలు ఆరంభించారు (ప్రసారం—"అమ్మణ్ణీ! నీవేమైనా అనుకో, యీ కొలప్పిల్లయినా నీ కోడలేనయం. మన వ్యాపార్ల గోచీపెట్టి చీర కట్టిందిముద్దుగా. దానికున్నపాటి బుద్ధికూడా మన సుబ్బలక్ష్మి త్తికోడలుకు లేదుగదా! అబ్బ!! ఛండాలంగా ఆ చీరకట్టేమిటీ, ఆ నీలుగేమిటి-వంటిల్లు వుంచే తీరేమిటి ఛ ఛ వాంతొస్తుందంటే నమ్మ" వెంటనే మా అత్తగారు "యిదుగో కనకం-ఆ అనాచారమ్మనిషి పేరు నా దగ్గిర ఎత్తకు. మనమూ మైలపడతాం వూరుకో" అన్నారు. ఇంతలో యింకొకామె, "అయినా కక్కి తెలీకడుగుతా గానీ అసలు నీకంటే ఆచారవంతురాలా



"ఓ మూల ఒదిగికూర్చుని వాళ్ళమాట లన్నీ వింటం మొదలెట్టాను..."

★ అత్తగారూ-ఆచారాలూ- ★

అంట చెల్లమ్మ-అయ్యో, అయ్యో, ఏం ఎగిరి పడుతుంది, ఏం ఎగిరి పడుతుంది? ఆవిడచేసే హంగామా చూస్తే, ఒంటికి కారం రాచినట్లుంటుంది. హెవరికి తెలియదూంట? ఆవిడ ఆచారం"

"ఇదుగో అమృతం, దానిమాట నా దగ్గర తేవాక. దాని సంగతి నాకు తెలుసు. దాని మొగుడు రాయలసీమలో వుద్యోగం వెలగబెట్టి నప్పుడంతా తురకపిల్ల పాయ్యివెలిగిస్తే వంట చేసుకు తినే దా పినుగు-దానికాచారం ఏమిటే? నిక్షేపంలాంటి అత్తగార్ని అడువులు పట్టించింది. దాని అబ్బగాడికి గతిలేక దానివెనక ఆడపిల్లలందర్నీ అయినకాడికి ఆరువేల నియోగులకిచ్చాడు. ఇంకా ఆచారం ఎక్కడా నా తలకాయ ఆచారం?" అని మా అత్తగారి దీర్ఘం విని "అయ్యో అమ్మణ్నీ అంతటితో ఆగావేం. దాని తమ్ముడు మళయాళిందాన్ని పెళ్లిచేసుకుని చెప్పకుండా పాలఘాటు వెళ్లిన సంగతి నీకూ తెలుసుగా?

"హా తెలియకేం?, తెలుసు. అంతే కాదు యీ నాడు ఆ మళయాళి స్త్రీనుగ చేత వంటచేయించి భోంచేస్తూందట నీవు చెప్పిన ఆచారవంతురాలు."

"ఆ! నిజంగా-అయ్యో ఖర్మమా? అంత నీచానికి పాల్పడిందా ఆ మనిషి. అన్నట్లు కక్క నీకు మేనత్త ఆడబిడ్డో ఏదో అవుతుందిగదూ." వెంటనే మా అత్తగారిముఖం నల్లబడిపోయింది. -"ఆ-నాకేంగాదు. దాని అబ్బగాడు ఏనాడు పోయాడో ఆ నాడే వాళ్లకీ మాకూ తెగతెంపు లయిపోయాయి. ఆపీనుక్కూ నాకూ ఏ బాంధవ్యంలేదు—" అని ఖచ్చితంగా తేల్చేశారు మా అత్తగారు—ఎవరైనా ఒకరు ఆచారవంతులంటే మరొకరు ఒప్పుకు నేట్లు లేరా సభలో. గంగాభాగీరథీసమానురాండ్రంతా-ఒకావిడవూరికే అంతసేపూ కూర్చొని వున్నట్లుండి ఏదో తనూ ఒక "న్యూస్" అందించాలనే వుత్సాహంతో "అయ్యో నా తెలివిమండా యిందాకట్నుంచీ ఆలోచించుతున్నా ఎక్కడా? ఎవరింటిపెళ్లిలోనా? అని. మన కృష్ణుడి పెళ్లికి రుక్మిణమ్మత్త వాళ్లింట్లో ఏం జరిగిందో తెలుసా? అని ఆవిడ అందరి ముఖాలూ చూచింది. ఎవరికైనా తెలిస్తే తన గొప్పతనం కాస్త తగ్గిపోతుందనే భయంతో! అదృష్టవశాత్తూ ఎవరికీ ఆవిడ చెప్పబోయేది ఏమిటో తెలీక గుడ్లప్పచెప్పి ప్రశ్నార్థకంగా ఆవిణ్ణి చూచారు. వెంటనే ఆవిడ "ఇంకా నయం తెలీకపోవడమేమిటీ! ఊరంతా అట్టుడికిపోనేనూ ఆ రోజు జరిగిన గొడవకి! రుక్మిణమ్మ వాళ్ళ యింటి పెళ్ళి అంటే యీ గొడవ అందరికీ ఈ నాటికీ తెలుసే! ఏం చెప్పేది? ఆ రోజు మా తలలు వంగిపోయాయి. ఎందుకొచ్చామా యీ పెండ్లికి అని అదోలా అయిపోయింది. మా అమ్మ నాన్నావాళ్ళు అసలే ఆచారవంతులు. వాళ్లు పచ్చి గంగ ముట్టలేదా యింట్లో— నాకూ ఆచారం ఎక్కువాయె ..." ఇంతలోకే మా అత్తగారు మధ్యలో 'కట్' చేశారు. ఆమె "ఇదిగో పేరిందేవీ—ఆ చెప్పేదేదో త్వరగా చెప్పు కానీ, నీ ఆచారం నీ వాళ్ళ ఆచారాన్ని గురించి వూరికే వాక్కు. ఇంకానే బతికే వున్నాను."

అని ఒక చురుకు వేసే సరికి అక్కడ వున్న మిగతా వాళ్ళందరూ పేరిందేవమ్మకు కోపం వస్తుందేమో అని భయపడ్డారు కాని మాఅత్తగారు అధ్యక్షురాలు కావడంవల్ల పేరిందేవమ్మ మా అత్తగారి యీసడింపు గమనించకుండానే ముందుకుపోయింది. "ఆ—యింతకీ నే చెప్పొచ్చిందేమిటంటే ఆనాటి పెండ్లి సమయానికి వైష్ణవ వంటవాళ్ళు దొరక్క ఎవర్నో తీసుకొచ్చి వాళ్ళ ముఖాన నామాలు పెట్టి నాటకం ఆడారట! రుక్మిణమ్మ వాళ్ళు——తర్వాత బయట పడ్డదా సంగతి. ఒక్కసారి పెళ్ళియిల్లు అంతా గుప్పుమన్నదనుకోండి. ఆనాటినుండీ యీనాటివరకు ఆ గడప తొక్కి పచ్చి మంచి నీళ్ళు ముడితే మీ రు ఏ ఒట్టు పెడితే ఆ ఒట్టు—"

"అదేమిటి పిన్నీ! రుక్మిణమ్మ నీ పెత్తల్లి కొడలేగా పరాయిదా ఏమన్నానా? అట్టా

యింటిగుట్టు బయటేస్తారా ఎక్కడన్నా? ఎంతయినా నీ వాళ్ళన్న తర్వాత నీవు అంత కఠినంగా మాట్లాడ కూడదు, ఏమైనా సొంత మనుషుల్ని కొస్త."

"ఆ నాకేం సొంతమే — ఏనాడు నా కొడుక్కు దాని కూతుర్ని యివ్వలేదో ఆనాడే తెగ తెంపులు అయిపోయింది. ఆ అనాచారప్పీనుక్కు నా కొడుకు నచ్చలేదట.—హో యబ్బ, తన కూతురు కిరస్తానీ కళ్ళకు నా కొడుకు బ్రహ్మ తేజస్సు తీసిపోయిందట——

"ఎంతయినా నీ కొడుక్కంటే ఆ పిల్లే ఎక్కువ చదివిందిగా—అంది" ఒకావిడ. "ఆ చదివింది కిరస్తానీ చదువు — దాని చదువూ నా బతుకూ ఒకటే. నిక్షేపంలాగా నాకొడుకు లోయర్ గ్రేడు ప్యాసయి స్కూలు మాష్టరీ చేస్తూంటే ఏం తక్కువొచ్చిందంట? నా కొడుకు ఆచారవంతుడు. ఆ అనాచారప్పీనుక్కు నచ్చడు మరి—"అని మెటికలు విరిచింది. "అయినా కక్కా నీ కోపం రాకుండా వుంటే అడుగుతాను చదువెక్కువా ఆచారం ఎక్కువా."

"చదువుకూ ఆచారానికీ ఏం సంబంధం వుంది నీ కొడుకు మరీ బోళ్ళగొచ్చి, పిలక, బహుసనాతన మ్మనిషిలాగా వుంటాడాయ..."

ఆ మాటకు అవతలావిడికి కడుపు మండిపోయింది-"అవునే నాకొడుకు సనాతనుడే. వాడేకాదు, వాడబ్బ సనాతనుడు, వాళ్ళ తాత సనాతనుడు, వాళ్ళముత్తాత సనాతనుడు నీ వెవర్తెవే నా కొడుకును ఎగతాళి చేయడానికి వచ్చావు! నీలాగా నాకొడుకు కాఫీలు, సోడాలు తాగడనా! నీలాగా వ్యాపార్లింట్లో పుట్టి నియోగుల ఇంట్లో మెట్టలేదనా..."అని యుద్ధానికి లేచింది ఆవిడ. అక్కడవున్న సభలో నెమ్మదిగా కలకలం బయలుదేరింది. మా అత్తగారు ఈలాంటి విషయాల్లో తీర్పు చెప్పడానికి బదులు బహుషోగ్గా తప్పుకుంటారు. లోపల వంట ఎంతవరకయింది చూచివస్తానని గబగబ లోపలికెళ్లారు. ఇంకా ఆ సనాతనపు మనిషి తన కొడుకు గొప్పతనాన్ని చెబుతూ ఎదటావిణ్ణి రాల్చిపోస్తూనే వుంది-అంతా వింటూ కూర్చున్నారు. ఏమైనా ఎదురు మాట్లాడితే అందర్నీ వరస పెట్టి తిట్టే గయ్యాళిమనిషట ఆవిడ. తర్వాత మా అత్తగారు నా చెవులో శెలవిచ్చారు. ఈలోగా వున్నట్లుండి ఎవరో ఒకావిడ పరిగెత్తుకొచ్చి "కొంపమునిగింది ఎవడో శూద్రవాడు అన్నం అండా అని తెలియక అన్నం అండాను ముట్టుకున్నాడుట—అది విన్న అక్కడివారందరూ గుడ్లు తేలవేసి "అయ్యో అయ్యో ఇప్పుడేంగతి?" అని గుండెలు బాదుకున్నారు. ఆచారం వెలక్కాయిలాగా గొంతు పట్టుకుందా క్షణంలో. "అయితే వండిన అండా అన్నం దిబ్బలో కుమ్మరించాల్సిందే?" అన్నది ఒకావిడ. ఇంతలో లోపల్నుండి మా అత్తగారు గబగబా వచ్చారు. ఆచారంలో అగ్రస్థానం వహించిన ఆమె ఏం శెలవిస్తుందో అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో అని అందరూ నోళ్లు తెరుచుకుని ఆవిడిని చూచారు. ఆమె యీలోగానే పరిస్థితులన్నీ ఆలోచించింది. అప్పటికే ఒంటిగంట దాటింది. అదా పెళ్ళియిల్లు, అందరికడుపుల్లో ఎలుకలు తిప్పుతున్నాయి. పిల్లాజెల్లా బంధువర్గం అంతా భోజనాలకోసం తహతహ లాడుతున్నారు—వాళ్లందరూ పస్తు పడుండాలి, ఆపూట అండా అన్నం దొర్లిస్తే-వెంటనే మాఅత్తగారు తన తంబురా మందర స్థాయిలో శెలవిచ్చారు -చూడూ కాకమ్మ కా—చూడమ్మ పిన్నీ, వాడు అండా ముట్టుకొన్నాడు అంటున్నారే కాని నాకు నమ్మకం కలగడంలా-వాణ్ణి గట్టిగా గద్దించి అడిగితే చేతివేళ్లు తగిలాయండీ అని ఏడుపు మొగం పెట్టాడు వెధవ-నిజమే అయివుండవచ్చు బహుశా తాకివుండడు-అథవా ఆ వెధవ తాకడే అనుకో. ఇప్పుడొక్క పని చేయాలి మనం." "ఏమిటి కక్కా ఏమిటే" అన్నారు అంతా!

"పురాణాల్లో చెప్పినట్లు అన్నం పరబ్రహ్మస్వరూపం అన్నారు పెద్దవాళ్ళు. అండా అన్నం దిబ్బలో కుమ్మరిస్తే మనకు మహాపాపం చుట్టుకుంటుంది-కాబటి కాస్త తులసితీర్థం ఆ అండామీద ప్రోక్షించి ఆ అండా అన్నం మనం భోంచేయవచ్చు-దోషంలేదు-" అని తీర్పు చెప్పారు మాఅత్తగారు-వెంటనే ఆపూట ఏకాదశి అవుతుందేమో అని భయంలో గుడ్లు తేలవేసిన ఆచారవంతులందరి ప్రాణాలూ లేచి వచ్చాయి. అందరూ ఏకగ్రీవంగా మాఅత్తగారి సమయోచిత ఆచార "అడ్జస్ట్‌మెంట్‌ను" వేనోళ్ళ పొగిడారు - ఆమె పురాణాలు చదివిన పుణ్యవతి అన్నారు అందులో కొందరు —(యింట్లో ఆ పురాణాల మధ్య డిటెక్టివ్ నవల్లూ సినిమా పత్రికలూకూడా వుంటాయని నాక్కూడా తెలుసు) ఏమైతేనేం ఆపూట మా అత్తగారు అందరినీ పస్తు పడుకోబెటకుండా వెంటనే ఆకులు వేయించి అండా అన్నం వడ్డించేందుకు అనుమతించారు.

ఏమిటి ఆచారం? సమయానికి తగ్గట్టు మార్చుకుంటూపోతారు. ఒక రేమనుకుంటారో అని మరొకరు ఆచారం. ఆచారం అని గంతులు వేయడమే తప్ప నిజంగా ఆచారం అనేది మీదగ్గరలేదని నేను మా అత్తగారితో వాదిస్తుంటాను. "అయ్యో నీకేం తెలుసునే, నా ఆచారం. నేనెంతో మేలు. ఈ కాలం మనిషి నయిపోయాననే చెప్పాలి. మాచూడమ్మత్త బతికున్నాళ్లు కొళాయి నీళ్లు తాగిందా? కాఫీ తాగినవాళ్ళతో మాట్లా

ఒకడు : L. T., B. ED లలో
ఏది మంచి డిగ్రీ?
రెండో: BEDఅయితే హాయిగా
పడుకొని నిద్రపోవచ్చు.

* * *

ఒకడు: తన్నేనంటే ముఖ్యై రెండు
పండ్లు ఊడిపోతయ్!
జాగ్రత్త!
రెండో: అన్నీ కట్టించుకున్న
పండ్లే లెండి! తన్నటం
దాకా ఎందుకు! వృథా
శ్రమ. నెమ్మదిగా
లాగినా వచ్చేస్తయ్!

—ఎల్. వెంకటేశ్వర్లు.

★ అత్తగారా - ఆచారాలా - ★

డిందా, సోడాలు, లైంజ్యూసులూ తాగిందా! కటిక ఆచారవంతురాలు గదంటే మా చూడమ్మత్త. అట్లా మా వల్లకూడా కాదు వుండడానికి. అయిపోయింది. నా ఘటం వున్నంతవరకూ యిట్లా పాకులాడుతాను. తర్వాత మీయిష్టం" అంటుంటుంది. ఆచారం కోసం మా అత్తగారు కొళాయి నీళ్లు తాకకుండా భావినీళ్ళు తాగుతారు. మా పెరట్లో వున్న భావినీళ్ళు వుప్పునీళ్ళు. దానికి తోడు బురదగా వుంటాయి. మానవమాత్రులు ఆ నీళ్ళు తాగలేరు కాని ఆ నీళ్ళు మా అత్తగారి ఆచారానికి అమృతప్రాయంగా వుంటాయి—ఆ నీళ్ళలో స్నానంచేసి ఆ నీళ్లే వంటకూ, తాగడానికి తెచ్చిపెట్టుకుంటుందావిడ—ఆ నీళ్ళతో పప్పు 4 గంటలయినా వుడకదు. పాపం ఆ వుడకని పప్పుతో నే భోంచేస్తుంటుంది కాని పంపునీళ్ళు తాకదు మైల అని. "భావి లేకుండా ఒట్టి పంపునీళ్లే వుంటే ఏం చేస్తారు?" అంటే "ఆ పంపుమీద కాస్త తులసితీర్థం చల్లి కృష్ణా అంటూ తాగాల్సిందే ఏం చేస్తాం?" అంటుంది—"మరింక తులసి తీర్థంతో పవిత్రమయ్యే పంపు నీళ్ళు యిప్పుడూ తాగవచ్చుగా!" అంటే "అదెట్లా? భావివుండగా నిక్షేపంలాగా ఆ మైలనీళ్ళెందుకే" అంటుంది. వుప్పు నీళ్ళ భావి నిక్షేపం అట!—సమయంవస్తే ఎంత ఆచారం అయినా తులసి తీర్థంతో పవిత్రం అవుతుంది. ఇది కేవలం చాదస్తమే. జరిగితే ఆచారం — జరక్కపోతే తులసితీర్థం లేకపోతే మరొకటి—ఏదో ఆ సమయానికి సర్దుకునే ఆచారం. అదేమిటండీ అంటే మా ఘటాలిట్లా తెల్లవారి పోనివ్వండీ — లేకపోతే ఫలానా చూడమ్మ కోడలా? అనరటే అంటుంది. అదీ విషయం. ఫలానా ఆవిడ చాలా ఆచారంగా వుంటుంది, అనే పేరుకోసం యింత ప్రాకులాట. ఆచారం మా అత్తగారిలాంటి వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మ. సమయంవస్తే ఎన్ని అవతారాలయినా ఎత్తుతుంది—మా అత్తగారు వుల్లిపాయలు ముట్టరు. ఆ వాసన పనికిరాదు. ఆలాంటి మనిషి ఒకరోజు మనుమడికి వులిపాయలు వేసి కూరవండి పెట్టింది. మా అందరికీ ఆశ్చర్యమై అదేమిటత్తా! అంటే "పోన్లేవే బిడ్డకి చేద్దామని ఆశగావుండి చేశాను. స్నానంచేసి, నా వంట చేసుకుంటే పోయే—" అన్నారు ఆవిడ. ప్రేమకు ఆచారంలేదు. తన మనసులో మనమడికోసం ఒక ప్రియమైన కూరవండిపెట్టడానికి కాసేపు ఆచారాన్ని ఒక వేపు పెట్టిందావిడ. నిజానికి ఆవిడా రోజు వుల్లిపాయ ముట్టిందని తెలిస్తే మిగతా ఆవిడగారితోడికోడళ్లు వగైరా అంతా ఆవిణ్ణి అల్లరి పెట్టేవారే.

నిజానికి మా అత్తగారి ఆచారం చాలా నయం. ఆవిడకంటె కఠినంగా ఆచారాన్ని ఆచరణలో పెట్టేవారే ఎక్కువమంది వున్నారు. నడుస్తూ నీళ్ళు చల్లుకుంటూ నడిచేవారు ఇప్పుడుకూడా వున్నారు—అతిఆచారం అనవసరం అంటుంది మా అత్తగారు. వెనకటికి ఎవరో ఒక కటిక సనాతనపరుడు ఎండలో వెడుతూ దాహానికి తట్టుకోలేక ఒక బ్రాహ్మణ యింటిముందు నిలచి మంచితీర్థం అన్నాట్ట. ఆయింటి యిల్లాలు చెంబుతో తెచ్చి ఇచ్చిందట. చెంబు ముట్టుకుంటే అనాచారం అని తాకకుండా మరొక ఇంటికి వెళ్లాట్ట—ఆ ఇంటివాళ్ళు గ్లాసులో తెచ్చియిచ్చారట. గ్లాసు తాకితే మైలపడతానని అక్కడా నీళ్ళు తాకకుండా వెళ్ళిపోయాట్ట. ఆవిధంగా యింటింటికెళ్ళి నీళ్లు తాకకుండానే దాహంతో వూరంతా తిరిగి ఎండకు తట్టుకోలేక చివరకొక మాలపల్లెముందు మైకంవచ్చి పడిపోయి చాలాసేపటికి కండ్లు తెరిచిచూస్తే ఒక గుడిసెలో మాదిగవాడిఒళ్లో పడుకుని చర్మంతో కుట్టిన ఒక చిన్నదొన్నెలో నీళ్ళు ఆమాదిగవాడు తననోట్లో పోస్తుంటే తను తాగుతున్నాడు. అది ఆచారానికి ఆఖరి మెట్టు. ఈకథ మా అత్తగారే చెప్పారు — తమాషా అది - ఇలా చెబుతూ యింతా తెలిసీ చాదస్తంగా ఆచారం ఆచారం అని ఎందుకంతఅవస్థలుపడతారు అంటే "అయ్యో నాదేం ఆచారమే—మా చూడమ్మ ఆచారంలో నా మొఖం నేను సగం జరుపుకోగలనటే," అంటుంది—మరుక్షణంలో ఫిట్ వచ్చి పడిపోతే గొంతులో నీళ్ళు ఎవరుపోసేది తెలియని మా అత్తగారి చాదస్తానికి నాకు నవ్వొస్తుంది. ★

చంద్రుని భూలోకం

"ఎలా వచ్చిందో వచ్చింది! అదంతా నీకెందుకయ్యా? పడితే తీసుకో లేక పోతే ఇలా ఇచ్చెయ్!" అన్నాడు. సోము, తీసుకున్న సిగరెట్ పెట్టె తిరిగి ఇచ్చేస్తూ, విసుగ్గా.

ఐదురూపాయల కాయితానికేసి చూస్తూ కిల్లీదుకాణం వాడన్నాడు, "ఔను బాబూ! నాకెందుకు? ఎలానో మార్చెయ్యాలని మీ తిప్పలు; పడకపోతే నష్టపడాలే అని మా ఏడుపు!...పోనీ, ఓ అర్ధరూపాయి రాయితీ చేస్తే కష్టమో నష్టమో ఉంచేసుకుంటాను."

"ఆ! అర్ధరూపాయి కమీషన్ కావాలా ఇది మార్చటానికి! ఏదో కాస్త రంగం టిందో లేదో ఇంత హంగామా ఏమిటి?" చూస్తూ చూస్తూ వృథాగా అర్ధరూపాయి వదులుకోడమా? నోటుమడిచి జేబులో పెట్టుకుని ఇంటిముఖం పట్టాడు, సోము.

* * *

"ఒరే కిష్టూ! ఇంట్లో కందిపప్పు ఐపోయింది తేవాలని చెప్పు." వంటింట్లో నుంచీ ఇల్లాలు కేకేసింది

ఇంకోప్పుడైతే, "ఔనౌను! కందిపప్పు కేంపనుంది? చూస్తూ చూస్తూ తరిగిపోతూం టుంది. మళ్ళీ తెమ్మంటుంది. ." అంటూ పొదుపుమీద, గుణపాఠాలు చెప్పే సోము, ఇవాళమాత్రం ప్రసన్నవదనంతో కిష్టూ చేతికి డబ్బిచ్చి పంపాడు. పప్పుతోపాటు ఒకణా పటిక బెల్లం కూడ తీసుకుని పావుగంటకల్లా పునః ప్రత్యక్షమైనాడు కిష్టూ. సోమూ ఆశ్చర్యానికి మేరలేదు. "అరె! డబ్బిచ్చి తెచ్చావురా! ఎక్కడిది?"

"అదేంటి నాన్నగారూ! మీరేగా ఐదురూపాయల నోటిచ్చారు!" సోమూ మరి మాట్లాడలేదు "పడదంటూ తిరిగివస్తా డనుకున్నాను. వీడి తస్సదియ్యా, మార్చుకునే వచ్చాడు, అసాధ్యుడు! పోనీ, పీడ వదిలిపోయింది," అనుకున్నాడు. కిష్టూకి బిళ్ళలు కొనుక్కోమని మరో బేడ బహూమానం కూడా ఇచ్చాడు ఎవడో దుకాణదారుడి ముఖాన అర్ధరూపాయి తగలేసిం దానికంటె ఇది నయంకదా! కాని పప్పుకి అనవసరంగా రూపాయి తగలేశానే, ఒక అర్ధరూపాయిది తెమ్మంటే సరిపోయేది అని పించింది. మొత్తానికి ఆ రాత్రి సోమూ హాయిగా నిద్రపోయాడు.

మర్నాడు బజారునించీ వస్తూ, కాఫీపొడి, చక్కెరకోసం దుకాణానికి పోయాడు. దుకాణదారుడు పదిరూపాయల నోటు తీసుకుని చిల్లర ఇచ్చాడు. సోమూ తెల్లపోయాడు. ఆ మిగత చిల్లరలో తన ఐదురూపాయలనోటే తిరిగి ప్రత్యక్షమైంది.


తెన్నేటి అహల్యాదేవి

ఏమంటానికీ తోచలేదు. కొంచెం తమాయించుకుని అడిగాడు, "ఏం,సూరయ్యా? ఇలాంటి నోటిచ్చావు? పడదల్లేవుందే!" సూరయ్య చెప్పాడు, "అదేమిటి బాబూ! మీరిచ్చిందేగాదూ! నిన్న మన అబ్బాయి వస్తే ఏకో తొందర్లోవుండి తీసుకున్నాను. అయినా మన్లోమనకేమిటి? పోతేసరి, లేక పోతే అప్పుడే ఇచ్చెయ్యొచ్చని జ్ఞాపకంగా దగ్గర పెట్టుకున్నాను."

స్వగతంగా చచ్చేన్రా దేవుడా అనుకుంటు, ప్రకాశంగా, "అలాగా! నేనూ చూసుకోలేదు సూరయ్యా! పోన్లే, నీవెందుకు నష్టపడాలి?..." అన్నాడు సోము. ఫలితేమిటంటే, ఆపదలో సైతం అంటిపెట్టుకునే స్నేహితుడిలా గుండెకి దగ్గరగా జేబులో మళ్ళీ తిష్ఠవేసింది, సోము సంపాయించిన ఐదురూపాయల నోటు.

తరువాతకూడా ఎన్నో ప్రయత్నాలూ పరాజయాలు ఇలానే తటస్థించాయి. చివరకు సోమూ నిశ్చయించుకున్నాడు, ఈ తద్దినం వదిలించుకోవాలంటే ఏదో దగాలాంటిది చెయ్యక తప్పదని.

నిశ్చయించి తలఎత్తేసరికి ఎదురుగా మొట్టమొదట కంటపడ్డవస్తువు, ఒక సైన్‌బోర్డు, 'చంద్రశేఖర కాఫీవిలాస్' శుభం అంటూ లోపలజొరబడ్డాడు. అసాధారణంగా తొమ్మిదణాలు బిల్లుచేసి నోటు అయ్యర్ ముందు



వింత వింత పూలు పూసే కాకర పువ్వొత్తి

—ఫోటో: ఎన్. రామకృష్ణ.]

★ గుండ్రని భూలోకం ★

పెట్టాడు. అంత సందడిలో కూడా ఆ చతుర్నేత్రుడి కళ్ళు పడనేపడినై.

"ఏం, సామీ! ఇది పడదుకదా!"

తెగించి అన్నాడు సోమూ, "అరె! ఏం? ...నా దగ్గర వేరే చిల్లరలేదే మరి!" ఈ దెబ్బతో సరే, ఏంచేస్తాం, ఇయ్యండి అంటాడని ఆశ! అయ్యర్ పరకాయించి చూశాడు, అన్నాడు, "పోనీ సామీ! ఎక్కడపోతుంది? రేపే ఇద్దరుగాని... ఎవడో తుంటరి ఎగేసాడుగాని మీ విషయంలో ఏం భయం?" రోజూ ఆ హోటలు ముందునించే సోమూ ఆఫీసుకు పోతుంటాడు. నోటు పోకపోయినా నలుగురూ చుటూమూగారు "ఏదండిసార్!" అంటూ ప్రతివాడి చేతులోకి పోయింది. "ఎవడో తోసేసి ఉంటాడు, పాపం!", "ఎవరిచ్చారో జ్ఞాపకం లేదాండి?" "అసలు దీనికీ రంగెలా అంటిందో!" ఈ ప్రశ్నలన్నీ వదలించుకుని ఓ అరగంటకి ఇవతల పడ్డాడు.

నిరాశపడి కొన్నాళ్లు ఊరుకున్నాడు సోమూ. ఒకనాడు మళ్లీ, ఆ మొదటి దుకాణం వాడికే అర్ధరూపాయి కమిషనిచ్చి వదలించుకోడం ఉచితమని నిశ్చయం కలిగి బయలుదేరాడు. దారిలో ఒక స్నేహితుడు కనపడి మొదటిఆట సినిమాకు లాక్కుపోయాడు. మాటల సందర్భంలో నోటుసంగతి వచ్చి స్నేహితుడు అడిగాడు. "అసలెలా వచ్చిందోయ్ ఆ నోటు?" సోమూ చెప్పాడు, "అది ఎక్కణ్ణించో రాలేదోయ్! చౌకగావుందని ఒక జేబురుమాలు కొన్నాను రంగుపూలతో అందంగా కనిపిస్తే. దారిలో జోరున వాన మొదలైంది. ఇంటికొచ్చేసరికి, తడిరుమాలుమీది రంగుపూలన్నీ నోటుమీది కెక్కినై...ఇదీ కథ".

"అరె! ఇంతేనా? దీనికేనా ఇంత తిప్పలు పడుతున్నావు? తడిసి అంటినరంగు మళ్లీ తడిపితే పోదుటోయ్!.....కొంచెం బుర్ర ఉపయోగించితే బావుండేది బ్రదర్..." అన్నాడు స్నేహితుడు వేళాకోళంగా.

బోధివృక్షం క్రింద జ్ఞానోదయమైన బుద్ధుడిలా, వికసించిన ముహంతో, "అవునోయ్! వెధవది ఈ మాత్రం తట్టిందిగాదు...ఓ. కే! ఇప్పుడైనా మించిపోయిం దేముంది? ఇదుగో..." అన్నాడు సోమూ జేబులో చెయ్యితడువుతూ. తడివి తడివి వట్టిచెయ్యి బయటికి తీసి తెల్లమొహం వేశాడు. స్నేహితుడి కంతా అర్థమైంది. బుకింగ్ ఆఫీస్ దగ్గర, బకధ్యానంచేసే ఏ జేబుదొంగ అదృష్టమో ఫలించిందని తెలుసుకున్నాడు. తీరా తరణోపాయం సిద్ధించే ఘడియలో నే అసలుకే మోసంవచ్చిందే అని సోమూ పడ్డ వ్యథ ఇంతింతకాదు. అచ్చంగా, 'సలలితముగ నారికేళ సలిలముభంగిన్' అన్నట్టుగానే వచ్చిందా అయిదురూపాయిలనోటు. 'కరిమింగిన వెలగపండు'లాగా చివరకు పోనేపోయింది. సుమతీశతకకారుడు ఈ పద్యం నా నోటునుగురించే చెప్పివుంటాడు అనుకున్నాడు సోమూ.

మర్నాడుసాయంత్రం ఆఫీసులో ఆలస్యమైంది. ఇంటికివస్తూ, ఇన్ని కాఫీనీళ్లు తాగుదామని, చంద్రశేఖరవిలాస్‌లో ప్రవేశించాడు. అడుగుపెట్టగానే అయ్యర్ పిలిచాడు, "ఇదోసార్! మధ్యాహ్నం ఎవడో కాఫీతాగి ఈ నోటు ఇచ్చాడు. ఇది పడదు వేరే ఇమ్మంటే, ఇప్పుడే తెస్తానని అదేదారి పట్టాడు....నాకు చటుక్కున జ్ఞాపకంవచ్చింది, మీ దగ్గర చూచానని.... ఇదో, చూడండి!" నోటు చేతికి అందిస్తూ అన్నాడు, "కాని...ఆ దొంగవెధవ బిల్లు సార్...ఆ బిల్లు కట్టి మీ నోటు మీరు తీసుకుపోవడం న్యాయంగా వుంటుంది సార్!" సోమూకు ఏమనాలో తెలియలేదు. ఇప్పటికే ఆ నోటు మార్చడానికి ఐదు రూపాయలుపైగా ఖర్చు అయింది. ఐనా చుట్టూ కమ్ముకువస్తున్న ప్రశ్నలకు వాడిలిపోయి, 'సరే' అని ఇవతలపడ్డాడు.

★

వనితా లోకం

మోచేతి పద్మమ్ము నోచేటి వేళ-

'మౌనేన కలహం నాస్తి' అన్నారు పెద్దలు. కాని మౌనంమాత్రం అంత సుళువుగా అలవడుతుందా, అభ్యాసం వుంటేతప్ప-అందులోనూ ఆడవాళ్ళకి! కాగా ఆటనాడు ఆడి, పాటనాడు పాడి అల్లారుముద్దుగా పెరిగినందువల్ల ఆకతాయితనం మరిగిన ఆడపిల్లలకి, పెళ్ళికాగానే అత్తవారింటికి వెళ్ళడంతో అక్కడివాళ్ళ మన్నన పొందడానికి ఒక వాతావరణంనుంచి ఇంకొక వాతావరణానికి మారడం అంత సులభంగా సాధ్యపడేదా?

ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళగానే అక్కడంతా కొత్తకనుక సిగ్గువల్లా, భయంవల్లా మొదట్లో ఎంత మూకీభావంతో ఉన్నప్పటికీ, కొంతమంది నోటిదురుసుతనం వున్నవాళ్ళు అనవసరమైన మనస్పర్థలు తెచ్చుకొంటారేమోనని వూహించే కాబోలు, మౌనం అలవడడంకోసం మన పూర్వులు మూగనోము ఏర్పాటు చేసివుంటారు. ఆ మూగనోము వ్రతానికే "మోచేతి పద్మం" అని పేరు. దీనినే ఊనికమార్పు, ఉచ్చారణ దోషాలవల "మోషేటిపద్మం", "మోదేటి పద్మం", "నోచేటిపద్మం" అని రకరకాలుగా చెప్పుకుంటూంటారు.

ఈ నోము పెళ్ళయిన ఆడపిల్లలు పెళ్ళయినయేటినుంచి వరసగా మూడేళ్ళు నోచుకుంటారు. దీపావళి నాడు మొదలుపెట్టి, కార్తీక పౌర్ణమివరకూ ప్రతిరోజూ ప్రదోషకాలంలో తులసికోటదగ్గర అలికి ముగ్గుపెట్టి దీపారాధన చేసినతరువాత వరిపిండితో అష్టదళపద్మం వేసి దానిమీద పసుపుకుంకుమలు జల్లి గౌరీదేవిని పూజిస్తారు. ఆ తరువాత ఈ పాట పాడుతూ తులసికోట చుట్టూ ప్రదక్షిణం చేస్తారు:

"మోచేతి పద్మమ్ము నోచేటి వేళ
మొగల్లు పువ్వులు పూచేటి వేళ
ఆవుల్లు గేదెల్లు వచ్చేటి వేళ
అబోతు రంకెల్లు వేసేటి వేళ
అన్నల్లు తమ్ములతో ఆడేటి వేళ
వదినెల్లు వంటల్లు వండేటి వేళ
అక్కల్లు అలుగుచూ పోయేటి వేళ
బావల్లు పల్లకీ లెక్కేటి వేళ
మరదుల్లు మరి జూద మాడేటి వేళ
అత్తల్లు ఆజ్ఞల్లు పెట్టేటి వేళ
కోడళ్లు కోట్టుపసుపు దంచేటి వేళ
బీరాయపువ్వుల్లు పూచేటి వేళ
బిందెలతో వుదకమ్ము తెచ్చేటి వేళ
కాకారపువ్వులు పూచేటి వేళ
కడవల్ల ఉదకమ్ము పోసేటి వేళ
చంద్రకాంతపువ్వుల్లు పూచేటి వేళ
చెంబుల్లో వుదకమ్ము చేదేటి వేళ
చాకంటిమడతల్లు తెచ్చేటి వేళ
సంజకడ దీపాలు పెట్టేటి వేళ
మోచేతి పద్మమ్ము నోచేటి వేళ

భారవీ-కళ్యాణి

ఈ ప్రకారంగా పాడుకుంటూ అక్షతలు చేత్తో పట్టుకుని ప్రదక్షిణంచేసి ఆ అక్షతలలో కొన్ని కొంగున కట్టుకొని మిగతావి గౌరీదేవిమీద వేసి, తనమీద వేసుకుని ముత్తైదువలకి బొట్టుపెట్టేందికి మాట్లాడకుండా వెళ్ళాలి. ఇలా బొట్టుపెట్టేందికి వెళ్లినప్పుడు మొదటిరోజు ఒకరికి, రెండవరోజు ఇద్దరికి, మూడవరోజు ముగ్గురికి, ఈ విధంగా రోజుకొకరి చొప్పున హెచ్చించి రోజువారీ లెక్కప్రకారం ముత్తైదువలకి, మాట్లాడకుండా వెళ్లి బొట్టుపెట్టి రావాలి. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత రోజువారీలెక్క ప్రకారం ఎంతమందికి బొట్టుపెట్టారో అన్ని నక్షత్రములను లెక్కపెట్టి "పద్మవ్రతం పట్టిన చానమొగము అద్దాన్నిబోలు, తన మొగము తామరపద్మాన్నిబోలు; పద్మవ్రతం పట్టిన చానకు పదివేలయేళ్లు అయిదువతనం!" అని తనలో తాను నవ్వుకుంటూ అనుకుని కొంగున కట్టుకున్న అక్షతలు గౌరీదేవిమీద, నక్షత్రాలమీద వేసి తనమీద వేసుకోవాలి. అష్టదళపద్మం వేసినప్పుడు రోజువారీ లెక్కప్రకారం ఎంతమందికి బొట్టుపెడ్తారో పూజ చేసేముందు అన్ని పద్మాలువేసి పూజ చేస్తారు.

ఏ కారణంచేతనైనా ఏ ఒక్కరోజయినా పూజచేయడం వీలుకాకపోతే మరునాడు పూజచేసేటప్పుడు, ఈ పూజచేయనిరోజుల నాటి ముగ్గులుకూడా పెట్టి, ఆరోజు లెక్కకి వాగా లెక్కనికూడా కలిపి అంతమంది ముత్తైదువులకి బొట్టు పెట్టవచ్చును. ఆ రోజుదాది ఈ నోముకి కార్తీక పౌర్ణమి ఆఖరు రోజు. ఇలా మూడు సంవత్సరాలు ఈనోము నోచుకోవాలి.

దీనికి ఉద్యాపన: మినప్పప్పు బియ్యం కలిపి రుబ్బిన పిండితో అట్లుపోసి తొలియేడు ఒక్కొక్కరికి 4 చొప్పున 4 గురు ముత్తైదువలకి, రెండోయేడు 8 చొ॥ 8 గురికి, మూడోయేడు 12 చొ॥ 12 గురికి దక్షిణ తాంబూలాలతో వాయన మివ్వవలెను.

ఈ నోము ఉద్యాపన చేయకపోయినట్లయితే "కమ్మరివాడి కొలిమిలో కాలిన అట్లపెనం అయి పుడతారని మన ఇళ్ళలో చాలామంది పెద్దల మూఢనమ్మకం! ఆలోచించి చూస్తే "వెనకటి కొకామె మొగుడు పన్నెండువాడు మోషేటిపద్మం ఉద్యాపన చేసిందిట" అనే సామెతకూడా ఈ మూఢనమ్మిక వల్లనే జరిగినది నానుడిగా నిలిచిపోయిందేమో ననిపిస్తుంది. ఈ నోము తాలూకు ఉద్యాపనవిషయంలో ఈ మూఢనమ్మిక ఎంత గాఢంగా నాటుకుపోయిందంటే కుటుంబంలో అత్తగారు ఉద్యాపన చేయకుండా ఉన్న పక్షంలో ఆ ఉద్యాపన అత్తగారి పేరన కోడలిచేతనైనా చేయిస్తుంటూ వుంటారు.

ఈ మూఢనమ్మికవల్ల తప్పితే దీనిలాగ

ఈ చలి కాలములో

నవంబరునుండి చలికాలం ప్రారంభమవుతుంది. ఇతరకాలములలోకన్నా ఈ కాలములో దేహాన్నిగురించి ఎక్కువ శ్రద్ధ వహించటం మంచిది చలికి శరీరం, పాదములు, అరచేతులు, పెదవులు పగులుతాయి. నిర్లక్ష్యముగా వూరుకుంటే శరీరసౌందర్యం పాడయిపోవుటకు అవకాశమున్నది. అసలు ఈ కాలంలో మన రూపు కాకికి, 'కాకి రూపు మనకు వస్తుందని పెద్దలు అంటువుంటారు. కాకిసంగతి ఎలా వున్నా, మన మటుకు మనం శ్రద్ధవహించకపోతే, నిజముగానే కాకిరూపు మనకు రావడం ఖాయం. నిద్రాహారాలు ఎంత అవసరమో, దేహాన్ని శుభ్రముగా అందముగా వుంచుకొనడముకూడ అంత అవసరము. చలికాలములో మడమలదగర చర్మం బీటలువారి పడుచుటకు కూడ చాలా కష్టముగా వుంటుంది. క్రొవ్వుపదార్థం ఎక్కువ వున్నవారికి అంతగా పగలదు. కాని అది తక్కువ ఉన్నవారికి శరీరమంతా పగిలి పెలుసెక్కుతుంది. కనుక అటువంటివారు ఈ చలికాలములో ఎక్కువగా శ్రద్ధవహించాలి.

ఈకాలంలో సబ్బులకన్న శీకాయ, సున్నిపిండివంటివాటితో స్నానముచేయుట మంచిది. సోపుతో స్నానంచేస్తే పగిలిన శరీరంమీద చారికలు చారికలుగాపడి చూచుటకు అసహ్యముగా ఉంటాయి. సున్నిపిండితో గంధముపొడి ప్యాకెట్టు తీసికొని వచ్చి దానిని కలుపుకొని వాడుకుంటే, మంచి సువాసనగా వుంటుంది. ఆపొడి లేకపోయితే కచ్చూరాలు, బావంచాలు, వట్టివేళ్ళు తెచ్చి ఎండబెట్టి పవుడరుచేసి అది కలుపుకొని వాడుకొన్నా సువాసనగానే ఉంటుంది.

ఇక స్నానమునకుముందు వెన్నగాని, కొబ్బరినూనెగాని శరీరమునకు దూమెరుగ్గా రాసుకొని, లోనికి ఇంకిపోవునట్లు బాగా మర్దనచేసుకొని, అరగంట తరువాత గోరువెచ్చనినీటితో స్నానముచేయాలి. రాత్రులందు పండుకొనబోయేముందు ముఖం కడుక్కొని శుభ్రముగా తుడుచుకొని కోల్డుక్రీం గాని, అది లేనివారు కొబ్బరినూనెలో శాండిల్‌వుడ్ ఆయిల్ రెండుచుక్కలు (సువాసనకొరకు) వేసుకొనిగాని ముఖమునకు రాసుకొని మర్దనచేసుకొని పండుకొనిన తెల్లవారి లేచేసరికి ముఖము మృదువుగా ఉంటుంది. మడమలు పగిలినవారు రాత్రులయందు కొబ్బరినూనె నవనీతం రాసుకొంటే తెల్లవారుసరికి మడమలు బిరుసుతగి మెత్తబడుతవి.

ఈ కాలంలో మందపాటి బట్టలయితేనే వెచ్చగానుంటవి. పిల్లలకూడ స్వెట్టర్సు వులెన్‌టోపిలు వెయ్యాలి. ఉలెన్ టోపి లేకపోతే ప్లానల్‌బట్ట తలకు కట్టవలెను. చలిగాలి పిలలకుండెలకు తగలకుండా చూచుకొనవలెను సీతాఫలాలు, చింతకాయలు ముఖ్యముగా చిన్నపిల్లలు తింటే వెంటనే జలుబుచేసి జ్వరాలు వచ్చేస్తవి. కనుక చిన్నపిల్లను ఒకకంటకనిపెడుతూనే ఉండాలి. ★

కొత్తపల్లి రాజ్యలక్ష్మి

నాగమల్లి ఉపయోగములు

నాగమల్లిచెట్టు పచ్చిమిరపమొక్కవలె యుండును. ఇది సాధారణంగా అన్ని ప్రాంతములలోను నాటుకొనును. దీనితో చాలా ఉపయోగములు కలవు.

రెండుమూడు ఆకులుకోసి, బాగుగానలిపి పసరు పిండవలెను. ఆ పసరు తామర, గజ్జి-చిడుము, మొ|| వాటికి ఉదయము, సాయంత్రము వ్రాసినయెడల నాలుగు రోజులలో మాడిపోవును.

నాగమల్లికాడ త్రుంపి మెత్తగాకొట్టి కొద్ది పసుపుకలపి కట్టినయెడల యెంత పెద్ద కురుపులుకాని, సెగ్గడ్డలుకాని వారమురోజులలో గుణమునకు వచ్చును.

నాగమల్లిపువ్వులు కనకాంబరము పువ్వులవలె చాలా చిన్నవిగా తెల్లవిగా యుండును. కొన్ని పువ్వులు కోసి కొంచెము వాముతోకలపి మెత్తగానలిపి మ్రింగినయెడల కడుపునొప్పి వెంటనే తగ్గిపోవును.

నాగమల్లె వేరుతీసి బాగుగాకొట్టి సున్నముతోకలిపి గాయములకుకాని, బెణుకులకుకాని, నొప్పులకుకాని రాసినయెడల రెండురోజులలోనే గుణము నిచ్చును. ★

"వోచేతి పద్మమ్మ..."

ఇంకేనోముకి ఒకరి నోముతాలూకు ఉద్యాపన రెండవతరంలో ఇంకొకరు పూర్తి చేయడం అనేది లేదు.

ఏది ఏమైనా కాస్తసేపైనా మౌనం అలవాటు చేసుకోడానికి మూగనోము పట్టడం మంచిదే.

"భక్తి తప్పినా ఫలం తప్పరాదు, వాక్కు తప్పినా వరం తప్పరాదు, వ్రతంలో లోపం వున్నా ఫలంలో లోపం వుండరాదు అని అన్ని నోములకీ చెప్పుకున్నట్టే దీనికీ ఉద్యాపన వేళ చెప్పుకుంటారు. అయిదువతనంకోసం ఆడవాళ్ళు నోచుకునే అనేక రకాల నోములలో ఇది వొకటి. ★



సింగారింపు

—ఫోటో : కృష్ణకుమార్.]

★ కార్తీక దీపాలు ★

దీపావళి నాటి 'దీపాల వుత్సవం.' దాని ఛాయలు కార్తీకమాస మంతా కనిపిస్తూనే వుంటాయి. కార్తీక మాసంలో ఒకొక్క రోజు వెలిగించే దీపానికి ఒకొక్క విధమైన ప్రాముఖ్యం ఉందన్నారు పూర్వులు. దాన్ని తెలిపే గ్రంథమే కార్తీక పురాణము. అందుకే కార్తీకమాసంలో ప్రతి గృహిణి సాయంకాలము ప్రదోష కాలాన దేవుడిదగ్గర ఒక ప్రమిద దీపము, వాకిట్లో ఒక ప్రమిద దీపమూ ఉంచి, జ్యోతి స్వరూపుడైన కార్తికేయుణ్ని ఉద్దేశించి నమస్కారము చేస్తుంది. కార్తీకమాసం శివుడికి చాలా యిష్టమయినది. ఆమాసమంతా, రోజూ తెల్లవారుఝామున లేచి సమీపానగల పుణ్యనదిలో స్నానముచేసి, నదిఒడ్డునగాని నది సమీపానగల శివాలయంలో కాని దీపం వెలిగించి అక్కడ కార్తీక పురాణం విని తెల్లగా తెల్లారే సరికి యింటికి వస్తారు. తెల్లారకట్ల స్నానము చెయ్యటమువల్ల ఒంటికి జబ్బుచేస్తుందని చాలా మంది భయపడతారు కాని కార్తీక మాఘమాసాల్లో నీటిలో ఒకవిధమైన జీవశక్తివుంటుందిట. ఆశక్తి ఒంటికి చాలా మేలు చేస్తుందట. ప్రతిదాన్ని ఆధ్యాత్మికంగా చూసే మనపూర్వులు ఆ రెండుమాసాల్లోను తెల్లారకట్లు స్నానము చెయ్యటము పుణ్యప్రదమని చెప్పారు. (ఆరోగ్యం అని చెప్పి ఉంటే, మనం వినంగా.) కార్తీక మాసంలో సోమవారానికి చాలా ప్రాముఖ్యం ఉంది. రోజూ పరమేశ్వరుని అర్చించలేక పోయినా నాలుగు సోమవారాలు కాని అథమం ఒక్క సోమవారమైనా సాయంత్రము వరకు వుపవాసముండి పరమేశ్వరునికి అభిషేకము చేయించి ప్రదోషవేళ శివాలయంలో దీపం వెలిగించి పరమశివుడిపేరు చెప్పి ఒక బ్రాహ్మడికి భోజనముపెట్టి తరువాత తాము భోంచేస్తారు. ఇంట్లో ఆచార మున్నవారు కేదారేశ్వరవ్రతం చేసుకుంటారు. ఒకొక కాలానికి ఒకొక ఋతువుకి ఒకొక దేవతా మూర్తిని అధిపతిగా నియమించి ఆదేవతను పూజించి తరించమన్నారు మన పెద్దలు. వసంతకాలంలో శ్రీరామనవమి పేరుతో సీతారాముల్ని పూజించి ఒంటి కవసరమైన పానకము వడపప్పు నీరు మజ్జిగలు సేవిస్తారు. ఇంచుమించుగా దక్షిణాయన మంతా అనారోగ్యం కలిగేకాలమే. ఎక్కువ తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోకుండా వుండాలనే వుద్దేశ్యంతోనే వుపవాసాల పండుగలన్నీ యిందులోవస్తాయి. ఉపాసనమూర్తులు సృష్టిస్థితిలయాలకు మూలకారిణి యైన ప్రకృతి (దేవీమూర్తి), లయకారుడైన పరమేశ్వరుడు (జ్యోతిర్మూర్తి), దేవీ మూర్తియైన ప్రకృతిని శరదృతు ఆరంభమైన ఆశ్వయుజమాసంలో వుపవాసంతో పూజించి ఆ పైన కార్తీకమాసంలో లయకారుడైన పరమేశ్వరుణ్ని ఉపాసిస్తారు.

జ్వాలాతోరణం

తర్వాత చెప్పుకోదగ్గ పర్వదినం కార్తీక పూర్ణిమ (అదే జ్వాలాపూర్ణిమ 7-11-57) దేవతలు ప్రార్థించగానే, కరుణతో కాలకూటాన్ని భక్షించమని పతిని పంపిన ఉమాదేవి సందేహాయత్తచిత్తయై, విషానల భక్షణలో తన పతికే అపాయమురానట్టైతే "లయస్వరూపుడైన పరమేశ్వర ప్రీతిగా చిచ్చురికి

బి. ఎస్. లక్ష్మి

తన శరీరాన్నర్పిస్తా"నని మొక్కుకుందిట. స్త్రీ మాంగల్యాన్ని తన ప్రాణం కన్న మిన్నగా చూస్తుందనే పరమసత్యాన్ని మహాదేవి ఆ రీతిగా చాటింది. పూర్ణిమనాడు సుస్నాతయై నిరాహారదీక్ష పూని పరమేశ్వర స్వరూపుడైన పతిని అర్చించి ప్రదోష సమయము దాటాక అకుంఠిత ధైర్యంతో చిచ్చురికిన మహాదేవి పాతివ్రత్య ప్రభావంవల్ల అగ్ని చల్లనకాగా బయటికి వస్తుంది. ఈ నాటికీ కార్తీక పూర్ణిమనాడు ప్రతి శివాలయంలోను ఈ వుత్సవం జరుపుతారు. ఆలయంముందర రెండు గడలుపాతి మధ్యలో ఒక గడ దన్నెమల్లె కట్టి వాటిని కప్పేట్టు గడ్డిని తోరణమల్లే చుడతారు. నాలుగువేపులా అగ్ని ముట్టించిన జ్వాలాతోరణములోంచి ఒక్క పార్వతి విగ్రహాన్ని మాత్రమే పల్లకిలో కూర్చుండ పెట్టి వుపవాసంతోవున్న ధర్మకర్తలు, అర్చకులు, ఆ పల్లకిని ముమ్మాటు ఆ జ్వాలాతోరణంలోంచి తిప్పి ఏలాటి అపాయము లేకుండా బయటపడతారు. అంతవరకు ఆ వుత్సవాన్ని చూస్తున్న రైతులు పల్లకి గుడిలోకి తీసుకుపోగానే కాలుతున్న గడ్డిని గబగబ ఆర్పి ఎవరికి దొరికిందివారు లాక్కొని తీసుకువెళ్ళి పశువులకు వేస్తారు. ఆగడ్డి తిన్న పశువులు బాగా పాలిస్తాయని ఆ ఏడు ఏ రోగాలు వాటికి రావని రైతుల విశ్వాసం.

ఆ వుత్సవం ముగిసిన తరువాత మళ్ళీ పార్వతీ పరమేశ్వరులకు నివేదనచేసి తరువాత అంతవరకు వుపవాసంతోవున్న ధర్మకర్తలు అర్చకులు భోంచేస్తారు.

కార్తీకమాసంయొక్క ఘనతను దీప మహాత్మ్యన్ని తెలిపే ఒక కథచెప్పి వ్యాసాన్ని ముగిస్తాను. పూర్వం ఒకచాకలి స్త్రీకి ఏడుగురు కోడళ్ళుండేవారు, ఆరుగురుకోడళ్లు, తాను కార్తీకస్నానాలుచేసి దీపం వెలిగించి పురాణంవిని తెల్లారేసరికి యింటికివచ్చేవారుట. ఒక్కరోజూ ఏడోకోడలు పోలిని తమతో రమ్మనేవారు కాదు సరికదా వారింటికొచ్చే వేళకు పనంతచేసి వుండాలని బాధించే వారుట. పాపం యింటిదగ్గరవున్న పోలి వాళ్ళతోపాటువెళ్ళి మహాదేవుని అర్చించే భాగ్యము తనకు లేనందుకు చింతించి ఎక్కడైనా పరమేశ్వరుడున్నాడనే దృఢ నిశ్చయంతో అత్తగారు అటువెళ్ళగానే నూతిదగ్గిరే స్నానంచేసి ప్రమిద, వత్తి లేకపోగా దొడ్లోవున్న అరటిపువ్వు డిప్పలో నూనె వేసి ఒకపాతగుడ్డపేలిక వత్తిగావేసి దీపంవెలిగించి నమస్కారముచేసి దాన్ని అత్తగారు చూడకుండా చాకలిబానక్రింద పెట్టేదిట. ఈవిధంగా చిత్తమంతా ఈశ్వరాయత్తముచేసిన పోలికి కార్తీకఅమావాస్యనాడు ఆఖరుదీపం వెలిగించగానే కైలాసంనించి విమానం వచ్చిందట. ఆవిధంగావచ్చిన విమానాన్నధిష్ఠించి బొందితో (శరీరంతో) వెళ్ళేపోలిని ప్రజలు, చిత్తశుద్ధిలేని శివపూజ చేసి యింటికి తిరిగివస్తున్న అత్తగారు తోడికోడళ్లు ఆశ్చర్యంతో పోలి స్వర్గానికెడుతోందే అని చూశారుట. అంచేత చిత్తశుద్ధిలేనిపూజను శివుడు అంగీకరించడు. అప్పటినుంచి పోలి స్వర్గానికివెళ్ళిన కార్తీక అమావాస్యనాడు అరటిపువ్వు దొప్పల్లోనే తమకతోచిన దీపాలువెలిగించి తాము స్నానము చేసిననదిలోవదలి తమకుకూడా కైవల్యాన్ని ప్రసాదించమని వేడటము పరిపాటి అయింది. ఆరోజు తెల్లారకట్లు తెప్పల్లే తేలి వచ్చేదీపాలతో నదిఅంతా శోభాయమానంగా వెలిగిపోతుంది. ★

శాశ్వతమైన డిజైన్లు

అసలు డిజైన్లని ట్రేస్ తీసుకొనే టప్పుడు పెన్సిల్‌తో కొంచెం గట్టిగా నొక్కి డిజైన్ని దిద్దేయంటే అసలు డిజైనే చిరిగిపోతుంది. ఇంకో విషయం యేమంటే ట్రేస్ తీసుకుంటున్నప్పుడు డిజైను పేపరు కొంచెం కదిలిందంటే డిజైను పూర్తిగా వంకరగా వస్తుంది. దానిని అదేదీ గాకుండా యేదో కాగానే వచ్చిందను కుంటాం. అప్పుడే మనకు తెలుస్తుందంటే మనం యెంబ్రాయిడరీవర్కు మొదలుపెట్టి పూర్తి చెయ్యకుండానే డిజైన్లో కొంతభాగం చెరిగిపోతుంది. అప్పుడు మళ్ళీ పెన్సిలు తీసుకుని దిద్దడం మొదలెడతాం. ఈ దిద్దడంలో కొంచెం వంకరటింకరలున్నా యేదో సరిపెట్టుకుంటాం. ఇన్ని పాట్లుపడి డిజైన్ని ట్రేస్ తీసుకోవడంకన్నా ఎంబ్రాయిడరీ వర్కు చెయ్యడమే సులువని పిస్తుం దొక్కొక్కప్పుడు. ట్రేస్ తీసుకోవ మేడ పెద్ద బ్రహ్మాండంలాగా చెప్తోందిది. యిదేమిటి ?" అని మీరనుకోవచ్చు కానీ ట్రేస్ తీసుకోవడం నాదృష్టిలో కష్టం గానే కనబడ్తోంది. "ఇదేమిటమ్మా ట్రేస్ తీసుకోవడమే కష్టమైతే డిజైన్లు కుట్టడాని కెంత శ్రమపడాలి" అని కూడా మీ రనుకో వచ్చు. కాని నన్నడిగితే ఎంబ్రాయిడరీ వర్కు చేసేటప్పుడు ట్రేస్ తీసుకోవ డంలోను, డిజైన్ కలర్సు సెలెక్ట్ చేసు కోవడంలోనే ఎక్కువ కష్టం వుందం టాను. అంచేత ఎంబ్రాయిడరీ వర్కు చేసేటప్పుడు యింత కష్టపడి ట్రేస్ తీసుకో నక్కర్లేకుండా, డిజైన్లు చెరిగి పోకుండా, వేసుకుని, అనక దాచుకోడానికి వీలైన పద్ధతి ఒకటి చెప్తున్నా.

ఎస్. అనంతలక్ష్మీప్రభాకరం

మనం తీసుకోదల్చిన డిజైను మీద, అయిల్ పేప రొకటి తీసుకు మడతలు లేకుండా పరవాలి. (అయిల్ పేపర్సని ఫేన్సీ షాపుల్లో సాధారణంగా అమ్ముతారు) అయిల్ పేపరు ట్రాన్స్పరెంట్ గా వుండడం చేత అయిల్ పేపర్లోంచి దాని క్రింద నున్న డిజైను స్పష్టంగా కనిపిస్తుంది. డిజైనుపై నున్న అయిల్ పేపరు మీద పేపర్లోంచి మనకి కనబడే డిజైను ఆకారంలో ఒకదాని ప్రక్క మరొకటి దగ్గిర దగ్గిరగా సూదితో రంధ్రాల్ని చెయ్యాలి. తర్వాత డిజైనుమీదనుంచి అయిల్ పేపర్ని తీసెయ్యాలి. ఇప్పుడు అయిల్ పేపరుమీద చిన్న చిన్న 'బెజ్జాల్లో' మనక్కావలసిన డిజైనుందన్న మాట.

తర్వాత మనం బట్టలకి పెట్టుకునే నీలి మందును కొంచెం తీసుకుని కొంచెం కిర్సనాయిలులో కలపాలి. ఆ తర్వాత మనం డిజైను కట్టదలచిన బట్టమీద అయిల్ పేపర్ని మడతలు లేకుండా పరచి, అయిల్ పేపరు కదలకుండా పట్టుకోవాలి. నీలిమందు కిర్సనాయిలు మిశ్రమంలో కొంచెం దూదిని ముంచి అయిల్ పేపరు మీద రాయాలి (రుద్దాలి). తర్వాత బట్టమీద నుంచి అయిల్ పేపర్ని తీసేస్తే బట్టమీద మనకి కావలసిన డిజైను చిన్న చిన్న చుక్కల్లో కనబడుతుంది. తర్వాత ఆ డిజైనుమీద మామూలుగా మనకి వచ్చిన విధంగా కుట్టుకోవచ్చు.

మనం ఎన్ని రోజులకి కుట్టుకున్నా నరేతీ విధంగా తీసిన డిజైను చెరిగిపోదు. ఇల్లాగే కాగితాలమీద డిజైన్లని తీసుకుని ఒక పుస్తకంగా కుట్టుకుంటే ఎన్నేళ్ళకైనాసరే చెరిగి పోకుండా ప్రింటెడ్ డిజైన్సులాగ చక్కగా వుంటాయి.

ఇంత శ్రమపడి ఈ విధంగా డిజైన్లు తీసు కునేకంటే మామూలుప్రకారం ట్రేస్ తీసు కోవడం సులువనిపించొచ్చు. కానీ నేను చెప్పిన పనంతా ఐదు నిముషాల్లో అయి పోతుంది. పెద్ద పెద్ద డిజైన్లని ట్రేస్ తీసు కునేటప్పుడు నేను చెప్పిన పద్ధతిలోవున్న సులువర్థమౌతుంది. ఎంచేతంటే డిజై న్నంతట్నీ దిద్దుకుంటూ కదిలిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటూ ట్రేస్ తీసుకో వడం చాలాకష్టం. అయిల్ పేపరుతో నేన చెప్పిన పద్ధతిలో డిజైన్లనితీస్తే డిజైన్నంతట్నీ దిద్దవలసిన అవసరం వుండదు. పైగా యెంత కాలానికైనాసరే డిజైనులు చెరిగిపోకుండా శాశ్వతంగా వుంటాయి. ★

బుడుగు :—నీవేం చదువుతున్నావ్‌రా, పిడుగూ ?

పిడుగు :—పుస్తకాలు.

బుడుగు:—ఈ వేళ నీ భోజనం ఎక్కడ ?

పిడుగు:—విస్తట్లో.

బుడుగు :— మీ యింట్లో కూరలేం జేశారు ?

పిడుగు:—తినేశాం.

బుడుగు:—మీ బావ ఎంత వరకు చదువుకొన్నాడు ?

పిడుగు:—పెళ్లి అయ్యేవరకు.

బుడుగు:—ఇక వెళ్లు. నేను తిని వండుకొంటాను.

పిడుగు:—నేను వండుకొని తింటాను.

బుడుగు:—వండుకొని ఎట్లా తింటావురా ?

పిడుగు :—అది కాదురా. డబ్బులుపెట్టి, కొందుకొని, తింటాను.

వెంకట్రావు సుందరబాబు,

—మాచేపల్లి.

కర్పూరంతో కాటుకపోయడం

శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారు వ్రాసిన గంథంలో కాటుక చేయు విధానం చూచాను. కర్పూరంతో కాటుక పోయడము నాకు తెలుసు. ఇది సులభం. కంటికి చలవ. ఒక ½ తులం ముద్దకర్పూరం తెచ్చి, ఒక తెల్ల కాగితములో చిన్న చిన్న ముక్కలుగా అంటే శనగబద్దంత చేసి పెట్టుకోవాలి. ఆ తరువాత ఒక యిత్తడిగరిట, లోతుగా వున్నది పరిశుభ్రముగా తోముకొని తడి లేకుండా తుడిచివుంచాలి. ఒక చిన్న పేటులో కర్పూరపు ముక్కను వెలిగించి, గరిటను బోర్లించి మంట ఆరకుండా పట్టుకోవాలి. మంట ఆరిపోకుండా మరియొక్క ముక్కను అంటించాలి. యిల్లాగ ముక్కలు అన్ని అయిపోయే దాకా పెద్దమంట మండకుండా జాగ్రత్తగా చెయ్యాలి. మంట పెద్దది అయితే కాటుక సరిగ్గా పట్టదు. గరిట చల్లారిన తర్వాత మసిని గాలికి ఎగిరిపోకుండా తెల్లటి కాగితములో పడేటట్లు గీకవలయును. ఆ మసికి మంచి వెన్నపూసతో గాని, నెయ్యితో గాని పల్చబడకుండా గట్టిగా యుండేటట్లు కలిపి, ఆముదను రాగికొటిక్కాయలో పెట్టుకొని వాడుకోవాలి. కళ్ళకి చాలా మంచిది, చల్లగా వుంటుంది. పిల్లలు ఏడవకుండా చక్కగా పెట్టించుకుంటారు. నిద్రగూడా పట్టుతుంది. దురదలు, మంటలు వగయిరా వుండవు. నేను మా యింట్లో అదే వాడుతాను. ఒకసారి చేస్తే దాని విలువ మీకే తెలుస్తుంది. బజారు కాటుకలు లేనిపోని అవర్థాలను తెచ్చిపెడతాయి.

యడవల్లి శకుంతల

సంధ్య

దానిమ్మతో...

సాధారణముగా అందరి ఇండ్లలోను కొబ్బరి చెట్టు, కరివేపాకుచెట్టు, దానిమ్మ చెట్టు వుంటాయి. ఈ మాసంలోనే ఎక్కువగా దానిమ్మపండ్లు వస్తాయి. మనఇండ్లలో తీపి దానిమ్మపండ్లు అవవు. తీరా కాయ ముదిరేసరికి పురుగుపడ్తుంది. కాని పుల్ల దానిమ్మ చాల కాస్తుంది. దీని రసం చాల పుల్లగా వుంటుంది. కనుక దీనితో పప్పు, చారు, పచ్చడి, కారం, పులిహోర చేస్తారు.

పప్పు

అరసోలెడు కందిపప్పు మెత్తగా వుడికిన తరువాత పప్పుగరిటతో మెత్తగా మెదిపి (కలిపి) తగినంత ఉప్పు వేయవలెను. ½ చెంచా ఆవాలు, ½ చెంచా కారంపొడి, కొంచెం ఇంగువపొడి వేసి పోపువేసి, దింపేటప్పుడు కొంచెం కరివేపాకువేసి ఆ పోపును పప్పులో వేయవలెను. దానిమ్మకాయ ఒలిచి ఆ గింజలను గట్టిగా చేతితో పిండిన రసము వచ్చును. ఆ రసమును పల్చని బట్టలోగాని, పిండి జల్లెడలో పోసిగాని వడపోయవలెను. పోపు వేసిన పప్పులో 4 చెంచాలరసం వేసి బాగుగా కలిపి భోజనములోగాని, గోధుమ రొట్టెలలోగాని వేసుకొని తినిన రుచిగానుండును.

చారు

రెండుగ్లాసుల నీళ్ళలో తగినంత ఉప్పు, చిటికెడు పసుపు, రెండు కరివేపాకు రెబ్బలువేసి సత్తుగిన్నెలోకాని, రాతిచిప్పలోగాని, ప్లీల్ గిన్నెలోగాని కాచవలెను. నీరు బాగుగా మరగుతున్నపుడు ఎంత పులుపు కావలెనో చూచుకొని దాని ప్రకారము దానిమ్మరసంవేసి దించవలెను. అరచెంచా (అంటే ఇంకా తక్కువ వేయవచ్చు.) ఆవాలు, ½ చెంచా కారం, 5 మెంతిగింజలు,రవంత ఇంగువపొడి వేసి, వేచి,చారులో వేసి మూతవుంచవలెను. ఈ చారు వేడిగా నున్నపుడు చాల రుచిగా నుండును.

పచ్చడి

అరసోలెడు పెసరపప్పు నానవేసి, రాళ్లు, ఇసుక లేకుండ గాలించవలెను. దీనికి తగినన్ని ఎండుమిరపకాయలు, ఆవాలు, ఇంగువ నూనెలో వేచవలెను. రోలు శుభ్రముచేసి, నానినపప్పు, వేచిన మెరపకాయలు, తగిన ఉప్పువేసి రుబ్బవలెను. మరీ మెత్తగారుబ్బిన రుచిగానుండదు. పచ్చడి తీసేముందు ఇంగువ వేసి రుబ్బి, ఒకపొడి పాత్రలోనికి తీసుకొని పులుపుకి తగినంత రసంవేసి కలుపవలెను. కొబ్బరి పచ్చడిలోకూడా పులుపు ఇష్టమైనవారు ఈ రసమును వేసుకొనిన రుచిగా నుండును.

కారము

కావలసిన సామాను: పావుశేరు మెరపకాయలు (ముచికలు తీసినవి. తూకములో కాదు కొలతతో), 2 చెంచాల శెనగపప్పు, 2 చెంచాల మినప్పప్పు, ½ చెంచా ఆవాలు, 10, 15 మెంతిగింజలు, చిన్న ఇంగువపలుకు.

ఈ పోపంతా 2 చెంచాల నేతిలో ఎఱ్ఱగా వేచవలెను. పోపు చల్లారనిచ్చి, రోలు శుభ్రముచేసి మెత్తగా దంచవలెను. ఈ దంచిన కారములో 4 చెంచాల దానిమ్మరసం వేసి బాగుగా కలిపి శుభ్రమైన పొడి జాడీలో వుంచిన వారమురోజులు నిలువవుండును. (తడి తగిలిన పాడగును.)


పులిహోరలోకూడా నిమ్మరసం బదులు దానిమ్మరసం వేస్తే చాలా రుచిగా ఉంటుంది. ★

కాశీనాధుని లక్ష్మీకాంతం

ఒకడు: మా కంపెనీ తయారు చేసిన మందుపేరు చెప్పి తేనే మీ తలనొప్పి అంతా పారిపోతుంది. ఒకడబ్బీ వెల రూపాయి మాత్రమే!

రెండో: అబ్బా! ధర వింటుంటే తల పగిలిపోతున్నదండి.

—ఎల్. వెంకటేశ్వర్లు.]



కేదారీశ్వర వ్రతము

కార్తీక మాసం దీపావళీ అమావాస్య వెళ్లిన మర్నాడు ప్రారంభం అవుతుంది. వివాహితులు, ఈ నెలలో కేదారీశ్వరవ్రతం చేసుకొంటారు. ఇది వారి వారి వంశాచారాన్ని బట్టి వుంటుంది. క్రొత్తగా పెండ్లయిన వారికి, పిల్ల అత్తమామలు తాము నోచుకున్న నాటి నోముదారాలు యిస్తారు. వారిచ్చిన నోముదారం పూజవద్ద పెట్టుకొని ఆరోజంతా ఉపవాసముండి సాయింత్రం వ్రతం పూర్తి చేసుకొని, కథ చెప్పి అక్షతలు వేసుకొని బ్రాహ్మణునకు స్వయంపాకం, దక్షిణా తాంబూలం యిచ్చి దీపావళి పండుగరోజు వలె ప్రమిదలు (దీపాలు) వెలిగించి టపాకాయలు కాల్చి చంద్రుణ్ణి చూచి భోం చేస్తారు. ఈశ్వరాలయంవుంటె అక్కడకూ్కడ వెళ్ళి పూజచేస్తారు. టపాకాయలు కూడా కాలుస్తారు. కార్తీకమాసంలో ఏ సోమవారంనాడయినా ఈ వ్రతం చేసుకోవచ్చు. మరికొందరు కార్తీక పౌర్ణమిరోజున కూడ చేసుకుంటారు. కొందరు ఈ నోముకు నేతి అరిసెలు, గారెలు చేసుకుంటారు. పిండివంటకు నూనె అసలు వాడరారు. ఈ విధంగా వారి యింటి ఆనవాయితిని బట్టి పిండివంటచేసి అదికూడ పూజవద్ద రాశిపోసి కలశం పెట్టి ఆవునేతితో దీపారాధనచేసి పూజ ముగిస్తారు.

కె. ఆర్. లక్ష్మి.

* * *

సెప్టెంబరు 25 వ తేదీ ఆంధ్ర వారపత్రికలోని వనితా లోకంలో "తప్పెవరిది? చిక్కక్కడ" (శ్రీమతి ద్వివేదుల విశాలక్షి) అనేవ్యాసాన్ని మా పెద్దల సమక్షంలో నేను గట్టిగా చదివి వినిపించితే వారికిది నచ్చలేదు. ఇలాంటివి చదివి మేమంతా పోమరులుగా తయారవుతున్నామని, డబ్బును వృధాగా కాజేస్తున్నామని మా యింటిలో సమావేశమైన మా బంధువుల ఎదుట, మంచంపై అధ్యక్షత వహించిన మా మేనమామగారు ఉపన్యసించారు. మరల అప్పుడే ప్రక్కపేజీలో శ్రీమతి కొల్లూరి వెంకట సుబలక్ష్మిగారు వ్రాసిన "అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి" అన్న వంచనా శిల్పం గురించి చదివేటప్పటికి "ఆడవారు అలా వుషారుగా వుండి ఛేం చేయా"లని మొదలుపెట్టాడు. నిజంగా ఇలాంటి శీర్షికలవల్ల చాలమంది క్రొత్త సంగతులు తెలుసుకోవడమేగాక, ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈరచనలు చదివాక చాలమంది స్త్రీలే గాక పురుషులు కూడా తమ పెడదారిని వదలుతారని ఆశిస్తున్నాను.

ఆర్. వి. శేషాద్రి, చాగలమర్రి.

* * *

అక్టోబరు 9 వ తేదీ ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో అన్నంరాజు రమణమ్మగారు వ్రాసిన సంసారంలో సహజీవనం సామరస్యం అనేవ్యాసం చాలా చక్కగా ఉంది.

ఆవుల మద్దులేటి, కాదరాబాదు.

* * *

శనివారం సాయంత్రం పోస్టుమేన్ పత్రిక తేగానే, మొదట ఎన్ని పనులున్నా సరే—"వనితాలోకం" చదవంది మరి తోచదు. నేనేకాదు—బహుశా చాలా మంది ఈలాటి వాళ్లున్నారనుకుంటాను. దానిక్కారణం ఈ మధ్య వనితాలోకం శీర్షిక ఎంతో ఆకర్షణీయంగా వుండడం. ఎంతోమంది వనితలు ఈశీర్షికలో తమకు తెలిసిన విషయాలను రాస్తున్నారు. అంతేకాకుండా ముందుగా ప్రచురితమయిన వ్యాసాలపైన తమ సందేహాలను ఉద్దేశ్యాలను గూడా తెలియపరచడం చాలా బాగుంది! ఓ విధంగా వనితాలోకం వనితల పాలిటి కల్పవృక్షంలా తయారయింది. ఎంచేతంటారేమో ఒక్కొక్కరూ తమకు తెలిసిన విషయాల్ని ఈ శీర్షికద్వారా తెలియజెయ్యటం వల్ల చాలామంది (పఠితలు) దానిపై తమతమ బుద్ధి నుపయోగించి సాధ్యమైనంతవరకు అవతలి వాళ్లుచెప్పిన కొత్త విషయం అర్థం చేసుకోవడమే గాకుండా, తమ ఉద్దేశ్యాలను గూడా తెలియజెయ్యగలుగుతున్నారు. ఇలా ఇలా మొదట వుత్తరాల మూలకంగా, తర్వాత వ్యాసాల రూపంలో, అలా అలా రచనాశక్తిని గూడా పెంపొందించుకోవచ్చు. కేవలం ఒక్క వ్యక్తికే ప్రాధాన్యం ఇవ్వకుండా వనిత లందరికి ఇలా పుత్సాహాన్నివ్వడం ఎంతో గొప్పవిషయం. దానివల్ల ఒక్కరు వ్రాసిన విషయాన్ని చదివి - అందరూ ఏకీభవించేకన్న అందరూ తమ తమ భావాలను ఇతరులకు చెప్పకోడంలో ఏంతో ఆనందం వుంది. ఇలా ఈశీర్షికద్వారా ముక్కుమొగం తెలీనివాళ్ళు కూడా స్నేహితులు కావచ్చు. ముమ్ముందు ఈ శీర్షికనింకా అభివృద్ధి పరుస్తారని ఆశిస్తాను.

ఇకపోతే "వుతరాలు" అనే శీర్శిలో ప్రచురితమయ్యే వుత్తరాలు ఏంతో బాగుంటున్నయ్. అంటే వనితాలోకం చదివిన వనితలకు తాము చదివిన విషయాల మీద తమ ఉద్దేశ్యాలనూ, సందేహాలనూ, తెలియబరచుకోటానికి ఇదో చక్కని అవకాశం. దీన్లో విమర్శలుకూడా లేకపోలేదు. కాని ఈమధ్యవచ్చే విమర్శలు చాలాభాగం మృదువుగానే వుంటున్నయ్. కేవలం అవతలి వాళ్ళను నొప్పించేలా—గురిచూచి రాయి విసరినట్టు కాకుండా విమర్శిస్తే అవతలి వాళ్ళు తమ వ్రాతలో—తప్పు ఒప్పుల్ని ఆనందంగా దిద్దుకోటానికి బాగుంటుంది. సాధ్యమైనంతవరకు విమర్శించినా సున్నితంగాఅలా పూవు విసరినట్టుండాలేగాని—పెరీమని లెంపకాయ కొట్టినట్టుగా వుండటం చాలా అసహ్యం.

పవని నిర్మలప్రభావతి (మొగలిచర్ల)

* * *

మాకు పుస్తకాలుచదవటమంటే యిష్టం. లైబ్రెరీకి చందాకట్టి తెప్పించుకుంటాము; కొందరుమాయింటినించి తెప్పించుకుంటారు. చదవటానికి యిస్తారా? యిప్పుడే యిస్తానంటారు. మాయింట్లో నలుగురం చదవాలి. మాయింట్లోనే నాలుగురోజులు పడుతుంది. ఆపైన వారికి యివ్వాలి. ఇవ్వకపోతే కోపం. సరేకదా అని వాళ్లకియిస్తే అది వారం రోజులకి వస్తుంది. మళ్ళీ మనచేతికివచ్చి దాన్ని లైబ్రరీకి పంపేటప్పటికి 15 రోజులవుతుంది. అంతవరకూ కొత్త పుస్తకాలు రావుగదా. పత్రికలసంగతి సరే. "(పక్కయింటివారి) పుస్తకపఠనము" వంటి వ్యాసాల

కోటి విద్యలూ కూటి కొరకే

సోదంటే పూర్వకాలపు స్త్రీలు చెవి కోసుకొంటారు. రామాయణకాలంలో కూడా సోది వుండేదట. దేవాసురయుద్ధం జరిగేటప్పుడు, విష్ణుమూర్తి సోదెదాని వేషం ధరించి అసుర సౌధాలముందు తిరుగుతూ వుంటే, అసురాంతఃపురకాంతలు తమ భర్తల, యోగక్షేమాలగురించి తహతహపడి, ఆ విష్ణుమూర్తిచేత సోది చెప్పించుకొన్నారట!

మొన్న ఒకవింత జరిగింది. మా పొరుగింటామెభర్త ఏదో వ్యవహారంగురించి పోయి, అనుకున్న గడువుకు రాకపోవటంచేత ఆ యిల్లాలు తొందరపడి శోకన్నాలు తియ్యడం మొదలుపెట్టింది. వెళ్ళినపని అటు వంటిది. ఆనక అమ్మలక్కల మాటలువిని దారినిపోయె సోదెదానిని పిల్చి, అతిప్రేమగా తవ్వెడుబియ్యం చాటలోపోసి "తనభర్త పరిస్థితి ఎట్లా వున్నది. ఎప్పుడువచ్చేది, ఏంచేస్తున్నదీ అతివేగరంగా చెప్ప"మన్నది. అదేంచేసిందో తెలుసా! "నీభర్తపని కొంచెం ఇరకాటంలో వున్నది. దానికి నేను విభూతి నిస్తాను. అంటే ఆ దేవత నీభర్తను కాపాడు తుందన్నమాట. ఏదన్నా ఒక పాతకోకుంటే ఇయి. విభూతినిస్తా" నన్నది. "నా పతి సురక్షితంగావుంటే అదే పదివేల"నుకొని ఒక మాదిరి గట్టికోకనిచ్చి సాగనంపెంది ఆమె. అది వెళ్ళిన కాస్సేపటికే వచ్చాడు భర్త. "వెళ్ళిన వేళావిశేషం ఎటువంటిదోగాని పనిమాత్రం సవ్యంగా జరిగింద"న్నాడు. నిర్ఘాంతపోయిందావిడ తన చాదస్తానికీ, ఆ సోదెదాని తెలివికీ. అదె అంటారు "తెలివెక్కడుందో జయం అక్కడుందని." అదే మర్యాదగా, బిక్షంపెట్టమని ప్రాధేయపడితే, పెడ్తారా? గొప్పి కటికవాడిని నమ్ముతుందిగాని సాధువుని నమ్ముతుందా?

* * *

ఓ వెంకమ్మప్పా! ఓ రాజమ్మప్పా! ఓ కృష్ణవేణప్పా! ఓ పుల్లమ్మప్పా! అంటూ బిగ్గరగా అరిచాడు ముష్టివాడు. వాడి ఆకారం చూస్తే అందరికీ నవ్వువస్తుంది. నెత్తిమీద మిరాయి పొట్లాంలాంటి మేదరటోపీ, ఆ చిరిగిపోయిన గళ్ళబనియను, గోచీ. ఇదీ వాడి ఉద్యోగపు ముస్తాబు. "ప్రొద్దుట్నుంచీ చంపేస్తున్నారు. సిగ్గూ, శరం లేదు. పెద్ద పెద్ద పొలికేకలువేస్తావు. చంటిపిలాడు అదిరి ఎంతో నమ్రతగా చేతులుచాస్తారు. ఒకసారి మాయింటికి ముష్టివాడు వచ్చాడు. మొదట్లో వాణ్ణిచూసి హడలిపోయాను. మిలిటరీడ్రెస్సు వేసుకొని, కర్రతుపాకిని చంకలో పెట్టుకొని, లాఠీకర్రను చేత్తోపట్టుకొంటూ, అధికారదర్పాన్ని చూపిస్తూ వచ్చేసరికి నిజంగా పోలీసనుకొన్నాను. కాని నెమ్మదిమీద గ్రహించాను. అది కూడా కోటి విద్యలలో ఒకవిద్యని. కాని పుట్టుకలోనే కుంటి అవ్వడం మూలంగా కర్రఒకటి బోటుపెట్టుకొన్నాడు.

"ఏమండీ! మీ మీద అరెస్టు వారంటు వచ్చింది. మిమ్మల్ని తీసుకురమ్మని పంపారు. అయ్యో! ఇదేమిటి ఈ అరుగులు ఇట్లా కూలిపోయినయ్. అంతా మట్టేనా? మొన్ననే పేపర్లో ప్రకటించామే. పేపరంతా అదే. అందులో ఎన్నోరకాల మేడల డిజైన్లు వున్నవే? మీరు చూడలేదా? అంతా వుచిత సప్లయి. ఫస్టుక్లాసువి ములగ, బొబ్బాస వాసాలు అన్నీ ఇస్తాము. పాలఘాట్ నుంచి పాలరాయి తెప్పిస్తాం. బెంగాల్ నుంచి బంగాళాపెంకు తెప్పిస్తాం. ఫారన్‌నుంచి ప్రత్యేకమైన విమానంలో ఫర్నిచర్ తెప్పిస్తాం. అరె! జరుస్తున్నారా! ఆరోజున భోజనాలు పెట్టాలని. ఈ చుట్టుపట్ల అడవులన్నీ మనవే. పుల్లవస్తుంది. పందిళ్లకు తాటాకు వస్తుంది. చెఱువుకు ఎసరుపెడ్తాం. బియ్యం మిల్లులో వున్నాయిగా. కిరసనాల తాలింపు. గన్నేరుపచ్చడి. కుంకుడుకాయ పులుసు. కుడితిమజ్జిగ. ఒకటేమిటి? అన్నింటికీ నేనున్నానుగా. అరె! చాలాటైం వేస్టు చేశానే. చప్పున ఆఫీసుకుపోవాలి. ఈ వెధవ కాలు, థర్డ్ వరల్డ్ వార్‌లో విమానం కూలి విరిగిపోయి వర్కు చెయ్యడం మానేసింది. ఉన్న మోటారుకారుకు మిస్టేకొస్తే కాలవ గండికి అడ్డంగాపెట్టి రైతుసోదరులకు మంచి హెల్ప్ చేశాను... ఔనుగాని అమ్మగారూ ఒక్క అణాడబ్బులు ధర్మం చెయ్యండి" అన్నాడు.

ఇంతటి చక్కటి సున్నితమైన హాస్యాన్ని మనకు గల్పించి వినోదపరుస్తారు. గుప్పెడు గింజలుకు మనసామ్మంతా పోయినట్టు భావించి నాలుగు చీవాట్లుపెట్టి బయటకు నెట్టేటట్టు చేస్తాం. అందరకు భిక్షంపెట్టే తాహతుంటుందా? అనవచ్చు. దేముడు మనకిచ్చిన కలో, గంజో కొంచెంపెట్టి పంపించాలి. పుణ్యంకోసం ప్రతిమానవుడు పడతాడుగా పాట్లు. కాశీవెళ్ళి, తిరుపతివెళ్ళి, శ్రీశైలంవెళ్ళి భక్తినికొని సంపాదించేకన్న "కాళ్ళదగ్గర కొచ్చిన బేరం కాశీవెళ్ళినా రాదన్నట్లు" కొంచెమో గొప్పో వాళ్ళకే ముట్టచెప్తే ఆ పుణ్యం ఇక్కడే సంపాదించవచ్చు. తోటిమానవుడిమీద కనికరం చూపించినట్లు వుంటుందిగా. ★

నారాయణ పుణ్యవతి

పడాకు ఫో! ఫో!" అంటూ చీపురుకట్టతో (ఊడ్చటానికి పట్టుకొస్తూ) అవతరించింది అంకాయమ్మ. నిజానికి భిక్షంపెట్టాలని లేదు కాబట్టే-పైసోదంతా ప్రళయగర్జనలా గర్జించింది. పైగా ఒకవైపున తిట్లూ.

"ఏంటప్పా! ముష్టెడు బిక్షంకోసంవస్తే తట్టెడు సోది ఒలగపోస్తావేప్పా అన్నాడు వాడి ధోరణిలో."

"ఆరి నీ మొహంమండా? అప్పా! మళ్ళీ అను. చీపురు, వీపున, దులుపుతాను. ఇంటో బియ్యం నిండుకొన్నాయని చెప్తూంటే నీకాదూ?" అంటూ మళ్ళీ ఉరిమింది చీపురుకట్ట ఝళిపిస్తూ, పైన సోదికి తవ్వెడు బియ్యంపోసిన అంకాయమ్మ.

నిరాశచేసుకొని పోసాగాడు టోపీదార.

ముష్టిలో ముచ్చటలు

ఒకరిని ఇమ్మని బలవంతపెట్టరు. ఒకచోట దొంగతనంచెయ్యరు. పనిచేసి జీవించటానికా వాళ్ళకు ఏదో అవయవలోపం వుంటుంది.

వనితా వాణి

వల్ల అయినా ఇలాంటి బాధలు తప్పుతాయేమో అని అనుకుంటున్నాము.

ఎం. ఆర్. జయలక్ష్మి [ఏలూరు]


* * *

హనుమంతు వంటివాడే...

2-10-57 న పి. సరళాదేవిగారు వ్రాసిన "పొగడ్త" అను వ్యాసం చాలా బాగుంది. మనిషికి ప్రాణవాయువు వంటిది పొగడ్త" అన్నారు. అది ప్రస్తుతపు నవనాగరిక ప్రపంచములో నూటికి 99.9% మందికి వర్తిస్తుందేమో. "ఉన్నమాటంటే ఉలుకెక్కువ"న్న సామెతగా ఈ కాలంలో కనీసం ఆప్త బంధువులకు సహితం మొహమాటం లేకుండా వారి తప్పులనుగాని, విమర్శించామో వారి కోపానికి గురికాకుండా వుండటమన్నది సాధ్యం కాదేమో. "ఎంత గొప్పవారైనా యీ విషయంలో పప్పులో కాలేస్తుంటారు," అని సరళాదేవిగారన్నారు. ఆ మాట అక్షరాల నిజం. శ్రీరామ శిష్యుడు హనుమంతుడు లాంటివాడే పొగడ్తలకు లొంగి సముద్రమును ఒక్కసారి గంతేసి దూకాడంటే ఇక సామాన్యప్రజలు పొగడ్తలకు లొంగకుండా ఉండగలరా. ఎవరయినా మనల్ని పొగిడితే ఆనందిస్తాము. మన తప్పుల్ని విమర్శిస్తే వారిపై ఆగ్రహిస్తాము. మనతప్పులు దిద్దుకొని సరైన మార్గంలో ఉండాలన్న జ్ఞానం ఉండదు, వారు విమర్శించారన్న ఉక్రోషం తప్ప.

వి. విద్యాధరి (బచ్చన్నపేట)

(రాజమండ్రి) ★



పండుగ బహుమతి

మరదలు

"ఓహోహో బావయ్యా
ఎప్పుడు వచ్చావయ్యా,
అక్కయ్యా నీకోసమె
ఎదురుచూపు చూస్తున్నది!

దీపావళిపండుగ కద
తెచ్చావా బహుమతులను?
ఉట్టిచేతు లూపుకుంటు
ఎట్లా రాగలిగినావు?"

బావ

"మరదలు పిల్లేనా
మహా గొప్పగ చెబుతూంది.
పెళ్లినాడు చూస్తాలే నీ
పెంకి కబుర్లేమగునో!

నీమొగుడూ రాలేదని
నీకు బెంగకాబోలును!
పెళ్లయ్యేవరకు నేను
భర్తగ వుంటాను లేవె!"

మరదలు

"నేనే నీ పెండ్లమైతె
జుట్టుపట్టుకు నేదాన్ని.
పొడుగుబావ ఈపాటికి
పొట్టిబావ అయి వుండును!

అక్కా! నువ్వొక్కసారి
ఇలావచ్చి చూడవులే!
బావగారి ముఖమెంతో
బాగున్నది చూడవటే!"

బావ

"నల్లపిల్ల ఊరుకోవె
నీకు కూడ అందమటే?
కోకిలలావున్నావే
కాకిలాగ పాడతావె!"

మరదలు

"అన్నట్లో బావగారు!
అలా నిలబడినారేం?
కూర్చోండీ కుర్చీలో
ఫలహారం తెస్తాను!"

కూర్చుండెను బావగారు,
కుర్చీలో విలాసముగ.
కోళ్ళక్రింద ఉండినట్టి
'కేపు' లాపుమని ప్రేలెను.

అదరిపడిన బావగారు
ఎగిరి క్రిందపడ్డారు!
ఒక్కసారి నవ్వినది
ఫక్కున మరదలుపిల్ల!

"బావగార్కి మామంచి
బహుమతి నే నిచ్చితి" నని
ఎగిరి గంతువేసుకుంటు
అందకుండ పారిపోయె!

"మధుశ్రీ"

క్షీరాన్నప్రియుడు

బ్రాహ్మణ కోడేరులో, పేరుకు, తగినట్లు, బ్రాహ్మణులెక్కువ. వీరిలో కొంతమంది వేదాలు, శాస్త్రాలు చదివినవాళ్లు ఉన్నప్పటికి, భోజనప్రియులు చాల ఎక్కువ. "భోజనం చేయటంకూడా ఒక కళే" అని వారి వాదన.

ఈ రెండవతెగలో ప్రధానంగా చెప్పుకోవలసిన బ్రాహ్మణుడు ఒకడున్నాడు. ఈయనకి ఏమీ పని లేదు. ఎక్కడైనా, పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగితే పిలవకుండానే తయారు. ఈయన భోజనానికి కూర్చుంటే, వడ్డనచేసేవాడి అంతు తేలుస్తాడు. "ఈయనకి మాత్రం నేను వడ్డన చేయలేను" అనే వంటవాళ్లు ఎక్కువయ్యారుకూడా. అందుచేత, అందరూ ఈయన్ని "బ్రభాజమానం భజగోవిందం" అని హేళనచేసేవారు. అలా, అలా ఈయన పేరు 'భజగోవిందం'గా స్థిరపడిపోయింది.

ఈ కాలంలోలా కాకుండా, పూర్వం సంతర్పణలు ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉండేవి. అంతదాకా ఎందుకు, రాజులు కూడా ఈ అన్నదానాలకి ప్రాముఖ్యం ఇచ్చేవారు.

దేశపు రాజయిన విక్రమదేవుడు వేదం చదువుకున్నవాళ్లను, శాస్త్రాలలో పాండిత్యంసంపాదించిన వాళ్లను ఆదరించేవాడు.

ప్రతి ముఖ్యమైన పండుగకు దేశమంతటా అన్నదానాలు జరిపించేవాడు. ఈ కారణంగా భజగోవిందానికి ఏ బాధా లేకపోయేది.

భజగోవిందంయొక్క బంధువులు చాలమంది రాజుగారి కొలువులో స్థానం సంపాదించుకొన్నవారే. కాని ఈయనమాత్రం అలానే ఉన్నాడు.

భజగోవిందానికి, క్షీరాన్నం అంటే పరమానందం. ఏ శుభకార్యమైనాకూడ, కొంచెం తేలికగా అయ్యే పిండివంట ఒక క్షీరాన్నమే కాబట్టి, భజగోవిందం పని బాగా ఉండేది. శుభకార్యం జరుగుతున్న స్థలం తన ఊరికి ఎంత దూరమైనా సరే, భోజనానికి మాత్రం వెళ్లేవాడు.

అవి దసరారోజులు. ఇంటింటా పండుగేకదా! అదీకాక, రాజుగారు కూడా చాలా హడావుడిగా సంతర్పణలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ ఏర్పాట్లు చేయిస్తున్న సందర్భంలో, భజగోవిందం బావగారైన విదూషకుడు, భజగోవిందంవిషయం రాజుగారితో విన్నవించాడు.

"మహారాజా! మా ఊళ్లో భజగోవిందం అనే బంధువొకడున్నాడు. ఆయనభోజనప్రియుడు. అందులోనూ క్షీరాన్నం అంటే మరీ ఇష్టం. ఆయనని ఈ విషయంలో మాత్రం ఎవ్వరూ మించలేరు. తమరు ఎంతమందో కవులను, పండితులను, సన్మానించి, కళలను పోషించుతున్నారు. తప్పకుండా ఈ భజగోవిందంయొక్క నేర్పును మీరు చూచి ఆనందించాలని కోరుతున్నాను" అంటూ విన్నవించాడు.

విక్రమదేవుడికి ఈ మాటలు విన్నతరువాత చాలా ఆశ్చర్యం వేసింది. ఆ మహానుభావుణ్ణి ఒకసారి చూడటమేకాకుండా, తన ఇంట భోజనం పెట్టాలనే కుతూహలం బయలుదేరింది.

"ఈ విషయం ఇన్నాళ్లూ మీరు నాకు చెప్పనేలేదే? ఆ భోజనప్రవీణుణ్ణి నేను దర్శించాలని కోరుతున్నాను. వారితో కలిసి రేపు ఉదయం నాఇంట ఆతిథ్యం స్వీకరించాలి" అని చెప్పి, విక్రమదేవుడు ఏదో ఆలోచనలోపడ్డాడు. ఈభోజనప్రియుడి నేర్పును ఎల్లా పరీక్షించాలా అని యోచించి, ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఇక్కడ, విదూషకుడు పరుగెత్తుకుంటూ వెళ్ళి, సత్రం చావిడిలో భుక్తాయాసంతో బాధపడుతున్న భజగోవిందంతో జరిగిన విషయం అంతా చెప్పాడు. రాజుగారి ఇంట్లో భోజనం అనగానే, అంత ఆయాసంపడుతున్నవాడల్లా లేచి, "సరే వెడదాం పద" అన్నాడు.



తాడేపల్లి గూడెంలో సతీహితసమితి అధ్వర్యాన శారదా గ్రంథాలయంలో బాలికలకు శాస్త్రీయ భరత నాట్యశిక్షణ ఇస్తున్నారు. పద్మనృత్యం : సామవేదం రత్నమాల (11 సం.) రాధాకృష్ణనృత్యం : రాధ —సామవేదం అరుణ; కృష్ణుడు—బండారు సూర్యకుమారి.

"ఇప్పుడే కాదయ్యా.... రేపు ఉదయం వెళ్లాలి...సరేగాని, రాత్రి భోజనంమాత్రం చేయకు...బాగా కడుపు మాడనీ, రాజుగారింట్లో లాగిద్దువుగాని రెండుపూట్లదీ ఒకే సారి" అని చెప్పి, విదూషకుడు తన పనేదో చూచుకోవటానికి వెళ్ళాడు.

భజగోవిందం సరదా ఇంతంత కాదు. ఆ రాత్రి, విదూషకుని సలహాప్రకారం భోజనం మానేశాడు. మరునాడు ఉదయమే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, విబూది బాగా వంటినిండా పూసుకొని, పట్టు పంచె కట్టుకుని, తెల్లగా తోముకున్న రాగిచెంబును చేత్తో పట్టుకుని ఇంటి అరుగుమీద కూర్చుని, విదూషకుని రాకకొరకు ఎదురు చూస్తూ ఉన్నాడు.

అంతలోకే విదూషకుడుకూడా తయారయి వచ్చాడు. ఇద్దరూ బయలుదేరారు రాజభవనానికి.

అతిథులిద్దరూ సమయానికి వచ్చినందుకు విక్రమదేవుడు ఎంతో సంతోషించాడు. "అంతా సిద్ధమైంది. కొంచెం సేపటిలో భోజనాలు వడ్డిస్తారు" అని చెప్పి లోపలికి వెళ్ళాడు.

రాత్రి అన్నంతినని కారణాన భజగోవిందానికి ఆకలి మరీ ఎక్కువై పోతోంది. లోపలినుంచి పిండివంటల వాసనలు గుమ్మెత్తిపోతున్నాయి. ఆ వాసనలలో ఉక్కిరిబిక్కిరై, ఎప్పుడు పిలుస్తారా అని ఊహించుకుంటూ కూర్చొని ఉన్నాడు.

కొంతసేపటికి, రాజుగారే స్వయంగావచ్చి, భోజనప్రియుడు, క్షీరాన్నప్రియుడు అయినటువంటి ఆ బ్రాహ్మణోత్తముణ్ణి, విదూషకుణ్ణి తీసుకువెళ్లి బంగారు పీటలపై కూర్చోబెట్టాడు. వెండిపళ్లేరాలలో పదార్థాలు తీసుకొనిరాబడ్డాయి. ఒకదాంట్లో లడ్డూలు, ఒకదాంట్లో మైసూరుపాకం ముక్కలు, వేరొకదాంట్లో జిలేబీ...ఇలాగ ఎన్నో రకాల పిండివంటలు పెట్టివున్నాయి. ఇంక ఈ ఇద్దరు భోజనం ప్రారంభించారు. విదూషకుడు కబుర్లు చెప్పటంతప్ప ఏమీ తిననేలేదనే విషయం అందరికీ తెలుసు. భజగోవిందంమాత్రం,ఇంకేమీపట్టించుకోకుండా,ఒకదానితరువాత ఇంకొకటి ఇలాగ అన్నీ పూర్తిచేస్తున్నాడు.

విక్రమదేవుడు మాత్రం ఒక ప్రక్కగా కూర్చొని వడ్డన చేయిస్తున్నాడు.

విదూషకుడికిమాత్రం ఒక అనుమానం వేసింది: "మా వాడు క్షీరాన్నం అంటే పడిచస్తాడు., అది చాలా ఇష్టం అని చెప్పానుగదా! ఆ పదార్థం ఎక్కడా కనుపించలేదే"

క్షీరాన్నప్రియుడు

అని రాజుగారి ముఖంవంక పిండివంటలవంకా చూస్తూ కూర్చున్నాడు. రాజుగారు కొంచెం కొంచెం నవ్వుకుంటూ, నిండు కుండలా కూర్చొనివుండటం చూచి "ఏదోవుంది. నాకు తెలియటంలేదు కాని" అని అనుకుని, తానూ నెమరు వేస్తున్నాడు.

భజగోవిందంమాత్రం త్రేన్పుల మీద త్రేన్పులు వస్తున్నా, ఇంకా పిండివంటలు లగాయించడం మాన లేదు. గ్లాసుడు మంచినీళ్లు త్రాగడం పది లడ్డూలు కుక్కుకోవటం... ఇల్లాగ మొత్తానికి, పెట్టిన పదార్థా లన్నీ పూర్తిచేశాడు.

"అయ్యా, భజగోవిందంగారూ, మావంటవాళ్లు ఎంతో చక్కగా తయారుచేసిన రవ్వాకేసరిని తెప్పించమంటారా?" అని అడిగారు రాజుగారు.

"ఏదో మీ దయ, రానివ్వండి" అని మాత్రం అన్నాడు, భజగోవిందం.

విదూషకుడు మాత్రం భోజనం మానేసి, భజగోవిందంవంక, రాజు గారివంక చూస్తూ కూర్చున్నాడు.

రవ్వాకేసరిపళ్లెం ఖాళీచేసిన తరువాత, భజగోవిందానికి కొంచెం ఆయాసం వచ్చింది. ఇది గమనించారు రాజుగారు.

"జీడిపప్పులు దోరగా వేయించి వేసి నేసిన హల్వా వుంది. అది కూడా కొంచెం రుచి చూసి మీ అభిప్రాయం మాకు చెప్పాలి" అంటూ హల్వాపళ్లెం తెప్పించారు విక్రమదేవులుంగారు.

"ఏదో మీరు ఏమన్నా అనుకుంటారో ఏమో అని తప్ప, నాకు నిజంగా కడుపు నిండింది" అంటూనే హల్వా కాస్తా ఖాళీచేశాడు.

రాజుగారు నిజంగా ఆశ్చర్యపోయారు. విదూషకుడుమాత్రం నోరెళ్ళబెట్టుకుని, గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నాడు.

కొంతసేపటికి "మజ్జిగ వేయించండి" అన్నాడు భజగోవిందం.

"అప్పుడే మజ్జిగా? మామీదేదో చిన్నచూపు చూస్తున్నారు. పాలకోవా ఉంది ఇంకా...దానినికూడా మీరు తినాలి" అన్నాడు విక్రమదేవుడు.

"అబ్బెబ్బే...అలాటిదేమీ లేదు మహారాజా...నాకు నిజంగా కడుపు నిండింది"అన్నాడు కాని, పాలకోవా రాగానే దాన్నికూడా ఓ పట్టు పట్టించి, గట్టిగా 'బ్రేవు' మని త్రేన్చాడు.

"ఇంక ఆవుపెరుగు తీసుకురండి... బ్రాహ్మణులు తొందరపడుతున్నారు" అంటూ ఆజ్ఞాపించి, తాంబూలం, దక్షిణకొరకు లోపలికి వెళ్ళారు.

కొంచెం కష్టంతో ఆవుపెరుగు వాయికూడా లాగేశాడు భజగోవిందం. ఇంక లేచి చెయ్యి కడుక్కుందామనుకుంటూ ఉండగా, విక్రమదేవుడు హడావుడిగా వచ్చి,

"క్షమించాలి భజగోవిందం గారూ, మీ కిష్టమైన పిండివంట క్షీరాన్నం చేయించికూడా, మీకు వేయించడం మరచాను. పొరపాటైంది" అని నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు విక్రమదేవవర్మ.

"ఫరవాలేదు...ఇంతలోకే ఏం మునిగింది.....రానివ్వండి......నలుగురితోపాటు నారాయణా" అంటూ లేవబోతున్నవాడల్లా చతికిలపడ్డాడు భజగోవిందం.

ఈ మాటలువిని రాజుగారు తెల్లబోయారు. పీకెదాకా తినికూడా, క్షీరాన్నంకొఱకు మళ్ళా కూర్చోవటంచూసి, విక్రమదేవుడు ఆశ్చర్యపడ్డారు. 'నిజంగా ఈయన క్షీరాన్నప్రియుడే" అనే నిర్ధారణకి వచ్చాడు.

కుంచెడు పాలుపట్టే పాత్రలో క్షీరాన్నం తీసుకొని రాబడింది. దాన్నికూడా భజగోవిందం మంచినీళ్ళు త్రాగినట్లు గడగడా తాగేశాడు.

విక్రమదేవుడికి, విదూషకుడికి నోటమాటలేదు. వంటవాళ్ళు బొమ్మల్లా నిలబడిపోయారు.

భజగోవిందం చెయ్యి కడుక్కొని తాంబూలంకొఱకు వచ్చాడు.

"అయ్యా! మీరు నిజంగా చాల గొప్పవారు. మిమ్ముల్ని చూడక మునుపు ఏమో అనుకున్నాను. కాని ఒక సందేహం...మీరు పూర్తిగా కడుపునిండినాకూడా, కుంచెడు పరమాన్నం ఎలా త్రాగేరో నా కర్థంకాలేదు. దయచేసి సెల వివ్వండి" అని అడిగాడు విక్రమదేవుడు.

"మహాప్రభూ! క్షమించండి. క్రిక్కిరిసి ఉన్న ప్రజాసమూహం, మీరు గుర్రంమీద వస్తుండగా చూచి, ఎలా దారి ఇస్తుందో, అలాగే క్షీరాన్నానికికూడా మిగిలిన పిండివంటలు దారి నిచ్చాయి మహారాజా!" అని విన్నవించాడు

భజగోవిందం.

భజగోవిందంయొక్క సమయస్ఫూర్తికి మెచ్చి, విక్రమదేవుడు, "బ్రాహ్మణకోడేరు" గ్రామాన్ని, భజగోవిందానికి దానంచేశాడు. ★

ఉత్తరం రాసిపెట్టాలంటే

(5-వ పేజీ తరువాయి)

"ఏం రాయరేం బాబూ! ఇంత సదువుకున్నారు గబగబా రాయలేరా."

నా మొఖం తెల్లబడింది.

"మళ్ళీ చెప్పమంటారా."

"వద్దులే. అంతా చెప్పేయ్. తరవాత రాస్తాను," మెల్లిగా అన్నాను.

"మీది మరీ యిదికాని ఈ కొంచెం రాయలేనోరు అంతా చెప్పాక - ఎలా రాయగలరు?" ఆమె ప్రశ్నించింది.

దీనికి సమాధానమివ్వటం నాతరం కాదనుకున్నాను. ఉత్తరం రాయలేకపోయానని ఊళ్ళో చాటుతుందేమోనని భయం వేసింది. ఏకో రాస్తున్నట్లు నటించాను.

"పెద్దపిల్లకి నెలలు నిండాయ్. తీసుకు రాకపోతే ఎలాబాబూ,"

నేనేమీ మాట్లాడలేదు. నవ్వాపుకోలేక నవ్వాను.

"ఎలకకు ప్రాణసంకటం. పిల్లికి చెలగాటం" ఆమె ఖుస్సుమంది.

నేను రాస్తున్నట్లు సీరియస్‌గా ముఖం పెట్టి పెన్ను తిప్పి రాసేస్తున్నాను.

"చిన్నోడు నీకో సంబంధం పెట్టుకొన్నాడు," వెంకమ్మ ముక్కుచీదింది.

"నీకెంతమంది పిల్లలు" తెలిసికొందామని అడిగాను.

"అది రాయనక్కరలేదు బాబూ! మాకు పిల్లలెంతమందున్నారో మావోడికి తెలుసులెండి." ఆమె అమాయకంగా అందో, వెటకారంగా అందో నాకు తెలియలేదు.

"రాయటానికి కాదులే. అసలు ఎంతమంది పిల్లలు?"

"ముగురు ఆడోళ్ళు, ముగురు మగోళ్ళు బాబూ! పెద్దోళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశానండి."

ఇంటిగొడవంతా చెబుతుందేమో ఖర్మ అనుకుని "ఉత్తరంలో రాసేదే చెప్పు" అన్నాను.

"ఇలాటికాపరం నేనెక్కడా చూళ్ళేదు"

ఏదోరాస్తున్నట్లు నటిస్తున్నాను. ఆమె దృష్టి నామీదలేదు.

"నా చెల్లెల్ని దాని మొగుడు నెత్తిమీద పెట్టుకొని పూజిస్తాడు. నేనేం తప్పుపని చేశానని ఉత్తరం ముక్కకూడా రాయటం మానావ్" నా మీద మీద కొస్తుంది.

నేనే దాని మొగుణ్ణి అన్నట్టు. దారివెంట పోయేవాళ్ళు చూస్తున్నారని సిగ్గువేసింది. ఆమె నెలా వదిలించుకోవాలో తెలియలేదు.

"అక్కడ నీకెవత్తో పిల్లదొరికిందనుకుంటున్నారు ఊళ్ళో అందరూ" నవ్వుతూ అంది.

"ఇన్నేళ్ళువచ్చాక యిదేం వక్కబుద్ధి నీకు?"

"ఇది నిజమేనా?" అనుమానంతో అడిగాను.

"ఉత్తదిబాబూ! అలారాత్తే భయమేసి వెంటనే ఇంటికొత్తాడని."

ఆమెఆలోచనకు నాకాశ్చర్యం కలిగింది.

"కనక నీవుయిప్పుడు కంపునీపని మానేసి వెంటనే వచ్చేయవలసింది."

ఆమె ఆజ్ఞాపించింది. నాకునవ్వువచ్చింది. ఆమెకు కోపంవచ్చింది.

"నీవురాకపోతే నేను నుయ్యోగొయ్యో చూచుకుంటాను" ఆమె ఏడ్వటం మొదలుపెట్టింది.

"అంతపనిచేయకు. వస్తాడులే" ఓదార్చాను.

దారినిపోయే యిద్దరు ఉత్తరం వ్రాయటానికి నేనుపడేపాట్లు చూచి నవ్వుకుంటూపోయారు. నాకు చచ్చినంత సిగ్గువేసింది.

"ఇంకా ఏమన్నా రాయాలా?" త్వరగాపోవాలని దేవుడికి మొక్కుకొన్నాను.

"ఉత్తరంముక్క రాయించమనిరాయండి అంతేచాలు."

ఆమె చెప్పినదంతా సమన్వయించుకొని ఉత్తరం వ్రాశాను.

నాకప్పటికి ముచ్చెమటలూ పోశాయ్. ఇంక ఎడ్రస్సురాయాలి.

"మీ ఆయన పేరేమిటి?"

"అయ్యో! నేనెలా చెప్పనండీ. మగోడి పేరు చెప్పకూడదని పేరయ్యగారు చెప్పారు."

"మరెలా! చెప్పకపోతే ఎవరికి అని రాయాలి."

"మీకు తెల్దా మా ఆయన పేరు"

"మరచిపోయాను. చిన్నప్పుడు విన్నా పేరు"

"అదిగో! ఆ వచ్చేవాడి పేరే!"

అలా ఒక ఆంబోతు వస్తుంది.

"ఆంబోతయ్యా"ఆశ్చర్యంగా అడిగాను.

"మీరు మరీను" ఆమె సిగ్గుపడింది.

"లేకపోతే వెంకన్నా" మా వూరిలో ఆంబోతుని వెంకన్న అంటారు.

"అదేనండి"

"ఏ వూరో ఏమిటో అంతా సరిగా చెప్పు. లేకపోతే ఈ మూడు కొన్నాళ్ళదండుగ" హెచ్చరించాను.

"అది ఏ వూరమ్మా...గొంగూర ఊరు అంటారు..." ఆమె జ్ఞాపకంచేసికొంటుంది.

"గుంటూరా?"

"అవునండోయ్ గుంటూరే" [redacted] చెప్పింది.

"ఏం పని చేస్తున్నాడు"

"నౌకరోడు"

"ఏ కంపెనీలో"

"అదేదో పుగాకు కంపునీ"

"పేరేమిటి"

"అదేదో నాకు తెల్దు"

"మరెలా. పోనీ మీ ఆయన నీకు ఎడ్రసు రాసిన ఉత్తరం ఉందా నీదగ్గర"

"ఇంటిదగ్గిరుంది బాబూ! ఇప్పుడే పరిగెత్తుకెళ్ళి తెత్తాను ఉండండి."

అంతలో అలా వెంకమ్మ రెండవ కొడుకు వచ్చాడు.

"అమ్మా! ఇంతసేపే రాయించటం. నీవు వచ్చి గంటసేపు అయింది." వాడు విసుగ్గా అన్నాడు.

వాడిని ఉత్తరం తెమ్మని పంపింది వెంకమ్మ.

"ఎందుకు నీ మొగుడు అంతదూరం పోయాడు?" ఏమీ తోచక అడిగాను.

"ఇక్కడేం పనిదొరక్క అలా దేశాలు పట్టిపోయాడు బాబూ!"

"ఎన్నాళ్ళైంది?"

"మూడు నెల్లయింది."

ఉత్తరం తీసుకొని వెంకమ్మ కొడుకు వచ్చాడు. అందులోప్రకారం ఎడ్రసు రాశాను.

"అంతా పూర్తిగా రాశారా బాబూ! నే చెప్పిందంతా."

"ఆ. రాసేను వెళ్ళు" ఉత్తరం ఇచ్చాను.

"కరణంగారైతే యింకా త్వరగా రాసేసేవారు. ఈయన ఎంత చదువుకున్నా ఉత్తరం వ్రాయటానికి గంటపట్టింది" పోతూ వెంకమ్మ కొడుకు గొణుక్కున్న మాటలు నా చెవిలో గింగురుమన్నాయ్.

కష్టపడి రాసినా పేరు దక్కలేదు.

నా స్థితి అంతా లోపల కిటికీలోంచి చూచి నవ్వాపుకోలేక నవ్వుతున్న మా శ్రీమతి నవ్వు చూచి ఏడ్వలేక నేను కూడా నవ్వాను. ★

ఇప్పటికీ తిరుగుతున్న కృత్రిమ చంద్రగోళం

(౯-వ పేజీ తరువాయి)

ఆయా ఖగోళ ఖండాల నిజస్వరూపం మనకి సరిగ్గా తెలియడంలేదు. అలాకాకుండా వాతావరణంపైకి టెలిస్కోపులు పంపించి వాటిద్వారా గ్రహాదులను చూసినట్లయితే వాటిని గూర్చి చాలా వింతలు బయటపడతాయి. ఈ టెలిస్కోపులు చంద్రుడిలో ఉన్న 12 మీటర్ల పొడవైన వస్తువులనుకూడా స్పష్టంగా చూడగలవట. ఆయా దృశ్యాలను టెలిస్కోపులు నేలమీదికి "టెలీకాస్ట్"చేసి తెలియజేస్తాయి.

ఎలుకల్ని, కోతుల్ని, కుక్కల్నీ, 90 మైళ్ళ ఎత్తుకు పంపించారనీ ఇవి సురక్షితంగా తిరిగి వచ్చాయనీ, ఇవి ఆకాశంలో ఉన్నప్పటి పరిస్థితిని ఆటోమాటిక్ కామెరాలు తీసిన ఫోటోలద్వారా తెలుసుకున్నామనీ రష్యను శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఇంతేకాక మానవచర్మ భాగాన్ని కూడా పైకి పంపించామనీ, దాన్ని తిరిగి మానవ శరీరానికి అతికించగా అది శుభ్రంగా కలిసిపోయిందనీ వారు చెబుతున్నారు. దీన్నిబట్టి వాతావరణాన్ని దాటిపోవాలని ప్రయత్నించేటప్పుడు ప్రాణులలో ఎలాంటి మార్పులు సంభవించేదీ తెలుసుకోడానికి వీలవుతున్నది. ఇది ముందుముందు అంతర్గ్రహయానాలకు ఉపయోగించే ప్రయోగం కావచ్చు.

"ఏవియేషన్ వీక్"అనే అమెరికన్ పత్రిక రాసినదాన్నిబట్టి రష్యావారు అతి త్వరలోనే, బహుశా రష్యన్ విప్లవపు నలభైయవ వార్షికోత్సవ దినమైన నవంబరు 7 వ తేదీనే ఒక రాకెట్‌ను చంద్రగోళంలోకి పంపించవచ్చునని తెలుస్తోంది. ఆ తేదీనే రాకెట్ ప్రయోగం జరిగినా జరక్కపోయినా, చంద్రునిచుట్టూ పరిభ్రమించే రాకెట్‌ను ఎగరవెయ్యడం కష్టంకాదనీ, ఎటొచ్చీ దాన్ని తిరిగి భూమిమీదికి తీసుకువచ్చే మార్గమే ఇంకా తెలియడం లేదనీ రష్యన్లు ఇటీవల ప్రకటించారు.

కృత్రిమ చంద్ర వర్ణనం

సూర్యునిచుట్టూ తిరిగే భూమిని గ్రహమని, భూమిచుట్టూ తిరిగే చంద్రుణ్ణి ఉపగ్రహమనీ మనం అంటున్నాం. రష్యన్ గోళం కూడా భూమిచుట్టూ తిరుగుతోంది గనుక దీన్ని మనం కృత్రిమ "ఉపగ్రహం" అంటున్నాం. దీన్నే పాశ్చాత్యులు "శాటిలైట్" అంటున్నారు. శాటిలైట్ అనే మాటకు అసలు అర్థం "భృత్యుడు" దాన్నే రష్యన్లు వారి భాషలో "స్పుత్నిక్" అంటున్నారు. ఈ మాటకు అసలర్థం "సహయాత్రికుడు" (ఫెలో ట్రావెలర్). మరి ముందు ముందు చంద్రునిచుట్టూ తిరిగే గోళాన్ని పంపిస్తే దానికింకోమాట తయారు చేసుకోవలసివస్తుందేమో.

కృత్రిమ ఉపగ్రహాన్ని అల్యూమినం లోహాలతో తయారు చేశారనీ, దాని ఉపరితలంపై ప్రత్యేకంగా ఏవో పూతలు పూశారనీ "ప్రావ్దా"పత్రిక వర్ణించింది. ఈ గోళానికి రేడియో తరంగాలను ప్రసారంచేసే కమ్మీలు నాలుగున్నాయనీ, రాకెట్‌ను ప్రేల్చినప్పుడు ఇవి గోళానికి ముడిచి పెట్టుకుని ఉండి, గోళం తన గమ్యానికి చేరగానే అవి విప్పుకున్నాయనీ "ప్రావ్దా" తెలుపుతోంది.

గోళంలో నత్రజని వాయువు నింపారనీ, దీనివల్ల గోళంలోని విద్యుత్పరికరాలు పుట్టించే వేడిమిని తొలగించడానికి వీలవుతుందనీ కూడా తెలుస్తోంది.

భూమి వాతావరణపు పై పొరలు అనుకున్నదానికంటె చాలా పల్చగా ఉన్నాయని "స్పుత్నిక్" పంపిన సమాచారంవల్ల తెలిసిందట. 'ఫోటాన్లు' అనబడే కాంతి పరమాణువులనుగూర్చికూడా పాత అభిప్రాయాలను మార్చుకోవాల్సి వస్తుందనీ, ఎందుకంటే ఈ ఫోటాన్లుకూడా వాతావరణంలోంచి మనదగ్గిరికి వచ్చేటప్పుడు కొన్ని మార్పులకు లోనవుతున్నట్లు తేలిందనీ రష్యన్ శాస్త్రజ్ఞులు ప్రకటించారు.

నిత్యయౌవనం

వీటన్నిటికంటే చిత్రమైన ఒకవిషయం ఉంది.

ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం కాలానికి కేవలత్వం లేదు. కాలనిర్ణయం భూగోళం మీద ఒకరకంగా ఉంటేఇతరగోళాల్లోనూ, శూన్యాకాశంలోనూ వేరువేరు రకాలుగా ఉండవచ్చు. ఇటీవల బార్సిలోనాలో ఆకాశయాన శాస్త్రజ్ఞుల సమావేశం జరిగినప్పుడు ఒకశాస్త్రజ్ఞుడు ఐన్‌స్టీన్ కాల సిద్ధాంతాన్ని పురస్కరించుకుని ఇలావాదించాడు: భూమిమీదనుండి బయలుదేరి ఆకాశంలోకొన్ని వేలమైళ్ళఎత్తున ప్రయాణం చేసే మనిషి తనగడియారం ప్రకారం ఒక సంవత్సరంపాటు ప్రయాణం చేస్తాడనుకోండి. అతడు ఆ "సంవత్సరమూ" పూర్తయినతర్వాత భూమిమీదికి తిరిగివస్తే ఇక్కడి గడియారాలప్రకారం అతడు భూమినివదలివెళ్ళి అయిదు సంవత్సరాలైనట్లు నిర్ణయించబడే అవకాశం ఉన్నది. అంటే అతడు ఆకాశంలో ఉన్నప్పుడు ఏది సంవత్సర కాలమని అనుకున్నాడో అది భూమిమీద అయిదుసంవత్సరాల కాలమని అనిపిస్తుంది. ఇక్కడి అయిదు సంవత్సరాలు అక్కడ ఒకసంవత్సరానికి సమానమన్న మాట. కనక భూమిమీదే ఉన్న అతని సమవయస్కులు అయిదేళ్ళు పెద్దవాళ్లు కాగా అతడు ఏడాదే పెద్దవాడవుతాడు. ఆకాశంలో ఇంకా పైపైకి పోతున్నకొద్దీ భూమిమీది కాలానికీ ఆకాశంలో కాలానికీ తేడా పెద్దదవుతూ ఉంటుంది. ఈ లెక్కన పైకిపోయినకొద్దీ మనుషులకు వయస్సురాదు. బహుశా యౌవనం పరిమితి పెరుగుతుంది. ఎంతకాలమైనా చిన్నవాళ్ళుగానే ఉండవచ్చు.

ఆ శాస్త్రజ్ఞుడు ఇలా వాదించేసరికి బార్సిలోనా సమావేశానికి హాజరైన శాస్త్రజ్ఞుల భార్యలందరికీ ఎక్కడలేని ఉత్సాహమూ కలిగిందట. సాధారణంగా వయస్సు వస్తున్నదంటే భయపడేది స్త్రీలే. స్త్రీలు సాధారణంగా తమ వయస్సు తగ్గించి చెప్పుకుంటారని ప్రతీతి. ఈ బాధ లేకుండా అప్పుడప్పుడు ఆకాశంలోకి వెళ్ళిపోయి ఓ ఏడాది ఉండి మళ్ళీ వస్తుంటే తమ యౌవనం చాలాకాలం నిలుపుకోగలమని వాళ్లు ఆశగాబోలు.

హైందవ సాంప్రదాయిక సిద్ధాంతాల ప్రకారం కూడా ఇది అయితే కావచ్చునని పిస్తుంది. మన సంవత్సరం పితృదేవతలకు ఒక దినమనీ, ఇలా దేవవర్గంలో పైకి పోను పోను మన కొన్ని యుగాలు వాళ్ళకొక దినమనీ, సంవత్సరమనీ ఏవేవో లెక్కలున్నాయి. దేవతలు త్రిదశులు (ముప్ఫయ్యేళ్ళు దాటనివారు) అనీ, అప్సరసలు నిత్యయౌవనులనీ అంటారు. ఆయా దేవలోకాలు అంతరిక్షంలో ఎక్కడెక్కడో ఉన్నాయని, అక్కడికీఇక్కడికీ కాలభేదం ఉందనీ "ఊహించిన" మన పూర్వుల బుద్ధికుశలతకు ఈనాడు మనం జోహారుచెయ్యకతప్పదు.

ఇలాంటివన్నీ చూసే మన సనాతనులు కొందరు "ఇవన్నీ వేదాల్లోనే ఉన్నాయివి. మన వేదాల్లోంచి ఎత్తుకుపోయినరహస్యాలే తెల్లవాళ్ళిప్పుడు వాడుకుంటున్నారవి" అని అనడం వింటూంటాము. మన పూర్వులు ఏనాడో రాసిపెట్టేసిన అనేక విషయాలన్నీ "చాదస్తం" కాదనీ, ఆ విషయాల్నే ఈనాటి మానవుడు మళ్ళీ ఇంకోమార్గాన, ఇంకో పద్ధతిన కనుక్కుంటూ ఉన్నాడనీ స్పష్టపడేరోజు రావచ్చు—ఎవరు చెప్పగలరు? పిపీలికాది బ్రహ్మపర్యంతం ఒకటే పదార్థం ఉందనీ, "ఏకమేవా ద్వితీయం" అనీ మహర్షులు వేదాంతపరంగా చేసిన నిర్వచనానికి, ఐన్‌స్టీన్‌వంటి శాస్త్రజ్ఞులు వైజ్ఞానిక పద్ధతిలో విశ్వమంతటా దర్శించిన "ఏకత్వానికీ" పోలికలు కనబడడంలేదా? ★

న్యూఢిల్లీ లేఖ
(4-వ పేజీ తరువాయి)

ప్రతి మెడికల్ విద్యార్థి తన డిగ్రీ తీసుకునేముందు మూడునెలలపాటు గ్రామీణ ఆరోగ్యకేంద్రంలో విధిగా పనిచేయాలనే కొత్త నియమాన్ని అమలుజరిపినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రి కర్మార్కర్ చాలా గొప్పగా చెప్పుకున్నారు.

ఈమూడు మాసాల ప్రొబేషనర్ల పటాలాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన గ్రామీణ ఆరోగ్యకేంద్రాలకు ఒరిగేదేమిటన్నదే ప్రశ్న. గ్రామీణ ఆరోగ్యాభివృద్ధి సమస్యలోవున్న ప్రధానాంశాన్ని పరిశీలించి పరిష్కరించడానికి ప్రయత్నించకుండా ఇలాంటి ఆకుకు అందని పోకకుపొందని పద్ధతులను అమలు జరిపినందువల్ల ప్రయోజన మేమిటి?

గ్రామసీమ విద్యాధికులను ఏమాత్రం ఆకర్షించడం లేదన్నది అతి ప్రధానమైన అంశం. గ్రామాలనుంచి ప్రజలు పట్టణాలకు ఎగబాగడం మరీ ఎక్కువైంది కాని పట్టణవాసులెవరూ గ్రామాలకు తరలిపోవడం లేదు. కేంద్ర ఆరోగ్య మంత్రి వైద్యశాస్త్ర పట్టభద్రులను వర్తింప చేసిన నిర్బంధంవల్ల పరిస్థితులేమీ మారబోవు. దీర్ఘకాలిక పథకాలను అమలుజరిపినప్పుడే ఈ విషమపరిస్థితి పరిష్కారం కావడం సాధ్యం. పల్లెపట్టును ఆకర్షణీయంగా తయారు చేసే మార్గాలేమిటో ఆలోచించాలి. విద్యాధికులైన భారతీయులలో గ్రామ నివాస దృక్పథం ఏర్పడేట్లు చేయాలి. పల్లెసీమ క్షేమాభ్యుదయాలపట్ల పరమవిశ్వాసం, భక్తి ప్రపత్తులు వున్నప్పుడే విద్యాధికులలో ఈ దృక్పథం వస్తుంది.

విద్యాధికులలో ఇలాంటి నవచైతన్యాన్ని తీసుకురావడానికి అసలు ప్రయత్నమే జరగడంలేదంటే ఆశ్చర్యపడనవసరంలేదు. అందుకు అనుకూలమైన వాతావరణాన్నే సృష్టించడంలేదంటే నమ్మండి. మొత్తంమీద పరిస్థితి రోగమొకటి; మందు మరొకటి మాదిరిగా వుంది.

ఇందుకు ఒక ఉదాహరణం చెబుతాను. గ్రామసీమలో ఉత్తమసేవచేసిన వ్యక్తికి ప్రధాని నెహ్రూ తరఫున ఒక మోటారు సైకిల్‌ను బహుమతిగా ఇవ్వబోతున్నట్లు భారత ప్రభుత్వ సమాజ వికాస కార్యకలాపాలశాఖ ప్రకటించింది. ఇలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామసేవకుడికి ఒక మామూలు సైకిల్‌ను, రాష్ట్రస్థాయిలో మరొక మోటారు సైకిల్‌ను కూడా ఇస్తామని దర్పంగా ప్రకటించారు. ప్రకటన చేసేముందు అసలు మోటార్లు నడవడానికి అనువైన రోడ్లు మన గ్రామసీమలో ఏమాత్రం వున్నవనే విషయం ఆలోచించినట్లు కనబడదు. ఈ మోటారు సైకిళ్ళ బహుమతుల పథకం పర్యవసానంగా గ్రామసేవకులు, సేవికలు నగరాలకు ఎగబాకేట్లు చేయదని ఎవరు చెప్పగలరు? ఇందులో మరొక ధర్మసూక్ష్మంకూడా లేకపోలేదు. అసలు గ్రామసేవ చేస్తున్నట్లు కనబడేవారిలో ఎక్కువమంది పట్టణాలనుంచివెళ్ళి గ్రామీణులకు మొహం కనబరిచేవాళ్ళే! అంటే మోటారు సైకిళ్ళబహుమతితో వీరుతమకొత్తవాహనాల మీద వెళ్ళి గ్రామవాసులకు మరికొన్ని సార్లు మొహాలు కనబరచడానికి వీలవుతుంది. ప్రధాని నెహ్రూ, ఎస్. కె. డే. ప్రభృతులు పాల్గొని కొనసాగించే ఈ ప్రత్యేక బహూకృతుల ఉత్సవాల ప్రయోజనం ఇంతకుమించేమీ వుండదనే తోస్తుంది.

* * *

కార్మిక న్యాయస్థానాల తీర్పులను అమలుజరపక ధిక్కరించే యజమానులమీద కఠినతరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇక్కడ రెండురోజులపాటు జరిగిన వివిధరాష్ట్రాల కార్మికమంత్రుల సమావేశం హెచ్చరిక చేసింది. దీన్నిబట్టి కేంద్ర కార్మికశాఖ పరస్పర విరుద్ధమైన రెండురకాల ప్రమాణాలను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టపడుతున్నది. న్యాయస్థానం తీర్పులను అమలుజరపని యజమానులను శిక్షించదలిస్తే, అదే నియమం, ఆదే ఆదేశం తీర్పులకు కట్టుబడకుండా ప్రవర్తించే ఉద్యోగులకు కూడా-వారు నంబూద్రి బ్రాహ్మణులైతే తప్ప-విధిగా వర్తించాలి.

ఇందుకు బ్యాంకు అవార్డునే ఒక దృష్టాంతంగా తీసుకోవచ్చు. లోగడ ఇచ్చిన అవార్డుకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె ప్రారంభించారు. ఆ అవార్డు ప్రభుత్వం, బ్యాంకు యజమానులు కూడా పూర్తిగా ఆమోదించిందే. సమ్మె భావ్యంకాదని విజ్ఞప్తిచేయడం తప్ప, కేంద్ర కార్మికశాఖ బ్యాంకు ఉద్యోగులు అవార్డును ఆమోదించేట్లు చూడడానికి ఏమాత్రం కృషిచేయలేదు. పైపెచ్చు ఆ ఉద్యోగుల వత్తిడికి లొంగిపోయి, వారుకోరినప్రకారం అవార్డును సవరణకూడా చేసింది!

స్వతంత్ర భారతదేశంలో కేంద్ర కార్మికమంత్రిత్వశాఖ అనుసరిస్తున్న విధానంలో గమనార్హమైన రెండు ప్రధానాంశాలు వున్నవి. ఈ పదేళ్లలో దేశం మొత్తంమీద కమ్యూనిస్టుల ధర్మమా అని కార్మిక అశాంతి మరీ ఎక్కువైపోయింది. అడుగడుగునా శ్రామికవర్గం అడిగిన కోర్కెలన్నీ తీర్చి తృప్తిపరుస్తున్నప్పటికీ, ఈ అశాంతి ఉధృతం ఎక్కువవుతూనే వున్నది. ఇది ఒక అంశం; ఇక పోతే, రెండో అంశం-మనిషి సగటు లెక్కలప్రకారం ఉత్పత్తి తగ్గిపోవడం. పదేళ్ళక్రితం చేసినపనిలో సగంవంతైనా బ్యాంకుఉద్యోగులు ఈనాడు చేయడం లేదు; జాతీయ భీమావ్యవస్థ ఉద్యోగుల వరస కూడా ఇదేవిధంగా వున్నది. రైల్వే ఉద్యోగులు, బస్సుడ్రైవర్లు, సెక్రటేరియట్‌లో పనిచేసే స్త్రీ పురుష ఉద్యోగులు కూడా ఇంతే. వీరందరూ అత్యధికమైన వేతనాలు, అత్యల్పమైన పని అనే ధోరణిలోనే ప్రవర్తిస్తున్నారు!

కేంద్ర కార్మికశాఖ ఇంతమంది ఉద్యోగులూ చేస్తున్నపని ఫలితాన్ని సరిగా విలువకట్టే యంత్రాగాన్ని మాత్రం ఇప్పటికీ ఏర్పాటు చేయలేకపోయింది!

రాష్ట్ర కార్మికమంత్రుల సమావేశం కాగానే, సభాస్థలి అహమ్మదాబాదుకు మారిపోయింది. అక్కడ నవంబరు 2-వ తేదీ నుంచీ జరిగే 'సాంఘికసమాజం మహాసభకు పెద్దపెట్టున సన్నాహాలు సాగిస్తున్నారు!

* * *

పాత, కొత్త ఢిల్లీ నగరాలలోవున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య రక్షణ పథకం ఒకదాన్ని ఇదివరలో శ్రీమతి అమృతకౌర్ ఆరోగ్యమంత్రిగా వుండగా ప్రారంభించడం జరిగింది. ఈ పథకంక్రింద అయే ఖర్చును ప్రభుత్వోద్యోగులే నెలసరి విరాళాల ద్వారా భరిస్తారు. మొదట దీన్ని ప్రతిపాదించినప్పుడు తీవ్రమైన ప్రతిఘటన వచ్చింది. అప్పట్లో దీనికి పుట్టుకలోనే సంధి కొట్టిందనుకున్నారుకూడా. ఆ పరిస్థితులలో దీని అతుకులు, ఆచరణలో బాగోగుల పరిశీలనకు ఇద్దరు కల్నల్స్‌ను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. కర్నల్ ఆర్. డి. అయ్యర్, కర్నల్ ఎం. ఎస్. రావు అనే వారే వీరిద్దరూ. పథకాన్ని జయప్రదం చేయడంలో వీరిద్దరి అవిరళ కృషి బాగా ఫలించింది. ఈ ఆరోగ్య పథకాన్ని శాశ్వతం చేస్తున్నట్లు ఈ వారం అధికార ప్రకటన వెలువడింది. ఇద్దరు సైనికోద్యోగుల పనీ పూర్తి అయినందువల్ల వీరిని తిరిగి తమ సైన్య శాఖ పదవులలోకి బదిలీచేసివేశారు. వీరు త్వరలోనే పూనా వెళ్ళి అక్కడ సైన్యశాఖ వైద్యాలయ పదవులను స్వీకరిస్తారు. ★

గమనిక

39 వ పుటలో 'దానిమ్మతో' వంటకాల గురించి వ్రాసినవారు శ్రీమతి 'సంధ్య' (బందరు) 36 వ. పుటలో 'నాగమల్లి ఉపయోగములు' వ్రాసినవారు కాశీనాధుని లక్ష్మీకాంతంగారు అని గమనించ ప్రార్థన.

చిత్ర చరిత్రలు

'మంచివి' అని పించుకొన్న చిత్రాలకు డబ్బురాదు; డబ్బువచ్చిన, చిత్రాలు 'మంచివి' అనిపించుకునే లా ఉండవు. చలచిత్ర ధరిత్రి చరిత్ర గ్రంథానికి ఇది తొలిపత్రం లాంటిది. కారణాల తోరణాల మంచి చేష్టలు ఎలా ఉన్నా, ఇది నిత్యమైన సత్యంగా నిలచింది అతి సహజం అయినా, ఏడాదికోసారి, కొందరు ఇంకా తరచుగా ఆశ్చర్యపడుతూనే ఉంటారు ఈ కార్యక్రమం కూడా సహజం అయిపో



ఎన్. ఏ. టి వారి 'పాండురంగమాహాత్మ్యం'లో రామారావు బి. సరోజ

యిందని పించే పరిస్థితికి వచ్చింది.

పరిమిత విపణులుగల దేశాలన్నిటి సంగతి ఎలా ఉన్నా ప్రపంచావధిని చిత్రాలు విడుదలచేసి డబ్బు చేసుకోగల హాలీవుడ్ పరిశ్రమలో బాక్సాఫీస్ గురించి పట్టించుకోకుండా తీసే చిత్రాలు కూడా ప్రజాదరణ పొందుతూ ఉన్నందువల్ల అక్కడ 'మంచి' చిత్రాలు దెబ్బతిన్నప్పుడు పరిశ్రమలో వారు విమర్శకులూ కూడా కొంత కూస్త ఆశ్చర్యపడి కారణాలు వెతుక్కోవడం సహజమే.

'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో చలనచిత్ర విమర్శకుడు బాస్లీక్రౌథర్, మొన్నటి వేసంకాలంలో (ముఖ్యంగా ఈ ఆగస్టు నెల) అమెరికాలో విడుదల అయిన చిత్రాల జయాపజయాలను పరిశీలించి 'ఈనాటి మహారాజపోషకులు ఎవరూ?' అన్న ప్రశ్నకు జవాబు వెతికాడు. (మనకి సంక్రాంతిపండుగ 'సీజన్' అయినట్లే అక్కడ ఆగస్టు ముఖ్యమైన నెల) ఉన్నంతలో భారీఎత్తున లాభాలు గడించిన రెండు చిత్రాలలో ఒకటి అమెరికన్ చిత్రం: ఐలెండ్ ఇన్ ది సన్, రెండవది 'కర్స్ ఆఫ్ ఫ్రాంకెన్‌స్టీన్' అనే బ్రిటిష్ చిత్రం. మొదటిది రెండు భిన్న జాతులకు చెందిన స్త్రీ పురుషుల సంయోగం ఇతివృత్తంగా, 'సెక్స్ అప్పీల్ ప్రధానరసం'గా తయారైన బాపతు. రెండోది భీభత్సరసప్రధానమైనది. "ఈ రెండూ ఈ ఏడు ప్రజాదరణపొందిన చిత్రాలంటే నమ్మలేము. అయినా నమ్మక తప్పదు. ఇది అక్షరాలా నిజం" అని క్రౌథర్ వ్రాశాడు. అలాగే ఘనవిజయాన్ని సాధించిన ఇతరచిత్రాలు. 'గన్ ఫైట్ ఎట్ ది ఓ. కె. కొరాల్', (నేల బారుగా సాగిన 'వెసర్న్'), బ్యాండ్ ఆఫ్ ఏంజెల్స్ (సెక్స్), డెలికేట్ డెలింక్వెంట్ (జెర్రీ లూయిస్ రాణించని చిత్రం) లవింగ్ యూ (ఎల్విస్ (రాకెండ్‌రోల్) ప్రెస్లీ) ఇంకా ఈజాతివే మరికొన్ని. ఉన్నవాటిలో కొంత ఫరవాలేదు అనిపించుకున్న చిత్రాలు 'ఫన్నీ ఫేస్'(ఫ్రెడ్ ఆస్టెయిర్), ఎఫెయిర్ టు రిమెంబర్, అని క్రౌథర్ పేర్కొన్నాడు

ఇక, ప్రజాదరణపొందుతాయి అనిపించిన చిత్రాలు 'డెస్క్‌సెట్' (స్పెన్సర్ ట్రేసీ, కేథరిన్ హెప్‌బర్న్), 'లవ్ ఇన్ ది ఆఫ్టర్‌నూన్' (గారీకూపర్, ఆడ్రీ హెప్‌బర్న్), నైట్ పాసేజ్ (జిమ్మీస్టివర్ట్), వంటివి డబ్బు చేసుకోలేకపోయాయి. ముఖ్యంగా 'డెస్క్‌సెట్' చిత్రంలో ఇతివృత్తం గొప్పదని అన్నారు. మనిషికీ యంత్రానికీ పోటీ అందులో కథాంశం (నయాదౌర్ చిత్రంలో బస్సుకీ టాంగాకీ వచ్చినట్టే) నటులు పెద్దవాళ్ళు. వాళ్ల చిత్రాలు యెన్నడూ దెబ్బతినలేదు. అయినా ఈసారి ఇలా జరిగింది.

అలాగే గారీ కూపర్ చిత్రంకూడా. బాగా డబ్బు చేసుకున్న చిత్రాల తీరు తెన్నులను, విఫలమైన చిత్రాల లక్షణాలను పోల్చి చూస్తే తేలిందేమిటి?

ఈనాడు అమెరికాలో పెద్దవాళ్ళు కుడి యెడములు తెలిసినవాళ్ళూ సినిమాకు వెళ్ళటంలేదు. ఇళ్ళలోనే కూర్చుని టెలివిజన్ చూస్తూనో పుస్తకాలు చదువుతూనో కాలక్షేపం చేస్తున్నారు. ఐతే సినిమాలకు తండోపతండాలుగావచ్చి పోషిస్తున్నవాళ్ళెవరు?


గెలిచిన చిత్రాలలో తుపాకులతో కొట్లాటలూ, భీభత్సదృశ్యాలూ, సెక్స్, అమెరికాలో పెద్దలు చాలమంది విమర్శిస్తున్న ఎల్విస్ ప్రెస్లీ నృత్యాలూ, ప్రధానాకర్షణలు కాబట్టి వాటిని చూడబోతున్నవారంతా కుర్రాళ్ళేను అని బాస్లీక్రౌధర్ తేల్చాడు...

మనదేశంలో చిత్ర విజయాలకథ కూడా దీనికి సమాంతరంగానే సాగుతోంది. మనస్థితిగతులూ, అభిరుచులూ మనదృష్టితోనే చూచినా, సారాంశం వాటికిభిన్నంగా ఉన్నదనిపించదు. ప్రభుత్వ బహుమతులూ, పెద్దలప్రశంసలూ గడించుకొంటున్న చిత్రాలు అనేకం ప్రజల ఆదరణను సంపాదించలేకపోతున్నవి. గందరగోళంవేపు సాగిపోయి, పోయిపోయి చివరకు అయోమయ పరిస్థితి ఏర్పడకుండా, చలనచిత్ర పరిశ్రమ సాగాలంటే, కొత్తమార్గాలలో నడిచి అవధు



జెకొస్లావాకియా చలన చిత్రోత్సవంలో ప్రథమబహుమతి గడించుకున్న "జాగ్తే రహో" చిత్రం నిర్మాత, నటుడు రాజ్ కపూర్. రాజ్ చేతిలో ఉన్నదే జెక్ బహుమతి ఈ చిత్రానికి రచన దర్శకత్వం అమిత్ మిత్ర, శంభు మైత్ర నిర్వహించారు

లను పెంచగల చిత్రాలు రావాలి. ఆ తరహా చిత్రాలు ఆర్థికంగా దెబ్బతింటే, నిర్మాతలు సహజంగానే నిస్పృహ చెంది, మళ్ళీ పాత గాడిలో పడిపోతారు. ఉత్సాహంతో ముందుకువచ్చి, సాహసంతో కొత్త ప్రయత్నంచేసి దెబ్బతిన్న యువకులు అలా నిస్పృహ చెందడం పరిశ్రమకే శ్రేయస్కరం కాదు వారిని ఆదరించవలసిన విధి ప్రజలది; ప్రభుత్వానిదికూడా. ఆర్థికంగా దెబ్బతింటున్న 'ఈనిర్మాతను' ప్రభుత్వం వినోదం పన్ను మినహాయింపువంటి మార్గాల ద్వారా ఆదుకొనడం అవసరం అవహేళనపాలు గాకుండా గౌరవించడం అవసరం. ఫిలిం పరిశ్రమను మంచిమార్గాన ముందుకు సాగించే బాధ్యతను చిత్రాలు తీసేవారే కాదు; చూసేవారుకూడా వహించడం అవసరం.



విఠల్ ప్రొడక్షన్స్ వారి 'వద్దంటే పెళ్ళి'లో రమణారెడ్డి, చలం, సి. ఎస్. ఆర్.



విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి "గంగా గౌరీ సంవాదం"లో సీతారామమ్మ, హేమలత, రమణారెడ్డి, సీతారాం, చంద్రశేఖర్

'గంగాగౌరీసంవాదం'

కన్నతల్లి, – తన మీది అభిమానంతోనే కాక–కట్టుకొన్న మొగుణ్ణి ఆడిపోస్తూ ఉంటే, చూస్తూ నిల్చున్న గంగకు దుఃఖం పెల్లుబికివచ్చింది. ఇటు తల్లి మాటలంటున్నాదన్న బాధ, అటు తన సవతి గౌరి తగవులాడినందుకు కోపం, భర్త వెనకేసుకురాలేదన్న అలక, ఉక్రోషం, మధ్య తన తండ్రి కూడా మాటలు పడుతున్నాడన్న బాధ అన్నీ కలసి, కరిగి కన్నీళ్ళై ప్రవహిస్తున్నాయి.

తల్లి తండ్రీ వాదులాడుకుంటున్నారు.

"కాళ్లా వేళ్లా పడి బతిమాలినా వినక, మేనరికాన్ని కాలదన్ని, ఆ బూడిదపూసుకు తిరిగేవాడికి పిల్లని కట్టబెట్టారు. సవతి పోరు పెడితే, ఆ మొగుడు పరాకు చిత్తగిస్తే, ఈ వెర్రిపిల్ల ఏడుస్తూ ఇంటికి పరుగెత్తుకొచ్చె... చెపితే విన్నారూ..." అంటూ చివాట్లు పెడుతోంది తల్లి.

"నేనా?...మధ్య నేనా ఇందుకు బాధ్యుణ్ణి? నేనేం చేస్తాను గనక?" అంటున్నాడు తండ్రి. మేనమామ, మేనత్త, నోట మాట లేకుండా నిల్చుని చూస్తున్నారు. కన్నీటి తెర వెనకనించి ఈ దృశ్యాన్ని చూస్తున్న గంగకు ఏం పాలుపోలేదు. అక్కడ నిలువలేనన్న సంగతి మాత్రం



రోహిణీవారి 'గజదొంగ' చిత్రంలో ఆర్. నాగేశ్వరరావు.

తోచింది. చేతులలో తల దాచుకుని ఒక మూలగా వెళ్లి నిల్చుంది. 'బాధ్యురాలను నేనే కాబోలు. తప్పంతా నాదే కాబోలు' అనుకుంటోందనిపించేలా...

మిడ్ క్లోజప్‌తో ఆరంభమైన ఆ షాట్, కామెరా వెనక్కు సాగి 'ఫుల్ షాట్' రేంజిలోకి రాగానే కట్ అన్నారు దర్శకుడు వి. ఎన్. రెడ్డి.

ఉద్రిక్త వాతావరణంలో సాగిన ఈ కుటుంబ ఘర్షణలో తండ్రిగా నాగయ్య, తల్లిగా హేమలత, గంగగా కృష్ణకుమారి నటించారు. గంగ మేనత్త మేనమామలుగా ఋష్యేంద్రమణి, ఆర్. వి. కృష్ణారావు నటించారు. గౌరి భూమికను కృష్ణకుమారి అక్క జానకి నిర్వహిస్తోంది. ఇతర ముఖ్య నటులు కాంతారావు, సి. హెచ్. నారాయణరావు.

విజయగోపాల్ ప్రొడక్షన్స్ పేరిట ముంగమూరు బ్రదర్స్ (శ్రీ శేషాద్రి, శ్రీ రాధాకృష్ణ) శ్రీ చంద్రశేఖర్ రెడ్డి కలసి నిర్మిస్తున్న ఈ చిత్రం పేరు 'గంగా గౌరీ సంవాదం' రచయిత పరశురాం, సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, ఛాయాగ్రహణం, దర్శకత్వం వి. ఎన్. రెడ్డి నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రం నాలుగింట మూడు పాళ్లు పూర్తి అయిందని నిర్మాతలే ప్రది చెప్పారు. ★

చాప్లిన్ కొత్త చిత్రం:

ఎ కింగ్ ఇన్ న్యూయార్క్

దేశ దేశాలలోను ఉత్తమ చలనచిత్రం చూడాలని తహతహ లాడేవారంతా ఎదురుచూచిన చార్లీ చాప్లిన్ కొత్తచిత్రం 'ఎ కింగ్ ఇన్ న్యూయార్క్' గతమాసం లండన్ ప్రేక్షకులను, విమర్శకులనూ, ఆనందంతో, సానుభూతితో, అభిమానంతో కంట



నీరు తిరిగేపర్యంతం నవ్వించి నవ్వించి వదిలి పెట్టింది. ఏడాదివాడు, చాప్లిన్ ఈ చిత్రం ఆరంభిస్తున్నపుడు దాన్నిగురించి విలేకరులతో మాట్లాడుతూ 'మొదట్నించి చివర దాకా ఈ చిత్రం ప్రేక్షకులను పొట్ట చెక్కలయేలా నవ్విస్తుంది' అని 'హెచ్చరించాడు'. అంతపనీచేసి చూపాడు. కథ, సంగీతం దర్శకత్వం, ముఖ్య భూమికకూడా చాప్లినే నిర్వహించాడు.


యూరప్ లోని ఒకానొక చిన్న దేశంలో, రాజ్యభ్రష్టుడైన షాడోవ్ విమానంఎక్కి సరాసరి, అనాథరాజ శరణాలయం అమెరికా దేశానికి పారిపోతాడు; అణుశక్తిని శాంతి ప్రయోజనాలకు వినియోగించే ఒక పథకం ముసాయిదాలు, ఖజానాలో కాస్త డబ్బూ వెంటపట్టుకుని.

న్యూయార్కులో దిగగానే అక్కడి తన రాయబారి, తన ప్రధానమంత్రి కలుసుకుంటారు. అంతలో పత్రికా విలేకరులు ఈ మాజీరాజును చుట్టు ముడతారు.

"రాజుగారు ఇప్పుడే ఓ పెద్ద విప్లవంలోంచి బయటపడ్డారు. అందుచేత ప్రశ్నలతో ఆట్టే వేధించకండి" అని మంత్రి చెబుతాడు. విలేఖరులుకూడా ఆట్టె అడగరు. 'ఖజానాలో డబ్బుతెచ్చారటగా?' అంటారు ముందు. అవన్నీ సొంతవిషయాలు అంటాడు షాడోవ్ ప్రభువు (చాప్లిన్) ముసిముసి నవ్వులు నవ్వుతూ. ఆ తరవాత 'చిల్లర ప్రశ్నలకి జవాబిస్తూ, అణుశక్తిని శాంతికి వినియోగించే పథకం ఒకటి అమలుజరుపబోయి ఇలా దెబ్బతిన్నట్లు షాడోవ్ వివరిస్తాడు. గోష్ఠి తరువాత, విమానాశ్రయాధికారులు షాడోవ్ వేలిముద్రలు తీసుకుంటారు (ఇది అక్కడి కట్టుదిట్టాలలో ఒకటి) అముద్రలు వేస్తున్న ముహూర్తానే, అమెరికా ఆదరణ, ఔదార్యం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ తనను ఎంత ముగ్ధుణ్ణి చేశాయో చెబుతాడు షాడోవ్ గంభీరంగా.

అనక, ఆరాజూ, రాయబారీ న్యూయార్క్ నగర సౌందర్యాన్ని చూడబోతారు. గాని వీధులలో రొదలలో, గోలలో ఒకళ్ళమాట ఒకళ్ళకు వినబడదు. పది లక్షల డాలర్ల మాట స్మరిస్తే కంటనీరు గిరుక్కున తిరుగుతుందని ఎవడో గాయకుడు సంగీత పద్ధతిలో ఘోషిస్తూ ఉంటాడు. చెవులు చిల్లులు పడే ఆ ఘోషకి తట్టుకోలేక, సినిమాలో స్థిమితంగా మాట్లాడుకోవచ్చునని ఒక సినిమాకి వెళ్తారు. అక్కడ రాక్ ఎండ్ రోల్ డాన్సర్ లతో (ప్రేక్షకులే) నానాగోలగానూ ఉంటుంది. తరవాత ఆట మొదలవుతుంది. "రాబోయే ఆకర్షణలు!!" అని కొత్తచిత్రాల ట్రెయిలర్ లు చూపిస్తారు. ఒకడు తుపాకి పట్టుకు వస్తాడు. 'వీడు హంతకుడు. బరి తెగించిన వాడు.. కుటుంబసమేతంగా వచ్చి చూచి ఆనందించుడు' అని దానిమీద రాత! అలాటి వేమరినాలుగు 'శాంపిల్స్' చూసి భరించలేక రాజుగారు ఇవతలకొచ్చేస్తారు. అక్కడ ఉత్సాహంతో నృత్యంచేస్తున్నారు జనం. గోలతప్పలేదు. ఎవడికో ఉత్సాహం కాస్త ఎక్కువై, రాజుగారినెత్తిన ఓ దెబ్బ వేస్తాడు.

ప్రధానామాత్యుడు, ఖజానాడబ్బు కాస్తా పట్టుకు పరారైపోయినట్లు తెలుస్తుంది అంతలో. ఇంకేముంది, రాజ్యభ్రష్టుడైన



రాజ్ కపూర్ కొత్తచిత్రం "అబ్ దిల్లీ దూర్ నహీ" లో జగ్ దీప్, యాకూబ్.



పాల్ ఆనంద్ నిర్మిస్తున్న "షాన హింద్" లో కుంకుం.

ఎ కింగ్ ఇన్ న్యూయార్క్

రాజు దివాలా కూడా తీశాడు. అప్పులు కుప్పలుగా తయారవుతాయి.

ఎటూ పాలుపోని పరిస్థితిలో, షాడోవ్, ఒక చిట్టి తల్లి రిమాని ముచ్చటపడి, ఆమెతో విందారగించబోతాడు. అక్కడహామ్లెట్ లో రెండు పద్యాలు చదివి, చూడ ముచ్చటగా కీర్తపడతాడు రాజాగారు.. గోడల వెనక దాగిఉన్న టెలివిజన్ కొమెరాల పుణ్యమా అని ఈ సన్నివేశాన్ని దేశంలో అంతా చూస్తారు. తక్షణం విస్కీలు, జున్ను, జుట్టు క్రాప్ అమ్మకం పెనీలవాళ్ళంతా, ప్రచార కార్యక్రమంలో పాల్గొనమని, బోలెడు డబ్బిస్తామని రాజాగారిని బలవంత పెడతారు. అప్పులబాధ ఎక్కువైనందువల్ల, ఇష్టం లేకపోయినా తప్పనిసరిగా ఒప్పుకుంటాడు షాడోవ్. ఫలానా (మాజీ) రాజుగారు ఫలానా జున్నో విస్కీయో బాగుందంటే ఎంత గొప్ప! తరవాత, ఇంకో మందు ప్రచారంకోసం, 'ప్లాస్టిక్ సర్జరీ' చేయించుకుని నవయౌవనుడి ముఖాన్ని ఏర్పాటు చేయించుకుంటాడు: ఆ మందు పుచ్చుకుంటే, ఇంత బలం వస్తుందని భావం...

తరవాత, 'అన్అమెరికన్'లుగా ముద్ర పడ్డ దంపతులబిడ్డడుఒకడు దిక్కు లేక అల్లాడుతూంటే ఈ రాజు అతన్ని దగ్గరకు తీసి ఆదరిస్తాడు. అక్కడితో ఈ రాజు కూడా 'కమ్యూనిస్టు' అన్న ఆరోపణపై చిక్కులో పడతాడు. అతన్ని విచారం చేయబోయిన వాళ్ళ మీద నీళ్ల పంపుతో నీళ్ళు చిమ్మి, వ్యవహారం అంతా నానాగందరగోళంగా, అవకతవకగా తయారుచేస్తాడు. చివరకి, నిర్దోషి అనిపించుకుని బయటపడతాడు. ఆనక దిగులుగా యూరప్ ప్రయాణం కడతాడు. ఇదీ కథ.

ఒక దేశంలో ప్రజల జీవన విధానాలనూ, ఒక వ్యవస్థ తీరుతెన్నులనూ దుయ్యబడుతూ చాప్లిన్ చిత్రం నిర్మించడం ఇది రెండోసారి అనీ, ముఖ్యంగా ఈ సారిఅమెరికాను హేళనచేసివిమర్శించేఈకథ చివరిభాగంలో విమర్శ మరీ బట్టబయలుగా ఉన్నందువల్ల, ఆ భాగం, చాప్లిన్ ప్రతిభకు, స్థాయికీ తగ్గట్టు లేదనిపించిందనీ లండన్ విమర్శకులు ఈ చిత్రంపై సమీక్షలో పేర్కొన్నారు. ★

విక్రమార్కుడి మార్కు సింహాసనం

(23 వ పేజీ తరువాయి)

దేమో...రెండ్రోలు కోసారేనా తిండి దొరుకుతుంది అనుకుంది. ఇలాంటివాడికి సాయం చేస్తేనే నయం. చూట్టానికి బాగు న్నాడు. మంచివాడిలా, బుద్ధిమంతుడిలా ఉన్నాడు. లేపోతె ఎవడన్నా నరసగా ఇన్నిసార్లు నిజం చెప్తాడా?...

'ఏమిటి ఆలోచిస్తున్నావ్' అన్నాడు రాజు లేచికూర్చుని.

'నీ గురించే... నాకు నాలుగైదు కంపె నీలవోళ్ళు తెలుసు. నా రొంటరా ఏసా లిప్పిస్తా...రెండో మూడో ఇత్తారు. కమీ షను తెగ్గోసుకున్నా కూడుగడు స్తదిలే. ఆనక అదిట్టం ఉంటే నివ్వే పెద్దోడివాతావు ఎవుడు సూశాడు' అంది నరసు.

'ఛీ ఛీ...చివరకి ఎక్స్ట్రా వేషాలె య్యమంటావా? ఎవరను కున్నావు నేను... ఆరు డ్రామాల్లో హీరో వేశాను...ప్రాణం పోయినా సరే హీరో రోలుకి తక్కువ ఏదీ పుచ్చుకోను' అన్నాడు రాజు కొంచెం కోపంగా.

నరసు నవ్వాపుకుంది. 'పోన్లే అలాగే ఈరోరోలే ఏద్దుగాని. ముంగల చిన్న చిన్న సీనుల్లో యాసం ఎయ్యాలి... నేనో, మా సుబ్బులో, ఊర్మిలో ఎవరో నీపక్కని ఈరోయినుంటారు' అంది.

రాజు గంభీరంగా తల తాటించాడు. నరసుమీద జాలేసింది. ఏమనడానికీ తోచలేదు.

'వెర్రిబాగులపిల్లా' అన్నాడు ఆలోచించి. "అమాయకురాలా. కఠినంగా మాట్లాడానని బాధపడద్దు. నేను నీతోటిగాని నీ సుబ్బులుతోటిగాని ఆఖరికీ ఆ దేవరూ ఆ యూర్మిళ తోటీగాని నటించను...నీయాశ నిరాశ చేయుచున్నందుకు క్షమించు లక్షీన్నరసూ" అన్నాడు.

'కొత్తలో నాయంటోళ్ళతో కాపోతే, అంజలీదేవికి ఈరో ఏత్తావేటి?"

"యస్... ఇఫ్ నాట్ సావిత్రి.... ఆర్, జానకి" అన్నాడు రాజు.

"ఆర్. జానకి అని ఎవరూ లేదు. షావుకారు జానకి ఉంది" అంది నరసు.

'నీ కింగ్లిషు అస్సలు రాదన్న మాట' అన్నాడు రాజు.

'మద్దిన ఇంగిలీసు గొడవెందుకు'... అంది నరసు చిరాగ్గా.

'అయామ్ సారీ'

'మల్లీ అదేకూతా...ఇక్కడెవ్వరికీ బయ్యం లేదు. యాసం ఎయికపోతే మానెయ్యి నాకేం మద్దిని!

'అది కాదు నరసూ ...నేను హీరో వెయ్యాలనివచ్చాను. ఫిఫ్టీన్‌రూపీసు ప్రొడూ సరు బ్రదరిల్లాకి ఫీజుకూడా ఇచ్చానా ఆ కాంట్రాక్టు వదిలిస్తే ఎలా చెప్పు...అందులో మరి ఏ సావిత్రో ఎవరో ఉంటారా... అంతే కాని...నువ్వు నచ్చలేదని కాదు... ఆ మాటకొస్తే నువ్వు ఏంజల్‌లా ఉన్నావు. నీ అంత మంచి పిల్లని ఎక్కడా చూళ్ళేదు" అన్నాడు.

నరసు కోపం ఇట్టే కరిగిపోయింది.

"పోన్లె రాజా ... అదే పోయె. ఈరో వేసాలే ఏద్దుగానిలే...అవి దొరక్కపోతే, ఆనక చిన్నెసాలెయ్యి. నేనిప్పిస్తాను. ఎయ్యో ఒకటి దొరకేదాకా మాతోపాటే గంజో అంబలో తాగతా ఉండు. డబ్బులు కూడా లేనట్టున్నాయి' అంది.

అతి కష్టంమీద సరే నన్నాడు రాజు.

అమ్మయ్య అందినరసు. రాత్రిభోజనాలై, పడుకున్నాక, కమ్మటికల అల్లుకు చూడ బోతూ ఉండగా పక్కగదిలోంచి లీలగా రెండు డైలాగులు వినిపించాయి రాజుకు.

"నీకేం ఒళ్ళూ పై తెలుత్తున్నట్టు లేదే— ఈ యద వెవడు—ఈణ్ణెందుకు తెచ్చినట్టు. పొద్దన్నే లేసిపొమ్మను" అంటోంది నరసు తల్లి.

'అబ్బామ్మవ్...ఇట్టంవుంటేఉండు లేపోతే ఎల్లు. గాని, నా మాట కొదనపోక. నా అన్న మొగోడు లేపోతే, ఈడ పరువుగా బత కలేం. నాకు పరువుకావాల... ఈ యబ్బాయి కుంచోడు. సెప్పినట్టింటాడు. మంచేనా సెడ్డేనా అతన్ని నమ్ముకుని ఆనీడని బతకదల్చుకున్నా. ఎదవేసాలేయక... ఇపుడే సెపుతునా ఆయన ఈ యింటి కల్లుడు. అదంతే. ఎల్లుండే, మంచిమాట చేసుకుని, నాలుగు డబ్బులు చూసుకుని తిరప తెల్తున్నా...ఏ మారాజునడిగినా ఇత్తాడు పదిరూపాయలు. ఇటముంటే కూడా వచ్చి దీవించు - అంతే ఒకటేమాట, అడ్డమైన ఎదవల్నీ నమ్మి గడ్డితింటం నాకిట్టంలేదు. ఈ బుల్లోడు ఇంక మనోడు ఆడుమన్నీ మనం ఆణ్ణే నమ్ముకుని పడుండాల్సిందే. అంతే ఒకటేమాట. ఇకనుంచి ఇట్టంవచ్చిన కూతలు కుయమాక. ఆడే నేను నేనే ఆడు. అనుకో అంతే ఒకటేమాట..."

రాజుకి సంగతేమిటో తెలీటంలేదు. తన గురించే వాదించుకుంటున్నా రనిపించింది. ఏమిటో ఎందుకో అనుకున్నాడు. అసలీ నరుసెవరు; తనెవరు అనుకున్నాడు. నరసు మంచిపిల్ల అను కున్నాడు. బావుంటుంది అనుకున్నాడు. 'చాలా' అందిమనసు. మరే అన్నాడురాజు. పెళ్లాడరాదు? అంది మనసు. ఛీపో నువ్వు మరీ బడాయి అన్నాడు రాజు. ఏడిశావ్ల నీ కిష్టమేలే అంది మనసు. ఏం లేదులే నేను హీరో వెయ్యాలి...అయితేనేం పెద్ద పెద్ద సినిమావాళ్లందరూ సుబ్బరంగా పెళ్లాడి కాపరాలుచెయ్యటం లేదూ? అంది మనసు. ఔననుకో అన్నాడు రాజు. అనుకో ఏవిట్లి నీ తలకాయి. పెళ్లాడితే అదృష్టం కలిసొ స్తుందికూడా. నలుగురూ గౌరవిస్తారు అంది మనసు. పోయింటే అన్నాడు రాజు.

అంతలో పక్కగదిలోంచి ఏడుపులాటి ఎక్కిళ్లు వినబడ్డాయి. మొగుణ్ణిగొట్టి మొగసా లెక్కినట్టు నన్నుతిట్టి పైగా ఏడుపెందుకు? అంటోంది ముసలికంఠం.

'కాదు... ఏడుపుకాదు' అంటోంది నరసు.

'చూడు ఏడుస్తోంది' అంది రాజు మనసు.

'ఎందుకో తెలుసులే ... ఊరుకో బెడతా చూడు' అంటూ లేచాడు రాజు. లేచి గదిగుమ్మంలో కెళ్ళాడు.

వసారాలో స్తంభానికి చేరబడి ఉన్న నరసు దేదీప్యమానంగా వెలిగిపోతూంది. ఆ వెలుగులో మసిబారిన హరికెన్ లాంతరూ మాసిపోయిన ముసలమ్మా మసగ్గా కనబడ్డారు.

రాజుని ఆదరించి, అన్నం పెట్టిన నరసు మనసు,మధురమైన పరిమళాలుగుబాళిస్తోంది. ఆమె సిగలో మల్లెచెండు పరిమళాలు అందులోకలసి, ఆ ప్రజ్ఞ సాంతానికి జమకట్టుకోబోతున్నాయి.

గుమ్మంలో నిలిచినరాజు, గొంతు సరి చేసుకొన్నాడు మెల్లిగా. నరసు గబుక్కున తలెత్తి చూసింది రాజువంక. ఆమె నుదుట ఎర్రటిబొట్టు కెంపులావెలిగింది.మాకన్నా నా అన్నాయి ఆక్షణాన ఆమె చెంపల్లో వెలిగిన కెంపులు.

రాజు సాహసించి, తెగించి త్యాగం చేశాడు:

'ఏడవకు నరసూ ఏడవకు......ఇందాక ఊరికినే అలా అన్నాను......నీతో నిజం గానే హీరో వేషం వేస్తాలే...ఏడవకు' అన్నాడు లాలనగా.

'అబ్బె ఏడవటం లేదు' అంది నరసు రుద్ధకంఠంతో. 'ఒద్దు ఏడవకు' అన్నాడు రాజుకూడా రుద్ధకంఠంతోనే.

(సశేషం.)

ప్రకృతి పరిష్కారం

([illegible]వ పేజీ తరువాయి)

కట్టి వదరుబోతట; నడిమంతరంగా డబ్బు వచ్చేప్పటికి కన్నూ, మిన్నూ కనపడటం లేదుట—ఇంకా ఏమేమో అన్నాడు.

రెండురోజులలో వ్యాపారాలు విడిపోయాయి. టోకు వర్తకం జానకిరామయ్య వాటాకు వచ్చింది. చిల్లరకొట్టు గోవిందసెట్టి వాటాకు వచ్చింది. కొంత సొమ్ము ముజరాలు చూసుకున్నారు.

జానకిరామయ్య అంటే గోవిందసెట్టి భార్యకు అభిమానం అని పురప్రముఖులు తరచు అనుకుంటూ వుండటం వుంది. అది పనికట్టపట్టే గోవిందసెట్టిలో యీ మార్పు, త్వరలో వచ్చిందంటారు అయినా విశ్వసనీయమైన హేతువులు ఏమీ లేకపోవటం వల్ల అది అపవాదు అయివుండవచ్చు.

వ్యాపారములు విడిన కొద్దిరోజులలో జానకిరామయ్య, గోవిందసెట్టి వాటాకూ, తనవాటాకు మధ్య పెద్దగోడ కట్టేనిమిత్తే పునాది తీయించాడు. ఆ మరునాడు కోర్టు నుండి పని ఆపవలసిందిగా ఉత్తరువు వచ్చింది తరువాత గోవిందసెట్టి వద్దనుండి, ఉమ్మడి వ్యాపారంమీద వచ్చిన లాభములతో కొనిన మేడ కనుక, ఆ వ్యాపారముల వాటాల నిష్పత్తిప్రకారం తనకు మేడలో పదిఅణాల ఏనిమిదిపైసాల వాటా రావలసి వుందనీ, అది ఇవ్వనిపక్షంలో కోర్టు కెక్కవలసి వస్తుందనీ, ఖర్చులు ఇయ్యవలసి వుంటుందనీ నోటీసు వచ్చింది. మేడ ఇరువురి పేర్లను కొనినది కాని, వ్యాపారములోని వాటాలప్రకారం కాదనీ, అందుచేత తనకు చెరిసగం వాటా ఉందనీ, తక్కిన సంప్రదాయములతో, తిరిగి నోటీసు పంపేడు జానకిరామయ్య.

ఆ దావా విచారణకు హైకోర్టుదాక వెళ్ళటానికి మూడు సంవత్సరములు పట్టింది. క్రింది రెండు కోర్టులలోనూ జానకిరామయ్యే నెగ్గాడు. గోవిందసెట్టి పట్టుదల వదలలేదు. ప్లీడర్ల, రాజీచేసే ప్రయత్నం నీరుకారింది.

ఈ మూడు సంవత్సరములలోనూ, రాజమండ్రిలో పెద్దమనుష్యులకూ, ప్లీడర్లకూ బాగా పనితగిలింది. జానకిరామయ్య ఇంటి వాటాలోని వాడకంనీరు, గోవిందసెట్టి వాటాలోనికి వస్తోంది. అని ఒకదావా, జానకిరామయ్య నోటికి ఇమం వచ్చినటూ నిందిస్తున్నాడని పరువునష్టం దావా, ఇంకా ఇటువంటివి సెట్టిచేసినవి ఎన్నో దావాలు! దాంతో క్రిమినల్ కోర్టుకూ, మునిసిపల్ కోర్టుకూ, సివిల్ కోర్టుకూ, బెంచికోర్టుకూ, అన్నింటికీ పనితగిలింది. జడ్జీల తీర్పులు తీర్పులలాగే ఉన్నాయి. అపీళ్ళు, కొత్త తగవులు వస్తూనే వున్నాయి.

ప్రాణస్నేహం ఎక్కడో అక్కడే బద్ధవైరం!

*   *   *

అది ప్రకృతికి ఆగ్రహం కలిగిన సమయం—

అవి జలప్రళయం సంభవించిన రోజులు:

రాజమండ్రీ రైలు వంతెనవద్ద గోదావరి నది నీటిమట్టం అరవైఅయిదు అడుగులు దాటింది అంటే దాటింది అన్నారు! పురంలో కొన్ని పేటలు ఖాళీ చేయవలసిందిగా గవర్నమెంటు వారి ఉత్తరువు.

ఆనాటి కాళరాత్రి ఆగ్రహం కలిగి, కట్టలు తెంచుకున్న గోదావరీమతల్లి "మీ కట్టలు నాకు చెలియలి కట్టలు" అన్నట్లు తక్కిన గ్రామాలవలెనే రాజమండ్రీని కూడా కబళింప చూసింది. రాజమండ్రీలో అనేక ప్రాంతములు నీటిమయం అయ్యాయి. ఇళ్ళూ, మేడలూ, నురగలు గక్కే నదిలో చిన్నచిన్న లంకలలా పొడ చూపాయి!

ప్రాణములు అరచేతుల్లో పట్టుకుని మెరకలు చేరిన ప్రజానీకం—

ఊరు ఊరంతా గగ్గోలు!...

తిండికి తల్లుల ముఖాలు చూచి ఏడ్చే పిల్లలు—

సహనమే తమధర్మం అన్నట్టు దీనంగా పతులవైపు చూచే సతులు—

"ఇల్లూ! సామాను! దూడలూ!" అంటూ తలలుపట్టుకు కూర్చున్న పురుషులు—

"ఇదే మంచిసమయం, మించిన దొరకదు" అనే దుండగీడులు!—వారికి "ఉన్నాం జాగ్రత్త!" అని హెచ్చరిస్తూ, "మీకూ, మీ సామాన్లకూ ఏవిధమైన భయం లేదు"అని ప్రజలకు అభయహస్తం చూపించే దేశభటులు—

కట్టు కంరలకు కట్టిన కన్నెలువిప్పే దారిలు లేక రొదచేసే పశుసంతతి—

అంతా!—అన్నీ!

ఇంకా:

నానిన గోడలనూ, మేడలనూ పడద్రోసే కుత్సిత బుద్ధితో శృంఖలాలు తెంచుకున్న తుమ్మలామ్ కెరటుంగలు—

ఆ వాడలలో నాటి భీభత్సనాట్యం—

నది తగ్గకముందే బజారు మెరకలమీద చేరిన జనం, గోవిందసెట్టీ, జానకిరామయ్యల మేడ, సరకు నిల్వచేసిన షెడ్డులూ, కూలేయి అంటే కూలేయి అన్నారు!

"ప్రకృతిచేసిన పరిష్కారం!"

"ప్రకృతి ఇచ్చిన తీర్పు!"

"పాపం! నోసటివ్రాత, ఎవరు తప్పించగలరు!"

"నలుగురితో పాటు నారాయణ!"

"అంతా దైవకృప!"

అవీ లోకంలోని మాటలు.

ధనం కూడవేస్తే స్వప్రయోజకత్వం! పోతే దైవకృప!

భగవంతుడిమీద అభాండం!

అసలు కీలకం కాలంచేతుల్లో కీలుబొమ్మ మానవుడు.

ప్రాణంపోసేది కాలం! తీసేది కాలం!—

ధనం ఇచ్చేది కాలం! భికారిని చేసేది కాలం!—

కాలంతో బుద్ధి మార్పులు! కాలంతో పరిస్థితి తేడాలు!—

కాలం లోహపు కౌగిలిలో జడపదార్థం మానవుడు!—


అనంతకాలప్రవాహంలో మానవుడు z బుద్బుదం!!

కేవలం నిమిత్తమాత్రుడు!

అదే కాలం నేర్పేపాఠం! గుణపాఠం!


యుగయుగాల చరిత్రలు చాటే సత్యం!

★





Printec anc Publishec for Nageswara Rac Estates (Private) Ltd by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street Madras-1 Editor S Sambhu Prasad



వనసుందరి [శిల్పం]


—ఫొటో: ఎస్. రామకృష్ణ]

బిడ్డల పాలసీలు

చిన్న చిన్న సమస్యలు పెరుగుతాయి...

ఈ రోనాడు ఆడుతూ పాడుతూ తిరుగుతూండే బాలుడే రేపు సరపాదించేవాడు. నానాటికీ క్లిష్ట సమస్యలతో నిండిపోతూవున్న యీపోటీ ప్రపంచంలో అతని విద్యకు సహాయకారిగా ఏమైనా దాచిపెట్టారా? మరి మీ కుమార్తె విషయం? ఆమె కూడా ఓ పెద్ద సమస్యనే మీ ముందు వుంచుతూ వుంది - విద్య. వివాహం యింకా మిగతా ఖర్చులూ

నిశ్చయంగా ప్రతి తండ్రి జీవితంతోనూ. ఆర్థిక సమస్య అతని తలపై ఎల్లప్పుడూ భారంగా ఎదురు చూస్తూనే వుంటుంది. దానికి తగిన విధంగా కూడ బెట్టడం ఎలా? చిన్న చిన్న మొత్తాలుగా కూడా బెట్టండి. ఎందుకంటే సమయం వచ్చినప్పుడు ఎలాంటి చీకూ చింతా లేకుండా, యీ సమస్యలను తేలికగా ఎదుర్కోవొచ్చు. ఒక వేళ ఆ బాధ్యతలను మీరు నిర్వర్తించ లేక పోయినప్పటికీ, వాటిని తగు జాగ్రత్త తీసుకునేవారున్నారనే మనశ్శాంతి, మీ కెల్లప్పుడూ వుంటుంది. జీవిత బీమా అంటే ముఖ్యంగా అదే. అగాధమైన భవిష్యత్తుకు తగువిధంగా కూడబెట్టడం—పోలసీ దారుడు బ్రతికివున్నా లేకపోయినా.



ప్రతి తండ్రి తప్పకుండా చదవవలసిన మూడు రకాల పోలసీలు వున్నాయి. *ఎడ్యుకేషనల్ ఏన్యూటీ పోలసీ, వివాహ ఎండోమెంటు పోలసీ, యిక బిడ్డలకు సంబంధించిన పోలసీ.*

మొదటి రెండూ చదువుకు, వివాహానికి తగిన మొత్తం చేకూర్చి పెడతాయి. ఇక మూడవది. బిడ్డలకు సంబంధించినది తండ్రి తన పిల్లల కొరకు చేయించేది అయితే యిందులో జీవితపు రిస్కు ఒక ప్రత్యేకమైన వయస్సునుండీ ప్రారంభమవుతుంది. లాభం? పిల్లవాడు చాలా తక్కువ రేటు కల్గిన ప్రీమియమ్‌తో ఎక్కువ మొత్తానికి బీమా చేయబడుతాడు. పైగా యిది పెరిగిన తన కుమారునికి విలువైన ఒక బహుమానం లాంటిది. ఎందుకంటే యీ పోలసీ ముందు కూడా భరించ వలసివ అవసర ముంది కనుక జీవితంలో అడుగు బెడ్తూనే మిత వ్యయాన్ని గూర్చి అతడు పాఠాలు నేర్చుకుంటాడు.

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ASP/LIC 21